www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 248 | బుధవారం 28-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



ముంబై చేరిన శ్రీదేవి భౌతికకాయం

నేడు సంతాపసభ, అంత్యక్రియలు


మూడురోజులుగా సినీ పరిశ్రమ మూగవేదన



వీడిన మిస్టరీ

సినీనటి శ్రీదేవి మృతిపై అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. ఆమె అపస్మారక స్థితిలో నీటిలో మునిగి చనిపోయిందని అక్కడి అధికారులు తేల్చారు. స్థానిక చట్టాల ప్రకారం లాంఛనాలన్నీ పూర్తి చేసుకున్న అనంతరం శ్రీదేవి భౌతికకాయాన్ని భర్త బోనీ కపూర్‌కు అప్పగించారు.

11లో


Dubai Media Office
Dubai Public Prosecution stressed that all regular procedures followed in such cases have been completed. As per the forensic report, the death of the Indian actress occurred due to accidental drowning following loss of consciousness. The case has now been closed.

అనుమానాల్లేవ్.. కేసు మూసివేత

ఎట్టకేలకు అందాల నటి శ్రీదేవి మృతి కేసు వివాదం ముగిసింది. అంతకుముందు ఆమె చనిపోవడానికి గల కారణాలపై వచ్చిన కథనాలు అనుక్షణం సంచలనాన్ని రేపాయి. ఎన్నోమలుపులు, ఎన్నో అనుమానాల చుట్టూ తిరిగి చివరకు ప్రమాదవశాత్తు జరిగిన మరణం తప్ప ఇందులో ఎలాంటి కుట్ర కోణం లేదని దుబాయ్ ప్రాసిక్యూషన్ అధికారులు తేల్చేశారు. దర్యాప్తు ఇక ముగిసిందని, కేసును క్లోజ్ చేశామని, ఇక ఎలాంటి అనుమానాలు లేవంటూ స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రాసిక్యూషన్ అధికారులు అధికారిక ప్రకటన చేశారు.

నేటి నుంచి

ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి
- మంత్రి గంటా వెల్లడి



విశాలాంధ్ర-విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి మార్చి 19వ తేదీ వరకు జరగనున్నాయని, దీనిపై అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విశాఖలోని గవర్నర్ బంగ్లాలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ, ఒకేషనల్ బాలుర, బాలికలు మొత్తం 10 లక్షల 26 వేల 891 మంది హాజరు కానున్నారని, 1423 పరీక్షా కేంద్రాలు, 48 సెల్ఫ్ సెంటర్లు, 116 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని అన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. విశాఖ జిల్లాలో లక్షా 6 వేల 867 మంది విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు ఇంటర్‌మీడియట్ బోర్డు కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 0866-2974130, 08662970056 (విజయవాడ), 0891- 2552854 విశాఖలో సంప్రదించాలని కోరారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతోపాటు, ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్టు చెప్పారు. కార్పొరేట్

- మిగతా 2 లో

కందిపోతున్నారు

పంట ఎక్కువ : కొనుగోళ్లు తక్కువ

- కొనసాగుతోన్న దళారుల దందా
- మార్క్‌ఫెడ్ కేంద్రాల చుట్టూ చక్కర్లు కొడుతోన్న రైతన్న



విశాలాంధ్ర ప్రతినిధి, అనంతపురము : జిల్లాలో 2017 ఖరీఫ్ సీజన్‌లో వేరుశెనగ తక్కువగా సాగు కాగా పలువురు రైతులు కంది సాగు వైపు దృష్టి సారించడంతో జిల్లాలో ఈ ఖరీఫ్ లో ఎక్కువ మొత్తంలో కంది పంట సాగయ్యింది. ఈ సంవత్సరం ఏకంగా సాధారణ సాగు కన్నా 50 శాతం అధికంగా కంది పంట సాగు చేయడం గమనార్హం. ప్రతి ఏటా వేరుశెనగ పంట సాగుతో ఆర్థికంగా కుదేలు అవుతున్న రైతన్న కంది పంట

- మిగతా 2 లో

వారం నుంచి తిరుగుతున్నా

తాడిపత్రిలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రం వద్దకు వారం రోజుల నుంచి తిరుగుతున్నా ఏ మాత్రం ఫలితం లేదు. నేను అక్కడికి పోయిన రోజు నుంచీ టోకన్ లు అయిపోయినాయన్న సమాధానం తప్పించి సరైన సమాధానం ఇచ్చే వారే లేరు. ఇప్పటివరకూ ఎంతమంది రైతులకు టోకెన్‌లు ఇచ్చారన్నది చెప్పడం లేదు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాను అయితే పలువురు దళారులు క్వింటాళు కందులు నాలుగు వేలకు కొనుగోలు చేస్తామని తిరుగుతున్నారు.

పున్నపు వెంకటరాముడు, రైతు, నార్పల

ప్రచారార్భాటమే...



- నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదు
- మండిపడుతున్న యువత

విశాలాంధ్ర-విశాఖపట్నం : జాబు కావాలంటే బాబు రావాలని 2014 ఎన్నికల్లో రాష్ట్రమంతా బాకా వూదీ ప్రచారం చేసి గద్దెనెక్కిన చంద్రబాబు గడిచిన నాలుగేళ్ళల్లో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోగా, ఉన్న ఉద్యోగ, ఉఉపాధి అవకాశాలను దెబ్బతీసేలా రాష్ట్రప్రభుత్వ విధానాలున్నాయని విద్యార్థులు, యువత మండిపడుతున్నారు. లక్షలాదిమంది పట్టాలు చేతపట్టి ఉద్యోగ అవకాశాలకోసం రాష్ట్రం దాటి వలసలుపోయే పరిస్థితులు దాపురించింది. వరుసగా మూడేళ్ళు విశాఖలో పెట్టుబడుల సదస్సులు పెట్టి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారే తప్ప ఒరిగిందేమి లేదని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. మరోపక్క పరిశ్రమల పేరిట కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడుదారులకు రాష్ట్రంలో ఉన్న భూమినన్న దోచిపెడుతున్నారని విపక్షాలు మండిపడుతున్నాయి. మొదటి ఏడాది లక్ష కోట్లు పెట్టుబడులకు ఎంఓయూలు జరగగా 5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. రెండవ సదస్సులో 2లక్షల 30వేల కోట్లు ఒప్పందాలు జరగగా 8లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఏకంగా మూడవ ఏట తాజాగా ఈ నెల 24, 25, 26 తేదీల్లో మూడు రోజులపాటూ హట్టహాసంగా సాగిన పెట్టుబడుల సదస్సులో 4లక్షలా 39వేల కోట్లు పెట్టుబడులకు ఎంఓయూలు జరిగినట్లు 11 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పడంలో నిజమెంతని, రాష్ట్రానికి ఎన్ని

- మిగతా 2 లో


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన ముప్పాళ్ళ, జంగాల

ఇవన్నీ... నిజమేనా..?


శ్వేతపత్రానికి రామకృష్ణ డిమాండు

విశాలాంధ్ర -మంగళగిరి రాష్ట్రానికి ఎన్ని లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయి? ఎక్కడెక్కడ పరిశ్రమలు వచ్చాయి? ఎన్ని లక్షల మందికి ఉపాధి చూపారో రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండు చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పేదవారికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. నిజంగా రాష్ట్రానికి అన్ని లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చివుంటే ఈ పాటికే లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు వచ్చివుండేవని, పారిశ్రామిక ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో పాటు రాష్ట్ర భవిష్యత్తు మారిపోయేదన్నారు. మరో వైపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు రాష్ట్రానికి ప్రత్యేక హోదా అక్కరలేదని, అది లేకపోయినా పెట్టుబడులు వస్తాయని చెపుతున్నారని, చూస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, హరిబాబు దొంగనాటకం ఆడుతున్నట్లుగా వుందన్నారు. అనంతపురంలో కియా కార్ల ఫ్యాక్టరీ కూడా

- మిగతా 2 లో

కేంద్రంపై ఒత్తిడి పెంచుదాం..

- 40 ఏళ్ళ రాజకీయ ప్రస్థానంపై ప్రశంసలు
- శ్రీదేవికి నివాళులు
- రాష్ట్రానికి జగన్ అపఖ్యాతి తెస్తున్నాడు
- సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు



విశాలాంధ్ర అమరావతి : రాష్ట్ర ప్రయోజనాల సాధనలో రాజీ పడేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం కోసం రాజకీయ జీవితం అంకితమన్నారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం పక్కన ఉన్న గ్రీవెన్స్ భవనంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు రాజకీయ జీవితం ప్రారంభించి 40 ఏళ్లు గడిచిన సందర్భంగా సీఎం కేక్ కట్ చేయగా, పార్టీ నేతలు కేకు తినిపించి అభినందనలు తెలిపారు. 40ఏళ్ల రాజకీయ జీవితంపై గ్రీవెన్స్ కార్యాలయం వద్ద ఫొటోగ్యాలరీ ఏర్పాటు చేశారు. ఈ ఫొటో గ్యాలరీ నిర్వహించిన ఆర్టిస్ట్ బాలును నేతలు అభినందించారు. టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ప్రముఖ సినీనటి శ్రీదేవి మృతికి సంతాపం తెలియ చేస్తూ రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

చంద్రబాబు రాజకీయ ప్రస్థానం స్ఫూర్తిదాయకం..

చంద్రబాబు రాజకీయ ప్రస్థానం ఆదర్శనీయమని పలువురు నేతలు కొనియాడారు. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలనే

- మిగతా 11 లో

నాగాలాండ్‌లో 75, మేఘాలయలో 67 శాతం పోలింగ్ 9లో

ఆర్టీసీకి రెండు జాతీయ అవార్డులు 11లో

ఇదీ లోకం!



మూడవ అభ్యర్థిపై టీడీపీలో సస్పెన్స్

బీజేపీ వైఖరి తేలక సీఎం నిర్ణయంలో జాప్యం




విశాలాంధ్ర-అమరావతి : త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మూడవ అభ్యర్థిని నిలబెడుతుందా లేదా అనే విషయంపై ఆ పార్టీలో సస్పెన్స్ కొనసాగుతోంది. ప్రస్తుతం శాసనసభలో బలా బలాలను బట్టి టీడీపీకి 2, వైసీపీకి 1 స్థానం దక్కుతాయి. మొత్తం మూడు రాజ్యసభ స్థానాలకు మార్చి 23న పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం శాసనసభలో పార్టీల బలాబలాలు ఇలా ఉన్నాయి. టీడీపీ 105, వైసీపీ నుండి టీడీపీలోకి ఫిరాయించినవారు 22, బీజేపీ 4, వైసీపీకి 44 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక్కో రాజ్యసభ అభ్యర్థికి 45 మొదటి ప్రాధాన్యత ఓట్లు దక్కితే గెలిచినట్లే. అయితే టీడీపీకి రెండు స్థానాలు దక్కగా మిగులు ఓట్లు బీజేపీతో కలుపుకొని 41ఓట్లు ఉంటాయి. వైసీపీకి 44. 45కు ఒకటి తక్కువ. టీడీపీకి మూడు తక్కువ. రాజ్యసభ ఎన్నికల నాటికి వైసీపీ నుంచి టీడీపీలోకి మరికొందరు ఎమ్మెల్యేలు చేరతారని ఇటీవల వరకు ప్రచారం జరిగింది. అయితే కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందంటూ మిత్రపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం కేంద్రంపై పోరాటానికి దిగింది. బీజేపీ నేతలు కూడా టీడీపీపై విమర్శలకు దిగారు. ఎంపీలు పార్లమెంట్‌లో

- మిగతా 11 లో

ఏఐకేఎస్ అధ్యక్షులు, సీపీఐ నేత

ప్రబోధ్‌పాండా కన్నుమూత

- పార్టీ కార్యాలయంలోనే గుండెపోటుతో మృతి



కోల్‌కతా : భారత కమ్యూనిస్టు జాతీయ కార్యవర్గ సభ్యులు, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ప్రబోధ్ పాండా (72) మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఇక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయం భూపేష్ భవన్‌లోని రూమ్‌లో ఉన్న పాండా తీవ్ర గుండెపోటు రావడంతో మృతిచెందారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. లోక్‌సభ మాజీ సభ్యులు, అఖిల భారత కిసాన్‌సభ అధ్యక్షులు అయిన పాండా 1946 ఫిబ్రవరి 7వ తేదీన పశ్చిమ బెంగాల్‌లోని పూర్వ మిడ్నాపూర్‌లో రైతు కుటుంబంలో జన్మించారు. విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. దంతన్ భట్టార్ కాలేజి నుంచి గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. ఆ తరువాత ఆయన రైతు ఉద్యమాలలో పాల్గొన్నారు. 1960వ దశకం మధ్యలో భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. సీపీఐ మిడ్నాపూర్ జిల్లా కార్యదర్శిగా ఆయన సుదీర్ఘకాలం పనిచేశారు. ఉత్తమ పార్లమెంటేరియన్, సీపీఐ నేత గీతాముఖర్జి మృతితో 2001లో జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించారు. ఆ తరువాత 2004, 2009లో జరిగిన 14, 15 లోక్‌సభలకు కూడా

- మిగతా 2 లో

స్వీడన్ పార్లమెంటుకు ఫెమినిస్టు గీతానబవి

స్టాక్‌హోం : స్వీడన్ పార్లమెంటుకు ఫెమినిస్టు ఇనిషియేటివ్ పార్టీ నాయకురాలు గీతానబవి కొత్తగా ఎన్నికయ్యారు. దేశ సరిహద్దులను తెరిచివుంచాలని బహిష్కరణలన్నింటిని నిలిపివేయాలని గీతా కోరారు. పార్లమెంటుకు జరిగిన ఎన్నికల ప్రచార సమయంలో ఫెమినిస్టు ఇనిషియేటివ్ పార్టీ తమ అభ్యర్థిగా గీతను ఎంపిక చేయడంద్వారా పార్టీ మాజీ నాయకుడు విక్టోరియా కవెస స్థానాన్ని పూరించింది. కవెస వ్యక్తిగత కారణాలతో పార్లమెంటు స్థానానికి రాజీనామా చేశారు. అయితే కవెస అవినీతికి పాల్పడినట్టుగా మీడియా తెలిపింది. దేశంలో పార్లమెంటు వెలుపలవున్న పార్టీలలో పెద్ద పార్టీ ఫెమినిస్టు ఇనిషియేటివ్. త్వరలో పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. పన్నులు పెంచుతామని, పనిగంటలు తగ్గిస్తామని, రక్షణ వ్యయాన్ని తగ్గిస్తామని ఈ పార్టీ ప్రజలకు హామీ ఇస్తోంది. గీతా తనవంతుగా స్వీడన్ సరిహద్దులను తెరిచి ఉంచుతామని బహిష్కరణలను నిలిపివేస్తామని ప్రజలకు హామీ ఇస్తున్నారు. పనిగంటలు తగ్గించడం తాను కోరుకుంటున్న ముఖ్యమైన అంశమని గీత అన్నారు. ఆమె ఎక్స్‌ప్రెషన్ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రజలను బహిష్కరించడం సరైందికాదని తాను విశ్వసిస్తున్నట్టు తెలిపారు. ఇక్కడ జన్మించిన వారిని కూడా బహిష్కరిస్తారా? అని ఆమె ప్రశ్నించారు. ప్రజల మధ్య తేడాలను ఎందుకు చూస్తారు అని, మనమంతా మానవులము కాదా అని ఆమె ప్రశ్నించారు.

దుబాయ్, లాటిన్ అమెరికా మధ్య పెరిగిన వాణిజ్యం

దుబాయ్ : దుబాయ్, లాటిన్ అమెరికా మధ్య ఇంధనయేతర వాణిజ్యం రికార్డుస్థాయిలో జరిగింది. గత ఏడాది మొదటి 9 నెలలకాలంలోనే 4 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగిందని దుబాయ్ వాణిజ్య, పారిశ్రామిక మండలి తెలియజేసింది. వాణిజ్య సంబంధాలను మరింత పెంచుకునేందుకు అనేక అడ్డంకులను తొలగించవలసివుందని వాణిజ్యమండలిచ ఛైర్మన్ మజీద్‌సైఫ్అల్‌గురయిర్ తెలిపారు. లాటిన్ అమెరికా దేశాల ప్రపంచ వాణిజ్య వేదిక రెండు రోజుల సదస్సును అయన మంగళవారం ఇక్కడ ప్రారంభిస్తూ రెండు ప్రాంతాలలోను ఆర్థిక వృద్ధి జరిగిందని చెప్పేందుకు వాణిజ్యం పెరుగుదలే తార్కాణమని అన్నారు.వాణిజ్యం పెరిగినప్పటికీ అనేక సవాళ్లు ఇంకా అలాగే ఉన్నాయని, ఆఫ్రికా, పశ్చిమాసియా, ఆసియా ముఖద్వారంగా దుబాయ్ పనిచేస్తుందని ఆయన చెప్పారు. అనేక అడ్డంకులను అధిగమించేందుకే 2017 సెప్టెంబర్ నుంచి ప్రపంచంలో అతి పెద్ద 3వ వాణిజ్య ఓటరేవు దుబాయ్ పోర్టు వరల్డ్‌ను ప్రారంభించామని, ఈ ఓడరేవునుంచి అత్యంత భారీగా సరుకులను ఎగుమతి, దిగుమతి చేయవచ్చునని ఆమె తెలిపారు. ఈ ఓటరేవు బహుళ ప్రయోజకారి అని తెలిపారు.

విశాలాంధ్ర ప్రపంచం



డ్రీమర్లపై ట్రంప్‌కి ఎదురుదెబ్బ!

వైట్‌హౌస్ : చిన్నతనంలోనే అమెరికా చేరుకొని పెరిగి పెద్దవాళ్లయిన తర్వాత ఇక్కడే ఉంటూ తమ కలలను సాకారం చేసుకోవాలని భావిస్తున్న విదేశీయులందరినీ దేశంనుంచి బయటికి పంపివేయాలని ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే గత నెలలో శాన్‌ఫ్రాన్సిస్కోలో జిల్లా జడ్జి విలియంఅస్లప్ అధ్యక్షుడు ట్రంప్ చేసిన నిర్ణయాన్ని నిలిపివేశారు. ఈ నిర్ణయంపై ట్రంప్ ప్రభుత్వం విచారణకు అప్పీలు చేయగా తాజాగా సుప్రీంకోర్టు తిరస్కరించింది. మాజీ అధ్యక్షుడు బొరాక్ ఒబామా పాలనాకాలంలో అనుసరించిన వలసవిధానం కింద అనుమతిపత్రాలు లేని యువతకు కూడా దేశంలో పనిచేసుకునేందుకు పర్మిట్లు ఇవ్వాలని, దేశంనుంచి బయటకి పంపాలన్న నిర్ణయాన్ని రెండేళ్లపాటు వాయిదా వేయాలని నిర్ణయించారు. జిల్లా జడ్జి అస్లప్ తాను ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా వర్తిస్తుందని పేర్కొన్నారు. కాలిఫోర్నియా ఉత్తర జిల్లాలో ఇచ్చిన తీర్పు ఆ రాష్ట్ర సరిహద్దులను దాటి అమలవుతుందని కోర్టు ధృవీకరించింది. ఈ సమస్య ప్రతి రాష్ట్రానికి ఉంటుందిగనుక రాష్ట్ర సరిహద్దులతో నిమిత్తం లేకుండా అమలు చేయాలని జడ్జి అస్లప్ తన తీర్పులో పేర్కొన్నారు. అయితే ఈ తీర్పుపైన అప్పీలుపై విచారణకు దేశ అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించడంతో మరోసారి ట్రంప్‌కు ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. దాదాపు 7 లక్షలమంది డ్రీమర్లయిన యువకులు ప్రస్తుతం దేశంలో ఉన్నారు. వీరందరికీ పని కల్పించే పర్మిట్లను కొనసాగించాలని దేశీయ భద్రతా విభాగం నిర్ణయించింది. పర్మిట్లు ఇచ్చే గడువు మార్చి 5తో ముగుస్తుంది.

చైనాలో ఆధునిక సోషలిస్టు సమాజ నిర్మాణ ప్రణాళిక



బీజింగ్ : చైనాలో ఆధునిక సోషలిస్టు సమాజ నిర్మాణ కార్యాచరణ ప్రణాళికలను త్వరలో ఆవిష్కరించనున్నారు. త్వరలో జరగనున్న పార్లమెంటు వార్షిక సమావేశాలలో, రాజకీయ సలహాసంఘాలు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించనున్నాయి. జాతీయ పీపుల్స్ కాంగ్రెస్ 13వ సమావేశాలు అలాగే ప్రజారాజకీయ సంప్రదింపుల జాతీయ కమిటీ 13వ సమావేశాలు మార్చిలో జరగనున్నాయి. ఈ రెండు సమావేశాలకు 5వేల మంది చట్టసభ సభ్యులు, రాజకీయ సలహాదారులు హాజరవుతారు. గత ఏడాది అక్టోబరులో జరిగిన కమ్యూనిస్టు పార్టీ 19వ జాతీయ మహాసభలు ప్రకటించిన గొప్ప ఆధునిక సోషలిస్టు దేశంగా చైనాను రూపొందించేందుకు రెండంచెల ముసాయిదా ప్రణాళికను రూపొందించారు. ఈ ప్రణాళికను మార్చిలో జరిగే పైన పేర్కొన్న రెండు సమావేశాలు చర్చిస్తాయి. 2020 నుంచి 2035 మధ్యకాలంలో ఆధునిక సోషలిస్టు చైనా మౌలిక నిర్మాణాన్ని సాధించాలని కమ్యూనిస్టు పార్టీ మహాసభ నిర్ణయించింది. 2035 నుంచి ఈ శతాబ్ది మధ్యకాలానికి చైనా గొప్ప ఆధునిక సోషలిస్టుదేశంగా అవతరిస్తుంది. అంటే పురోగామి, శక్తివంతమైన ప్రజాస్వామ్యయుతమైన సాంస్కృతికంగా వృద్ధిచెందిన, సామరస్యపూరితమైన అందమైన చైనా అవతరిస్తుంది. చైనా లక్షణాలతో సోషలిజాన్ని నిర్మించడం ద్వారా కొత్తశకంలోకి అడుగిడాలని జిన్‌పింగ్ చేసిన ప్రతిపాదనలను పార్టీ మహాసభ ఆమోదించింది. అలాగే పలు సూత్రాలను, విధానాలను కూడా మహాసభ ఆమోదించింది. జియాకంగ్ నిర్మాణ లక్ష్యాన్ని కూడా త్వరలోనే సాధించనున్నారు. ఒకమాదిరి పురోగామి సమాజ నిర్మాణాన్ని 2020 నాటికి సాధించాలని చైనా లక్ష్యంగా పెట్టుకున్నది. పేదరికం తగ్గింపు, జీడీపీ తలసరి ఆదాయం 2010 నాటి స్థాయికంటె రెట్టింపు ఉండేలా సాధించాలని 2020 నాటికి పెట్టుకున్న లక్ష్యాలలో ఉన్నాయి. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న చైనాలో సుస్థిర వృద్ధిరేటు కొనసాగుతున్నది. వస్తు సరఫరాలో సంస్కరణల ద్వారా నాణ్యతను పెంచాలని చైనా నిర్ణయించింది.

భారత్ ఆహ్వానానికి మాల్దీవుల తిరస్కారం

న్యూఢిల్లీ : 8 రోజులపాటు జరగనున్న భారీ నావికా విన్యాసాలలో పాల్గొనవలసిందిగా భారతదేశం అందించిన ఆహ్వానాన్ని మాల్దీవులు తిరస్కరించింది. మార్చి 6వ తేదీన ఈ విన్యాసాలు ప్రారంభమవుతాయి. మాల్దీవులలో ఎమీన్ ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని విధించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం అక్కడి పరిస్థితిని ఆచితూచి గమనిస్తూ ప్రభుత్వానికి ఎలాంటి తోడ్పాటు అందించలేదు. ఈనేపథ్యంలోనే ఎమీన్ ప్రభుత్వం భారత ఆహ్వానాన్ని తిరస్కరించింది. ఈ వివరాలను భారత నావికా దళాల అధిపతి అడ్మిరల్ సునీల్‌లంబా విలేకరులకు తెలియజేశారు. నావికా విన్యాసాలలో పాల్గొనడానికి అందించిన ఆహ్వానాన్ని తిరస్కరించిన మాల్దీవులు ఎలాంటి కారణాన్ని చెప్పలేదని ఆయన అన్నారు. ఎమీన్ ప్రభుత్వం ఎమర్జన్సీని ఫిబ్రవరి 5న ప్రకటించిన అనంతరం రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈనెల 21న ఎమర్జన్సీని మరోనెల పొడిగిస్తూ ఎమీన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. నావికా విన్యాసాలను అండమాన్ నికోబార్ దీవులలో నిర్వహిస్తున్నారు. 16 దేశాల నావికా దళాలు ఈ విన్యాసాలలో పాల్గొంటాయి.

సెర్బియాకు ఈయూ స్వాగతం



బెల్‌గ్రేడ్ : సెర్బియాను సభ్యదేశంగా చేర్చుకునేందుకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఆసక్తిగా ఉన్నది. సెర్బియానేకాక పశ్చిమ బాల్కన్ దేశాలను సభ్యులుగా చేర్చుకుంటామని అయితే ముందస్తు షరతులను వారు అంగీకరించాలని యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు జీన్‌క్లాడ్‌జంకర్ సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ ఉసిక్‌కు తెలియజేశారు. పశ్చిమ బాల్కన్ దేశాలతో సంబంధాలకు తాము ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. సెర్బియా అలాగే ఈ ప్రాంతంలోని ఇతర దేశాలు ఈయూలో భాగస్వాములు కావాలని అవిలేకుండా యూరోపియన్ యూనియన్ సంపూర్ణంకాదని జంకర్ చెప్పారు. ఉసిక్‌తో కలిసి బెల్‌గ్రేడ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టబద్ధత, న్యాయవ్యవస్థ, ద్వైపాక్షిక సంబంధాలు అత్యంత కఠినమైన సవాళ్లను ఎదుర్కొంటాయని జంకర్ అన్నారు. సెర్బియాను త్వరలో ఈయూలో చేర్చుకునేందుకు నిర్దుష్టమైన సూచనలను చేయడం జరిగిందని 2025 నాటికే రూపొందించిన వ్యూహాన్ని అప్పటికే సాధించాలన్న షరతు ఏమీలేదని కేవలం అది సూచనప్రాయమైన తేదీ అని జంకర్ చెప్పారు. కీలకమైన సంస్కరణలను అమలు జరిపేందుకు సమయం పడుతుందని ఆయా దేశాల సమాజాలలో ప్రజాజీవనంలో సంస్కరణలు గాఢంగా ప్రభావితం చేయవలసివుందని అన్నారు. సెర్బియా ఈయూలో తప్పకుండా సభ్యదేశమవుతుందని చెప్పారు. ఐరోపా దేశాలు ఏకీకృతం కావడానికి సెర్బియా ఎంతగానో కృషి చేసిందని అన్నారు. 2008లో స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్న సెర్బియా దక్షిణప్రాంత రాష్ట్రం కొసావా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జంకర్ అంగీకరించారు.

సౌదీలో మహిళలకు ప్రభుత్వ పదవులు

దుబాయ్ : సౌదీ అరేబియాలో మహిళలకు కూడా ప్రాధాన్యతనిచ్చి ప్రభుత్వ పదవులలో నియమిస్తున్నారు. ఇప్పటికీ రాచరిక ప్రభుత్వమే కొనసాగుతున్నది. తాజాగా కార్మిక, సామాజిక అభివృద్ధి మంత్రిత్వ శాఖకు ఉపమంత్రిగా మహిళను నియమించారు. యువరాజు మొహమ్మద్ బిన్‌సల్మాన్ నాయకత్వంలో ప్రభుత్వం కొనసాగుతోంది. అలాగే రక్షణశాఖను పటిష్ఠం చేసేందుకుగాను సర్వసైన్యాధిపతిని, ఇతర అధికారులను తొలగించారు. ప్రస్తుతం సర్వ సైన్యాధిపతిగా మొహమ్మద్‌బిన్ సల్మాన్ వ్యవహరిస్తున్నారు. ఇంకా పలు నిర్ణయాలను చేసినట్టుగా ప్రభుత్వం నడిపే సౌదీ ప్రెస్ ఏజెన్సీ తెలిపింది. త్వరలో ఇతర నిర్ణయాలను ప్రభుత్వం ప్రకటించనున్నది. రక్షణ మంత్రిత్వ శాఖలో మార్పులు, చేర్పులను ఆ శాఖ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికను, లక్ష్యాన్ని రాజు సల్మాన్ ఆమోదించారు. సైనిక జనరల్ రాయల్‌కోర్టు కన్సల్‌టెంట్‌గా కూడా వ్యవహరిస్తారు. ఈ మార్పుల ద్వారా యువరాజు అధికారాలన్నిటిని హస్తగతం చేసుకుంటున్నట్టుగా కనిపిస్తోంది. పొరుగునవున్న ఎమెన్‌లో జరుగుతున్న అంతర్యుద్ధం నేపథ్యంలో ఈ మార్పులను చూడాలని అక్కడ మీడియా పేర్కొంది. ఎమెన్ ప్రభుత్వానికి సౌదీ నాయకత్వంలోని దళాలు మద్దతు పలుకుతున్నాయి. అంతర్యుద్ధంలో 10వేల మందికిపైగా చనిపోయారు.

ఇంటర్ పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రైవేటు కళాశాలల యాజమాన్యం విద్యార్థుల ఫీజులకు సంబంధించి ఇబ్బందిపెట్టకుండా హాల్ టికెట్లు అందించాలని, ఎవరైనా ఇబ్బంది పెట్టి ఫిర్యాదు చేసినట్టయితే ఆ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు పాల్గొన్నారు.



ప్రబోధ్‌పాండా కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

పాండా ఎన్నికై ప్రజావాణిని లోక్‌సభలో వినిపించారు. రైతుల సమస్యలను లోక్‌సభ దృష్టికి తీసుకురావడంలో ఆయన ప్రధానపాత్ర వహించారు. నీటి పొదుపు, నిర్వహణపై పార్లమెంటరీ ఫోరం కన్వీనర్‌గా ఈ అంశంపై విధానాలను రూపొందించడంలో అపారమైన సేవలను అందించారు. ఆల్‌ఇండియా అంగన్వాడీ వర్కర్సు యూనియన్ గౌరవాధ్యక్షునిగా వారి సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తడంలో సఫలమయ్యారు. సుదీర్ఘకాలంగా పాండా సీపీఐ జాతీయ సమితి సభ్యులుగా ఉన్నారు. 2014లో సీపీఐ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఉన్నారు. 2017లో జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభలో మరోసారి కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గం సంతాపం

ప్రబోధ్‌పాండా మృతికి సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గం సంతాపం తెలిపింది. ఆయన మృతితో నిబద్ధత కలిగిన నాయకుడిని కమ్యూనిస్టు పార్టీ, రైతు సంఘం, వామపక్ష ఉద్యమం కోల్పోయిందని ఢిల్లీలో విడుదల చేసిన ప్రకటనలో కార్యదర్శివర్గం తెలిపింది. పార్లమెంట్ సభ్యునిగా రైతు, ప్రజాసమస్యల గొంతుకను వినిపించారని శ్లాఘించింది.

ప్రబోధ్‌పాండా ఆకస్మిక మరణం దిగ్భ్రాంతి కలిగించిందని హైదరాబాద్‌లో విడుదల చేసిన ప్రకటనలో సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి పేర్కొన్నారు. అణగారిన వర్గాల, పేదల సమస్యలను పార్లమెంట్‌లో వినిపించడంలో సమర్థమంతమైన పాత్ర పోషించారని తెలిపారు. దశాబ్దకాలంపైగా అఖిలభారత కిసాన్‌సభ (ఏఐకేఎస్) అధ్యక్షునిగా రైతు సమస్యలపై పోరాడారన్నారు. పార్లమెంట్‌లో, పార్టీలో తామిద్దరం సహచరులమని తెలిపారు. పాండా నిజాయితీపరుడైన, అంకితభావం కలిగిన కామ్రేడ్‌గా పేర్కొన్నారు. ఆయన మృతి భారతకమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటన్నారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శులు కె. రామకృష్ణ, చాడ వెంకటరెడ్డి, ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, తెలంగాణ రాష్ట్ర సీపీఐ నాయకులు పల్లా వెంకటరెడ్డి, పశ్య పద్మ, ఉజ్జిని రత్నాకరరావు తదితరులు పాండా మృతికి సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

రామకృష్ణ సంతాపం :

పాండా మృతి పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులుగా ప్రబోద్ పాండా ఉన్న కాలంలో తాను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించానని, రైతుల సమస్యలపై పాండాతో కలిసి నెరపిన ఉద్యమాలు మరువలేనివని ఆయన గుర్తు చేసుకున్నారు. నిత్యం ప్రజలతో మమేకమై ఆయన అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత పార్టీ శ్రేణులకు స్ఫూర్తిదాయకమన్నారు.

రైతు సంఘం సంతాపం :

పాండా మృతి పట్ల అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. రైతాంగ సమస్యలపై పార్లమెంటులోనూ. బయటా అలుపెరగని పోరాటాలు నిర్వహించారని, ఆయన మృతి రైతాంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

'కంది'పోతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

సాగుతో కాస్తంత కుదుటపడదామనుకున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం, దళారుల దందా తో కంది రైతుకు కష్టాలు తప్పడం లేదు. జిల్లాలో ప్రతి యేటా సాధారణంగా 6.04 లక్షల హెక్టార్లలో వేరుశెనగ, 50,570 హెక్టార్లలో కంది సాగవుతోంది. అయితే ప్రతి ఏటా వేరుశెనగ లో నష్టాలు వస్తుండడంతో పలువురు రైతులు కంది పంట సాగుకు మొగ్గు చూపారు. కానీ ఈ ఖరీఫ్ సంవత్సరంలో నాలుగు లక్షల 3135 హెక్టార్లలో వేరుశెనగ, 71,761 హెక్టార్లలో కంది పంట సాగయ్యింది. ఇలా వేరుశెనగ 24 శాతం తక్కువ విస్తీర్ణంలో వేరుశెనగ, 41.9 శాతం ఎక్కువ విస్తీర్ణంలో కంది పంట సాగయ్యింది. జిల్లా వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 57,389.6 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తోంది. ఇలా కంది పంట సైతం ఎక్కువ దిగుబడి రాగా పలువురు రైతులు పండిన పంటను అమ్ముకోవడానికి నానా తిప్పలు పడుతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కందులను కొనుగోలు చేస్తామని ప్రకటించి ఆ మేరకు కొనుగోలును సైతం చేపట్టింది. అయితే ఇక్కడే మార్క్‌ఫెడ్ పెద్ద తిరకాసు పెట్టగా దీనిని అలుసుగా తీసుకున్న దళారులు రంగ ప్రవేశం చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికే కందుల కొనుగోలు కోసం జిల్లాలో 20 కేంద్రాలను ఏర్పాటుచేసిన మార్క్‌ఫెడ్ మొదటగా ఫిబ్రవరి 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ రైతులకు టోకన్ లను పంపిణీ చేసింది. ఇలా టోకన్ లు తీసుకున్న రైతులు ప్రతి రోజూ కొంతమంది వచ్చి కందులను అమ్ముకుంటున్నారు. ఇంకా టోకన్ లు తీసుకోని రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ప్రతి రోజూ చక్కర్లు కొడుతూనే ఉన్నారు. అయినప్పటికీ ఇప్పటివరకూ టోకన్‌లు ఇచ్చిన రైతుల వద్ద నుంచే కొనుగోలు చేయడానికి సమయం సరిపోవడం లేదు కొత్తగా వచ్చిన రైతుల నుంచి కందులను ఎలా కొనుగోలు చేయాలన్న ప్రశ్న అక్కడ ఉన్న వారి నుంచీ వస్తోంది. ప్రభుత్వం నుంచి తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల కందుల కొనుగోలు కోసమే అనుమతి రాగా జిల్లాలో ఏకంగా 57 వేల నుంచి 59 వేల మెట్రిక్ టన్నుల వరకూ దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మిగిలిన రైతులు తాము పండించిన కంది పంటను ఎక్కడ అమ్ముకోవాలో దిక్కు తెలియక ఇబ్బంది పడుతున్నారు.

రంగ ప్రవేశం చేసిన దళారులు :

జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో పలువురు రైతులు ఆనందపడగా మార్క్‌ఫెడ్ నిర్వాకంతో చాలామంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని అవకాశంగా మలచుకున్న దళారులు రంగ ప్రవేశం చేసి రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కందులను ఎక్కువ ధరతో మార్క్‌ఫెడ్‌కు విక్రయించడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాలలో దళారులు ఈ మేరకు కందులను కొనుగోలు చేసి మార్క్‌ఫెడ్ వద్ద విక్రయించడానికి సన్నాహాలు చేసుకుంటుండడం గమనార్హం. అయితే జిల్లాలో ఏర్పాటుచేసిన కందుల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నా వారు పట్టించుకోకపోగా దళారుల వద్ద నుంచి దొడ్డిదారిన కొనుగోలు చేస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. దీనివలన అసలైన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా ఇదే అవకాశంగా భావించిన దళారులు పెద్ద ఎత్తున కందుల దందాకు తెర తీయడం గమనార్హం. దీంతోపాటు ఎక్కువ రోజులు కందులను నిల్వ ఉంచుకుంటే అవి పుచ్చిపోతాయన్న భయంతో రైతులు ఎంతో కొంతకు అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇదే అదనుగా భావించిన దళారులు రైతుల భయాన్ని, వారి అవసరాన్ని అవకాశంగా తీసుకుని అతి తక్కువ ధరతో కొనుగోలు చేస్తుండడం గమనార్హం.

అనుమతి కోరాము

ఎ.రవిశంకర్, డిఎం, మార్క్‌ఫెడ్

జిల్లాలో తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు అనగా 90 వేల క్వింటాళ్లు కొనుగోలు చేయడానికి అనుమతి ఉంది. ఆ మేరకు ఇప్పటివరకూ 982 మంది రైతులకు సంబంధించి 9,445.5 క్వింటాళ్ల కందులను కొనుగోలు చేశాము. ఇప్పటికే తొమ్మిది వేల మెట్రిక్ టన్నులకు సరిపడ టోకన్‌లు సైతం పంపిణీ చేశాము. ప్రతి రోజూ ఈ మేరకు రైతుల నుంచి కొనుగోలు చేస్తూనే ఉన్నాము. జిల్లాలోని రైతుల నుంచి తీవ్రమైన ఒత్తిడి మూలంగా అదనపు కోటా కొనుగోలు కోసం అనుమతి కోరాము. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఆ మేరకు కందులను కొనుగోలు చేస్తాము.

మార్క్‌ఫెడ్ ద్వారానే కొనుగోలు చేయాలి

డి.జగదీష్, సిపిఐ జిల్లా కార్యదర్శి

జిల్లాలో అతి తక్కువ విస్తీర్ణంలో వేరుశెనగ సాగు కాగా చాలా మంది రైతులు కంది పంటకు సాగుకు మొగ్గుచూపారు. ఆ క్రమంలోనే జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో కంది పంట సాగు కాగా దిగుబడి కూడా ఎక్కువగా వచ్చింది. కావున ప్రభుత్వమే రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించి రైతుల నుంచి కంది పంటను మొత్తం కొనుగోలు చేయాలి. జిల్లాలో సుమారుగా 58 వేల మెట్రిక్ టన్నుల కంది దిగుబడి రాగా తొమ్మిది వేల మెట్రిక్ టన్నులను మాత్రమే కొనుగోలు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉంది. ఇందులో కూడా కొనుగోలు కేంద్రాల్లోని కొంతమంది సిబ్బంది, దళారులు కుమ్మక్కు అయ్యి దందా సాగిస్తున్నారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలి జిల్లాలో అర్హుడైన ప్రతి రైతు నుంచి కందులను కొనుగోలు చేయాలని లేదంటే ఉద్యమించక తప్పదు.

ప్రచారార్భాటమే...

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమలు వస్తాయి, వచ్చే పరిశ్రమల్లో రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తుందా అనే మీమాంసలో నిరుద్యోగ యువత ఉన్నారు. విశాఖలో జరిగిన ఈ పెట్టుబడుదారుల సదస్సులో ఐటీ, ఎలక్ట్రానిక్స్‌కి చెందిన 76 కంపెనీలతో ఒప్పందాలు జరగ్గా అందులో ఎక్కువమంది పెట్టుబడులుదారులు అమరావతి చుట్టే ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే రాజధాని కోసం సేకరించిన విలువైన భూమిని పరిశ్రమలకిస్తే వీరు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటారన్న ఆరోపణలు లేకపోలేదు. మళ్ళీ మరో ఏడాది ఎన్నికల నేపథ్యంలో లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చేశాయని చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడానికే దోహదపడుతుంది తప్ప నిజానికి రాష్ట్ర అభివృద్ధికి ఈ సదస్సులు ఎంతమేర ఉపకరిస్తుందో వేచి చూడాల్సిందే.

ఎంఓయూలు ఇలా...

ఈ నెల 24 నుండి 26వ తేదీ వరకూ విశాఖలో జరిగిన ఒప్పందాలివి... తొలిరోజు రూ.41,176 కోట్ల పెట్టుబడులు, 80ఎంఓయులు జరిగాయి. రెండవరోజు రూ. 1,77,638కోట్ల పెట్టుబడులు, 285 ఒప్పందాలు జరిగాయి. చివరి రోజు చివరి రోజు రూ.2,20,951కోట్ల పెట్టుబడులు, 369 ఒప్పందాలు, 7,17,463 ఉద్యోగాలు రానున్నాయి. మొత్తం మూడు రోజుల్లో రూ.4,39,765కోట్లు పెట్టుబడులు, 734 ఒప్పందాలు, 11,02,125 ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మొదటిరోజు ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూడు రోజులు విశాఖలోనే ఉండి పలు ఒప్పందాల్లో నేరుగా పాల్గొన్నారు. చివరి రోజు గవర్నర్ నరసింహన్ హాజరయ్యారు. ఈమూడు రోజుల సదస్సులో 45 దేశాలకు చెందిన 4,253 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో విదేశీ ప్రతినిధులు 250మంది ఉన్నారు. ప్రతి రోజు రెండు సెషన్లుగా కార్యక్రమాలు నిర్వహించారు. సన్‌రైజ్ ఏపి పేరిట ప్లీనరీ సెషన్స్ జరిగాయి. టెక్నాలజీ ఫర్ టుమారో, సోషల్ ఐకాన్ ఇన్‌ట్రాక్షన్ రవిశంకర్‌జీతో జరిగింది. సౌత్ కొరియా, జపాన్, సింగపూర్ దేశాలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఆటోమోటీవ్, టూరిజం, ఏరోస్పెస్, రక్షణ రంగం, టెక్స్‌టైల్స్ లలో ఒప్పందాలు జరిగాయి. మెడికల్ పరికరాలు, ఎనర్జీ, ఆహార ఉత్పత్తి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో కూడా పలు ఒప్పందాలు చేసుకున్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 15 విదేశీ మంత్రులు, ప్రతినిధులతో నేరుగా మాట్లాడారు. ఈసందర్భంగా లూలూ సంస్థ నిర్మించనున్న ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌కు శంకుస్థాపన చేసారు. ఇందులో ఐదు నక్షత్రాల హెూటల్, షాపింగ్‌మాల్ రానున్నాయి. ఈకార్యక్రమంలో భాగంగా అమరావతిలో నిర్మించనున్న భవనాల నమూనాలు, ఏపి నిర్వహిస్తున్న రియల్‌టైమ్ గవర్నన్స్ విధానాన్ని ప్రదర్శించారు. ఇక ఒప్పందాలు విషయానికి వస్తే పరిశ్రమల రంగంలో 129 ఒప్పందాలు, రూ. 58,337కోట్ల ఒప్పందాలు జరిగాయి.

దీని ద్వారా 1,30,682 ఉద్యోగాలు రానున్నాయి. ఈడీబీ విభాగంలో 144 ఒప్పందాలకు గాను రూ. 1,51,400కోట్ల పెట్టుబడులు రాగా 1,52,496 ఉద్యోగాలు కల్పించనున్నారు.

ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో 75 ఒప్పందాలు, రూ.30,050కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీని ద్వారా 1.30.343 ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. టూరిజం రంగంలో 49 ఒప్పందాలు, రూ. 5,002కోట్ల పెట్టుబడులు, 30338 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ఫుడ్ ప్రెసెసింగ్ రంగంలో అత్యధికంగా 165 ఒప్పందాలు జరగగా, రూ. 3,100కోట్ల పెట్టుబడులు, 47వేల ఉద్యోగాలు రానున్నాయి. దేశవిదేశాల్లోని ప్రముఖ కంపెనీలన్ని ఈపెట్టుబడుల సదస్సులో భాగస్వాములయ్యారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధికంగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని చెబుతున్నారు. నిజానికి ఈ సదస్సుల వల్ల నిరుద్యోగ యువతకు ఎంతమేర ఉపయోగపడుతుందన్నది వేచిచూడాలి.

ఇవన్నీ... నిజమేనా..?

(మొదటిపేజీ తరువాయి)

25 ఏళ్లలో 6,500 కోట్లు సబ్సిడీ ఇస్తామని చెప్పిన తరువాత మాత్రమే వచ్చిందని గుర్తు చేశారు. అమరావతి రాజధాని ప్రాంతంలో బ్రహ్మాండమైన అభివృద్ధి జరుగుతున్నదని రాష్ట్రంలోని ఇతర ప్రాంత ప్రజలు భావిస్తున్నారని, అయితే ఇక్కడ జరుగుతున్నది ఏమీ లేదన్నారు. రాజధాని నిర్మాణానికి రైతులు దాదాపు 35వేల ఎకరాల భూములు ఇచ్చారని, మరో 34వేల ఎకరాల అటవీ భూములను తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నదని, అవి కాకుండా రైతుల నుంచి మరో 14వేల ఎకరాలు తీసుకుంటామని చెపుతున్నారని, మొత్తం మీద 79వేల ఎకరాలను తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలోనైనా 79వేల ఎకరాల్లో రాజధాని నిర్మించారా? అని రామకృష్ణ ప్రశ్నించారు. ఇన్నివేల ఎకరాల భూముల్లో ఏమి చేస్తారో సమాధానం చెప్పాలన్నారు. రాజధాని ప్రాంతంలో ఏడు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని చంద్రబాబు చెపుతున్నాడని, ఇక్కడ అంత మంది రోగులు వున్నారా? ఏమిటని ప్రశ్నించారు. రాజధానిని టోక్యో, లండన్, సింగపూర్ తరహాలో నిర్మిస్తామని చెప్పిన సీఎం రాష్ట్రంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడంలో అర్థం లేదన్నారు. వైద్యకళాశాలల ఏర్పాటుకు రైతులు భూములు ఇచ్చారా? రాజధాని నిర్మాణానికి ఇచ్చారా? అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలోని అధికార,ప్రతిపక్ష పార్టీలు రెండూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పేదవారికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ మూడున్నరేళ్ల కాలంలో 13జిల్లాల్లో ఒక్క పేదవాడికి ఒక్క ఎకరా భూమి కూడా పంపిణీ చేయలేదని, వేలాది ఎకరాలను మాత్రం కార్పొరేట్లకు కట్టబెడుతూ ఊడిగం చేస్తున్నదని విమర్శించారు. ఇక రాష్ట్ర విభజన బిల్లు సమయంలో రాజధాని నిర్మాణానికి కేంద్రమే నిధులు సమకూర్చుతుందని పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం చెప్పిందన్నారు. అయితే నేడు రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే ప్రపంచబ్యాంకు నుంచి అప్పు చేసి నిర్మిస్తామని చంద్రబాబు చెబుతున్నాడని, ప్రపంచబ్యాంకు అప్పుతో నిర్మించే రాజధానిని, మెడికల్ కళాశాలలు వుండే రాజధానిని ప్రజలు కోరుకోవడం లేదని కేవలం ప్రజారాజధానిని మాత్రమే కోరుకుంటున్నారన్నారు. ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చెప్పిన విధంగా రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇచ్చివుంటే నేడు ఆంధ్రప్రదేశ్ తెలంగాణాకన్నా మిన్నగా వుండేదన్నారు. విభజన బిల్లులో అంశాలు నెరవేర్చకపోవడం వల్ల రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో కలసి వచ్చిన వారందరినీ కలుపుకుపోతామని, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌తో కూడా కలసి వామపక్ష పార్టీలు ప్రయాణించే అవకాశం వుందన్నారు. ఇక రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలను నెరవేర్చడంతో పాటు కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయాలను సరిదిద్దాలని డిమాండు చేస్తూ మార్చి 1న గుంటూరులో సీపీఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులను ఈ సదస్సుకు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య పాల్గొన్నారు.

అటవీశాఖకు 2089.95 హెక్టార్ల భూమి బదలాయింపు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాజధాని అమరావతిలో రాజధాని నిర్మాణంలో భాగంగా అటవీ భూమిని వినియోగించుకుంటున్న సందర్భంగా అందుకు ప్రతిగా వైఎస్సార్ కడపజిల్లాలో 2089.95 హెక్టార్ల భూమిని ప్రభుత్వం అటవీశాఖకు బదలాయించింది. ఈమేరకు రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ మన్మోహన్‌సింగ్ మంగళవారం జీవో జారీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈ భూమిని అటవీశాఖకు అందచేస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు. వైఎస్సార్ కడపజిల్లాలోని శ్రీ అవధూత కాశిరెడ్డి నాయన మండలం, సిద్ధవటం మండలాలకు చెందిన ఇటుకలపాడు, సవిశెట్టిపల్లి, పెద్దపల్లి, నేకనపురం గ్రామాలకు చెందిన 2089.95 హెక్టార్ల భూమిని సంబంధిత ప్రొద్దుటూరు, కడప డివిజనల్ ఫారెస్టు డివిజన్లకు బదలాయించారు. కడపజిల్లా కలెక్టర్‌తోపాటు భూపరిపాలనశాఖ ముఖ్య కమిషనర్ తదుపరి చర్యలు తీసుకోవాలని జీవోలో కోరారు.

ఏపీ టెట్ 7వ రోజు 88.81 శాతం హాజరు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష)లో భాగంగా ఏడవ రోజైన మంగళవారం పేపర్ -2 (మేథమెటిక్స్, సైన్స్) పరీక్ష జరిగినట్లు ఏపీ టెట్ కన్వీనర్ ఏ సుబ్బారెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. ఉదయం జరిగిన పరీక్షకు 30,503 మందికి గాను 26,930 మంది హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 29,200 మందికి గాను 26,090 మంది హాజరయ్యారన్నారు. రెండు సెషన్లకూ కలిపి మొత్తంగా 59,703 మంది అభ్యర్థులకు గాను 53,020 మంది (88.81 శాతం) హాజరైనట్లు కన్వీనర్ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పరిశీలకులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ సభ్యులు ఆయా పరీక్షా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలను చేసినట్లు సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

హౌస్‌కీపింగ్ వర్కర్ల వెతలు

- 4 నెలల పైబడి అందని జీతాలు
- పట్టించుకోని సీఆర్డీఏ అధికారులు
- కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం



విశాలాంధ్ర అమరావతి : అమరావతి రాజధాని నిర్మాణం పేరుతో స్థానిక పంటభూములను ప్రభుత్వం తీసుకోవడంతో వ్యవసాయ కూలీలకు ఉపాధి లేకుండా పోయింది. ఈ సమయంలో తాత్కాలిక సచివాలయ నిర్మాణం జరిపి ఉద్యోగులను ఇక్కడికి రప్పించారు. ఈ క్రమంలో రాజధాని ప్రాంత గ్రామాల వ్యవసాయ కూలీలను హౌస్‌కీపింగ్ పనులకు నియమించారు. వెలగపూడి సచివాలయ హౌస్ కీపింగ్ విభాగాన్ని సీఆర్డీఏ అధికారులు ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించారు. సచివాలయంలోని అన్ని విభాగాలను శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న సీఆర్డీఏ , హౌస్‌కీపింగ్ కార్మికులను విస్మరించింది.

హౌస్ కీపింగ్ కార్మికుల్లో మహిళలే అధికం..

రాజధాని ప్రాంతంలోని వెంకటపాలెం , మందడం, కృష్ణయపాలెం, తదితర గ్రామాల నుంచి మహిళలు హౌస్ కీపింగ్ విభాగంలో చేరి ఉపాధి పొందుతున్నారు. 250 మంది హౌస్ కీపింగ్ వర్కర్లలో మొత్తం 220 మంది మహిళల వరకు వివిధ ఛాంబర్స్‌లో తమ విధులు నిర్వహిస్తునారు. ఐదు బ్లాకులు ,అసెంబ్లీ భవనాలు తాత్కాలిక సచివాలయంలో బ్లాక్‌కి 20 మంది హౌస్ కీపింగ్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అణువణువు పరిశుభ్రంగా ఉంచే బాధ్యత వీరిపై ఉంది. ఈ 20 మంది కార్మికులలో ఇద్దరు సూపర్ వైజర్లుగా వ్యవహరిస్తుంటారు. అసెంబ్లీ, సీఎం ఉండే మొదటి బ్లాక్‌లలో మాత్రం ఎక్కువ సంఖ్యలో వర్కర్లు విధులు నిర్వహిస్తుంటారు. అయితే వీరికి నెలంతా కష్టపడితే వచ్చేది రూ. 6,480 జీతం మాత్రమే. కాగా వీరికి విధుల్లో చేరిన మొదట్లోనే పీఎఫ్ ,ఈ.ఎస్.ఐ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పినా ఇప్పటికీ పీఎఫ్ ఖాతా నెంబర్ ఇచ్చిన వారు లేరు. అనారోగ్యాలు బారిన పడిన పట్టించు కోరు. ఈ క్రమంలో వచ్చిన వేతనంతోనే సరిపుచ్చుకుని బాధను దిగమింగేసి బాధ్యతలు నెరవేస్తున్నారు. వీరికి కల్పిస్తున్న సౌకర్యాలు , వసతుల విషయంలో మాత్రం సీఆర్డీఏ అధికార్లు ఏ మాత్రం అరా తీయకపోవటంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తూ మహిళలతో వెట్టి చాకిరి చేయిస్తున్నారు.

చాకిరి ఎక్కువ.. ఇచ్చేది తక్కువ

హౌస్ కీపింగ్ ఉద్యోగులు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంది. కాగా ఏదైనా ముఖ్యమైన కార్యక్రమాలు జరిగితే ఇంకొంత ఎక్కువ సమయం విధులు నిర్వహించాల్సి వస్తుందని కార్మికులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే సచివాలయం హౌస్ కీపింగ్ కాంట్రాక్ట్ పొందిన వ్యక్తే సచివాలయం వెలుపుల , బయట రహదారులు శుభ్ర పరిచే కాంట్రాక్టును దక్కించుకున్నారు. దీంతో ఈ పనిని సైతం ప్రస్తుతం సచివాలయం పరిశుభ్ర పరుస్తున్న మహిళలే చేయాలంటూ కాంట్రాక్టర్ హుకుం జారీ చేయడం, గత్యంతరం లేని స్థితిలో రోడ్లు సైతం ఊడుస్తూ కంటి నీటిని దిగమింగుకుంటున్నారు. విధుల్లో చేరే సమయంలో 2 నెలల పాటు రూ.7000 జీతం ఇచ్చి . అనంతరం 12 వేల రూపాయల నెలసరి జీతం ఇస్తామని చెప్పారని విధులు నిర్వహిస్తున్న కార్మికులు వెల్లడిస్తున్నారు. విధుల్లో చేరి రెండేళ్లు పైగా కావస్తున్నా నేటికి రూ. 6,480 వేతనమే అందిస్తున్నారని మహిళా కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నిస్తే ..ఇంటికే...

విధులు నిర్వహించే కార్మికులు వేతనం విషయమై ప్రశ్నిస్తే సదరు కాంట్రాక్టర్ ఆగ్రహానికి బలి కావాల్సిందే. జీతం పెంచమని కోరిన పాపానికి ఏకంగా పదుల సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోయిన బాధితులు చాలామంది ఉన్నారు. ఎవరైనా పీఎఫ్ ఖాతా నెంబర్ ఇవ్వండి అని అడిగితే ఇక అంతే సంగతులు ఎదో ఒకరకంగా ఇబ్బంది పెట్టి వారికి వారే విధులు వదిలి వెళ్లేలా చేస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. గతంలోని కాంట్రాక్టర్ 3 నెలల జీతం ఇవ్వకుండా వెళ్లిపోయినా పట్టించుకున్న నాథుడు లేడని, ప్రస్తుత కాంట్రాక్టర్ నవంబర్ నుంచి జీతాలు ఇవ్వటంలేదని అడిగితే ఎక్కడ ఇంటికి వెళ్లి పోమంటారో అన్న భయంతో మిన్నకుండా పోయామని వాపోతున్నారు. అసలే అంతంత మాత్రపు జీతాలతో బతుకీడుస్తున్న తమకు జీతాలు లేక పోవటంతో ఆకలి బాధలు అనుభవించాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. మీడియాతో మాట్లాడినా ఉద్యోగాలు నుంచి తొలగిస్తున్నారని కార్మికులు వ్యాఖ్యనించటం కాంట్రాక్టర్ నిరంకుశ వైఖరికి నిదర్శనం. సీఆర్డీఏ అధికార్లు సైతం కార్మికులకు కనీస వేతనాలు అమలవుతున్నాయా లేదా అనే అంశం విస్మరించటంపై వారు ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మహిళా కార్మికుల కష్టాలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



సచివాలయంలో మాజీ ఎమ్మెల్యేలకు కార్యాలయం కేటాయించాలి

ఏపీ ఫార్మర్ లెజిస్లేటర్స్ ఫోరం తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సచివాలయంలో లేదా శాసనసభ ఆవరణలో మాజీ ఎమ్మెల్యేలకు కార్యాలయాన్ని ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ ఫార్మర్ లెజిస్లేటర్స్ ఫోరం తీర్మానించింది. వెలగపూడి శాసనసభ కమిటీ హాలులో మంగళవారం డాక్టర్ దివి శివరామ్ అధ్యక్షతన ఫోరం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 10 తీర్మానాలను ఫోరం సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈమేరకు ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కె సుబ్బరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు మందుల సరఫరా, టోల్‌గేట్ల ఇబ్బందులు, ప్రొటోకాల్, ఢిల్లీలోని ఏపీభవన్‌లో వసతి తదితర అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. అలాగే విభజనచట్టంలోని హామీలను అనుసరించి రాష్ట్రలోటును కేంద్రప్రభుత్వమే భర్తీ చేయాలని కోరిందన్నారు. ఈ తీర్మానాలను ముఖ్యమంత్రి, స్పీకర్‌లను కలసి వివరించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎర్నేని సీతాదేవి, పడాల అరుణ, ఎం వెంకట సుబ్బయ్య, ముసునూరు రత్నబోస్, దాసరి బాలవర్ధనరావు, ముక్కు కాశిరెడ్డి, రెడ్డి సత్యనారాయణ, పి కనక సుందరరావు, జయరాజు, డి రాజగోపాల్, చుక్కా పీటర్‌పాల్, జల్లి విల్సన్, దారా సాంబయ్య, షేక్ నాసర్‌వలీ, మూల్పూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారని సుబ్బరాజు తెలిపారు.

వామపక్ష కార్యకర్తల అరెస్టుకు ఖండన

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని ఆందోళన చేస్తున్న వామపక్ష నేతలు, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు ఆపార్టీ కార్యదర్శి పి మధు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం చట్ట ప్రకారం రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు, ఏర్పాటు చేయాల్సిన సంస్థల విషయంలో నిర్లక్ష్యంగా ఉందన్నారు. ప్రత్యేక హోదా, రైల్వేజోన్, కడప ఉక్కు వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వంలో కొనసాగుతోందని విమర్శించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఖరులకు వ్యతిరేకంగా విజయవాడలోని ఆలిండియా రేడియో కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె శ్రీదేవి, డి కాశీనాథ్, ఏపీ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి దుర్గాభవానీ, సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, నాయకులు జి కోటేశ్వరరావు, దుర్గారావు తదితరులను అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే వారందరినీ విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించాలని ప్రజాతంత్రవాదులను ఆయన కోరారు.

వైద్యరంగాన్ని నీరుగార్చే బిల్లుకు వ్యతిరేకంగా

మార్చి 25న ఆందోళన

ఐఎంఏ జాతీయ అధ్యక్షులు రవీంద్ర వాంకేడర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ వైద్యరంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు రవీంద్ర వాంకేడర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో మంగళవారం ఏర్పాటు చేయసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో వైద్య విధానాన్ని కేంద్రప్రభుత్వం నీరుగార్చే విధంగా బిల్లులు ప్రవేశ పెట్టాలనుకోవడం దుర్మార్గమన్నారు. దీనివల్ల దేశంలో నిరుపేదలకు వైద్యం దూరమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వైద్య విధానంలో తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఐఎంఏ వైద్యులు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. వైద్య విధానంలో ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు వ్యతిరేకంగా మార్చి 25వ తేదీన దేశంలో 1750 ఐఎంఏ. బ్రాంచిలకు చెందిన వైద్యులు ఆందోళనలో పాల్గొంటారని తెలిపారు. కన్యాకుమారి నుండి ఢిల్లీ వరకూ వైద్యులతో యాత్ర నిర్వహిస్తామన్నారు.

ప్రధానంగా 5 సంవత్సరాలు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఎంబీబీఎస్ చదివిన వైద్యులను కాదని, ఆయుష్‌లో పట్టాపొందిన వారికి ఆరు నెలల శిక్షణను ఇచ్చి వారిని అలోపతి వైద్యులుగా గుర్తిం చాలను కోవడం సమంజసం కాదన్నారు. ప్రెస్‌మీట్‌లో ఐఎంఏ జాతీయ ఉపాధ్య క్షులు ఎ.రాజేంద్ర, విజయవాడ అధ్యక్షులు యం.యస్., బోస్ రషిక్ సంఘ్వీ, డా॥ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

అంబటి రాంబాబు



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: పదవి కోసం ఎవరినైనా ముంచు అన్నదే చంద్రబాబు తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలకు ఇచ్చిన సందేశమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. రాజకీయ జన్మనిచ్చిన ఎన్టీ రామారావు మరణానికి చంద్రబాబే కారణమని, వెన్నుపోటు పొడవటం చంద్రబాబు వ్యక్తిత్వమని, నమ్మించు.. వంచించు.. దోచేయ్ అన్నది చంద్రబాబుకు బాగా తెలిసిన పదాలన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో మంగళవారం అంబటి విలేకరులతో మాట్లాడారు. ఊసరవెల్లికి రంగులు మార్చడంలో తర్ఫీదు ఇవ్వగల సమర్థుడు చంద్రబాబు అని, మిమిక్రీ ఆర్టిస్టులకు స్వరాలు నేర్పగల నైపుణ్యం చంద్రబాబుదని పేర్కొన్నారు. ఎన్టీఆర్ తెరపై నటిస్తే, చంద్రబాబు నిజ జీవితంలో నటిస్తున్నారని, సందర్భాన్ని బట్టి మాటలు మార్చడంలో చంద్రబాబు తర్వాతే ఎవరైనా అని ఆరోపించారు. రెండెకరాల చంద్రబాబు 40 ఏళ్లలో 2 లక్షల కోట్లు సంపాదించారని, పైగా నీతి నిజాయితీ అని మాట్లాడతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అవినీతికి వ్యతిరేకంగా కేసులు వేస్తే కోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నారని, నిజంగా విచారణ జరిగితే చంద్రబాబు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఈ 40ఏళ్లలో చంద్రబాబు చేసిందేమీ లేదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలా చంద్రబాబు ఒక్క మంచిపనీ చేయలేదని, వెన్నుపోటుకు మాత్రం బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారన్నారు. అనుకూల మీడియాను అడ్డం పెట్టుకుని తనకు అనుకూలంగా చంద్రబాబు వార్తలు రాయించుకుంటున్నారని, హైదరాబాద్‌ను నేనే కట్టానని, ఐటీని నేనే తెచ్చానని, సెల్‌ఫోన్ నేనే కనిపెట్టానని, సత్యా నాదెళ్లకు నేనే టెక్నాలజీ నేర్పించానని, పీవీ సింధు తనవల్లే గెలిచిందని, ఇలా నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడతారని అంబటి తెలిపారు.



పోర్టు నిర్మాణం చేపట్టొద్దు!

ముక్త కంఠంతో వ్యతిరేకించిన మత్స్యకారులు

విశాలాంధ్ర-కాశీబుగ్గ/పూండి: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం భావనపాడు-దేవునల్తాడ గ్రామాల మధ్య పోర్టు నిర్మాణం చేపట్టవద్దని, పోర్టు నిర్మాణం వల్ల తమ బతుకులు నాశనం అవుతాయని దేవునల్తాడ, భావనపాడు గ్రామాల మత్స్యకారులు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. మంగళవారం దేవునల్తాడ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ పోర్టు నిర్మాణం చేయకుండా హార్బర్ నిర్మాణం చేపడితే తాము వ్యతిరేకించబోమని, మా బతుకులు కూడా బాగుపడతాయని వారు పోర్టు డైరెక్టరు ప్రవీణకుమార్‌కు వివరించారు. ఆర్.ఆర్ ప్యాకేజ్ కూడా తమకు అక్కరలేదని, మత్స్యకారుల వేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. పలాస నియోజకవర్గ వైకాపా కన్వీనర్ డా. సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధికి అనుకూలంగా ప్రభుత్వం అనుసరించాలని అన్నారు. పోర్టు నిర్మాణం జరిగితే మత్స్యకారులు కుటుంబాలతో రోడ్డున పడతారని, ప్రభుత్వ ఆలోచనలను విరమించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సీదిరి చిరంజీవులు, ఆర్డీవో ఎం.వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, మూర్తి, తహశీల్దార్ ఎస్.రమణయ్య, భావనపాడు సర్పంచ్ సైన గురువులు, సర్వేయర్ తిరుపతిరావు, పోర్టు వ్యతిరేక సాధన కమిటీ అధ్యక్షులు లండ దానేసు, వరద రాజులు, దౌలుపల్లి రాజులు, కారాడ పోతయ్య, బి.మోహనరెడ్డి, అలుపల్లి పోతయ్య, శిర్ల ప్రకాశ్, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎటువంటి నష్టం వాటిల్లదు : పోర్టు డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్

పోర్టు నిర్మాణం వల్ల దేవునల్తాడ గ్రామానికి ఎటువంటి నష్టం వాటిల్లదని పోర్టు డైరెక్టర్ ప్రవీణకుమార్ మత్స్యకారులతో చెప్పారు. అయితే డైరెక్టర్ మాటలపై మత్స్యకారులకు నమ్మకం కలగకపోవడంతో ఆయన మాటలను వారు ఏకీభవించలేదు.

సర్వేశాఖపై కేఈ వ్యాఖ్యలు బాధాకరం

- ఖాళీలు భర్తీ చేయకుండా విమర్శించడం తగదు
- భూ సమస్యల పరిష్కార గడువు 60కి పెంచాలి
- సర్వే ఉద్యోగ సంఘ నేతలు ప్రకటన విడుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సర్వేశాఖలో అవినీతి పెరిగిందని, ప్రభుత్వానికి వారివల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రెవిన్యూశాఖ మంత్రి కేఈ కృష్ణమూర్తి మంగళవారం జలవనరుల శాఖ కార్యాలయంలో జరిగిన ఏపీ రాష్ట్ర రెవెన్యూ మరియు సర్వే శాఖల సదస్సులో చేసిన వ్యాఖ్యలు తమను తీవ్రంగా బాధించాయని ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్ చిరంజీవిరావు, ప్రధాన కార్యదర్శి రౌతు రామకృష్ణలు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రితో సమీక్షా సమావేశం ముగియగానే సర్వే ఉద్యోగ సంఘ ముఖ్యనేతలు సమావేశమై ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు. మండలానికి ఒక సర్వేయర్ మాత్రమే ఉండటం భూసమస్యలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా రావడంతో నిర్దిష్ట వ్యవధిలో వాటిని పరిష్కరిచలేకపోతున్నాడన్నారు. మండలంలో ఉన్న సర్వేయర్లకు ఎఫ్-లైన్ సమస్యలే కాకుండా ప్రతి నిత్యం భూసేకరణ, ఇంటి నివేశాలు, భూబదలాయింపు, కోర్టు కమీషన్, అధికారుల తనిఖీలు వంటి పనులు చేయడం ద్వారా నిర్థిష్ట కాలంలో అర్జీలను పరిష్కరించలేక పోతున్నారని తెలిపారు. అలాగే ప్రతి మండల సర్వేయరు వారంలో 3 లేదా 4 రోజులు కేవలం ఎఫ్ఎంబీ డిజిటలైజేషన్‌కు పనిచేయవలసి వుందన్నారు. రాష్ట్రంలో 3,500 సర్వేయర్లు కావాల్సి ఉండగా కేవలం 600 మంది సర్వేయర్లు మాత్రమే అందుబాటులో ఉండటం వారిపై తీవ్రమైన పనిభారానికి నిదర్శనమన్నారు. మండలంలో సర్వేయర్ల సహాయకులుగా చైన్‌మ్యాన్ సిబ్బంది కూడా పూర్తిగా లేకపోవడంతో అర్జీల పరిష్కారంలో జ్యాప్యం జరుగుతుందన్నారు. సర్వే శాఖని ఆధునీకరించడం అనే వంకలో సర్వే సమస్యల పరిష్కార కాలవ్యవధిని 90 రోజుల నుంచి 60 రోజులకు, తరువాత 60 రోజుల నుంచి 30 రోజులకు కుదించటం జరిగిందన్నారు. ఈ సమస్య పరిష్కారానికై కావాల్సిన సర్వే సిబ్బందిని గాని, సిబ్బందికి కావాల్సిన సదుపాయాలను గాని కల్పించడం లేదని, అందుకే సర్వే సమస్యలు త్వరితగతిన పరిష్కరించడానికి వీలుకావడం లేదన్నారు. అందువల్ల భూసమస్యల కాల పరిమితిని 30 రోజుల నుంచి 60 రోజులకు పొడిగించాలని వారు కోరారు.

సర్వేశాఖతో అప్రదిష్ట

- ప్రభుత్వ భూములను ప్రైవేటుగా మారుస్తున్నారు
- నెల రోజుల్లో సర్వే చేయకుంటే కఠిన చర్యలు
- రెవెన్యూ, సర్వేశాఖ జేసీల సమావేశంలో మంత్రి కేఈ హెచ్చరిక



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రజలు ఆశించిన మేర సర్వే శాఖ పనిచేయకపోగా, పలు చోట్ల ప్రభుత్వ భూములను ప్రైవేటు భూములుగా మార్చిన ఉదంతాలతో ప్రభుత్వానికి అప్రదిష్ట ఏర్పడుతోందని ఉప ముఖ్యమంత్రి, రెవిన్యూ శాఖ మంత్రి కె.ఈ కృష్ణమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం స్థానిక ఇరిగేషన్ కాంపౌండులో సర్వే శాఖ రెండు రోజుల సమీక్షా కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కీలకమైన సర్వేశాఖ సరిగ్గా పనిచేయడం లేదనే విమర్శ ప్రజల్లో బాగా వుందని, ఈ వాస్తవాన్ని గ్రహించి ఇకనైనా జాబు చార్ట్ ప్రకారం సర్వేయర్లు పనిచేస్తూ అలాంటి విమర్శలకు చెక్ పెట్టాలన్నారు. కాకినాడ, అడవివరంలో ప్రభుత్వ భూములను ప్రైవేటు భూములుగా మార్చిన ఉదంతంపై ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురైందని ఉదాహరిం చారు. ఇటువంటివి మరికొన్ని సంఘటనలున్నా యన్నారు. మీ సేవా ద్వారా సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న వారి పనిని 30 రోజుల్లో పూర్తి చేయాలని, లేని పక్షంలో అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పట్టాదారు పాసు పుస్తకాల మంజూరు, మ్యుటేషన్, సబ్ డివిజను కొరకు సర్వే తప్పనిసరని తహశీల్దారులు చెపుతూ పాసు పుస్తకాలు మంజూరు నిలిపేస్తున్నారని, దీని వల్ల ప్రభుత్వం నిర్థేశించిన లక్ష్యాన్ని చేరుకోలేక పోతున్నా మన్నారు. సర్వే దరఖాస్తులు సకాలంలో పరిష్కారానికి నోచుకోక పోవడానికి ఎంఆర్‌వోలు, ఆర్డీవోలు కూడా భాధ్యులేనన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సంబంధిత రాష్ట్రమని ఎంతో కొంత భూమి కలిగిన రైతులకు, సర్వే అండ్ సెటిల్‌మెంట్ శాఖతో నిత్యము పని ఉంటుందన్నారు.

అందువల్ల ప్రతి సర్వేయర్ పనితీరుపై ఇకనుండి తహసీల్దార్లు జాయింట్ కలెక్టర్లకు వీక్లీ రిపోర్టులు అందజేయాలన్నారు. సర్వే శాఖలో ఉన్న అలసత్వానికి ప్రధాన కారణం డ్యూయల్ కంట్రోల్ విధానమని అందరూ చెబుతున్నందున దానిని సరిచేయాలని సూచించారు. అలాగే మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా లైసెన్సులు కల్గిన సర్వేయర్లకు శిక్షణ కల్పించాలని ఆదేశించారు. ఎఫ్ఎంబి డిజిటలైజేషన్ చేసి ఆ డేటాను వెబ్ ల్యాండ్ సమాచారంతో అనుసంధానం చేస్తున్నామన్నారు. సర్వేలలో ఈటీయస్, డీజీపీయస్ మిషన్లను, డ్రోన్లను వినియోగిస్తామన్నారు. అలాగే సర్వేయర్ల కొరతతో ఇబ్బందులు ఉన్నాయని, త్వరలోనే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేయర్లు కూడా బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు చేరువకావాల్సి వుందని, అప్పుడే ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలను చేరువకావటానికి వీలు ఏర్పడుతుందని మంత్రి చెప్పారు. ఈసమావేశంలో రెవిన్యూ శాఖ స్పెషల్ సీఎస్ మన్మోహన్‌సింగ్, సీసీఎల్ఏ అనిల్‌చంద్రపునీత, రెవిన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ స్పెషల్ సీఎస్ సాంబశివ రావు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ వెంకటరామిరెడ్డి, యస్‌యస్ అండ్ ఎల్ ఆర్ కమీషనర్ సీహెచ్ విజయమోహన్, 13 జిల్లాలకు చెందిన జాయింట్ కలెక్టర్లు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడు మృతి



విశాలాంధ్ర-బలిజిపేట: విజయనగరం జిల్లా బలిజిపేట మండలం అంపావల్లి గ్రామంలో మంగళవారం ఉదయం కుక్కలు మూకుమ్మడిగా బాలునిపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కుటుంబ సభ్యులు, స్థానికుల వివారాల ప్రకారం.. రాగాల సత్యన్నారాయణ కుమారుడు జశ్వంత్(9) మూడవ తరగతి చదువుతున్నాడు. ఉదయం ఇంటి నుంచి బయటకు వస్తుండగా కుక్కలు మూకుమ్మడిగా దాడిచేశాయి. ఎటూ కదలలేక బాలుడు కిందపడిపోయాడు. కుక్కలు ఇష్టమొచ్చినట్టు పీకేశాయి. రక్తపు మడుగులో కొట్టుకుంటున్న కుమారుడిని కుటుంబసభ్యులు హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. గతంలోనూ ఇదే గ్రామంలో కుక్కల దాడిలో 40 నుంచి 50 మేకలు చనిపోయాయి. బాలుడి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.. జిల్లాలో నాలుగు నెలల వ్యవధిలో కుక్కలదాడిలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదర్శ పాఠశాలలకు నిధులు కేటాయించాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆదర్శ పాఠశాలల నిర్వహణ నుంచి కేంద్ర ప్రభుత్వం వైదొలగిన నేపథ్యంలో ఆదర్శ పాఠశాలల నిర్వహణకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులను కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు డిమాండు చేశారు. ఈమేరకు మంగళవారం వారు సంయుక్తంగా ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు గత వేతన సవరణ (పీఆర్సీ)కి సంబంధించి 10 నెలల బకాయిలను చెల్లించడానికి కూడా నిధులను బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2013 జూలై నుంచి అమలులో ఉన్న పీఆర్సీకి సంబంధించి బకాయిలను చెల్లించాల్సి ఉందన్నారు.

కరవు మండలాల్లో అదనంగా 50 రోజుల ఉపాధి

విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం : రాష్ట్రంలోని కరువు మండలాల్లో 100 రోజులు పని పూర్తి చేసుకున్న ఉపాధి కూలీలకు అదనంగా మరో 50 రోజులు పని కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్ఆర్ కడప, అనంతపురం, విజయనగరం జిల్లాల్లోని 80 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. కరువు నేపథ్యంలో ఈ మండలాల్లోని కూలీలు వలసలు పోకుండా తక్షణ చర్యల్లో భాగంగా అదనపు పనిదినాలను కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్వర్యంలో అమరావతిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం ఈ నెల 19వ తేదీన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర సభ్యురాలు, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతి రాణి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 100 పనిదినాలు పూర్తి చేసిన ఉపాధి కూలీలకు అదనంగా 50 పని దినాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఉపాధి హామీ పథకాన్ని మరింత సమర్థంగా వినియోగించుకోవచ్చునని ఛైర్‌పర్సన్ సూచించారు.

సంపాదకీయం

ట్రూడో పర్యటన- చేజారిన అవకాశం

కెనడా ప్రధాని ట్రూడో మన దేశ వారం రోజుల పర్యటన- ప్రభుత్వం గానీ, మీడియాగానీ పెద్దగా పట్టించుకోకపోవడం దౌత్య రంగంలో చర్చనీయాం శమవుతోంది. ట్రూడో సందర్శన వాస్తవానికి మనకు లభించిన ఒక మంచి అవకాశం. దాన్ని మన ప్రభుత్వ పెద్దలు సక్రమంగా ఉపయోగించు కోలేకపోయారు. మోడీ సర్కారు విదేశాంగ, భద్రత కోణంలో ఖలిస్థాన్ అంశాన్ని భూతద్దంలో పెట్టి చూస్తున్నదే తప్ప ఆ భూతాన్ని సమర్థంగా సమాధి చేసే ప్రయత్నం ఏ మాత్రం చేయడంలేదు. ట్రూడో పర్యటనను పట్టించుకోకుండా ఒక విధంగా దౌత్యపరమైన ఒత్తిడి తెచ్చినట్లు మోడీ సర్కారు భావించి ఉండవచ్చుగానీ, కెనడాలో ఆంతరంగిక రాజకీయాల్లో ఆయన విధానాన్ని ప్రభావితం చేయడం కష్టమనే వాస్తవాన్ని విస్మరించింది. అదే విధంగా మనదేశంలోని సిక్కులు ఖలిస్థాన్ భావజాలం వైపు మొగ్గకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ఆలోచించాల్సిన అవశ్యకతను గుర్తించకుండా వ్యవహరిస్తోంది. మోడీ సర్కారు తన హయాంలో దేశంలో మతపరమైన కేంద్రీకరణకు అన్ని రకాల చర్యలు చేపడుతూ, మత విద్వేష దాడులు సాగిస్తుంటే.. ఖలిస్థాన్ వాదులకు ఆయుధాలను అప్పగించినట్లు కాదా! ఖలిస్థానీ మద్దతుదారులను పాకిస్థాన్ ఐఎస్ఐ ఏజెంట్లుగా ముద్ర వేయడం తెలికేగానీ, కెనడాలోని సిక్కు సంతతివారిని పట్టించుకోవడానికి మన విదేశాంగ మంత్రిత్వ శాఖ ఏమి ప్రయత్నం చేసిందంటే సమాధానం చెప్పడం కష్టం. ఆపరేషన్ బ్లూస్టార్ నుంచి వెంటాడుతున్న భూతాన్ని తరిమేసేందుకు, ఇందిరా హత్య తర్వాత దేశ రాజధానిలో సిక్కుల ఊచకోత దుర్ఘటనను రూపుమాపేందుకు చేపట్టిన ఉపశమన చర్యలేమిటి? వారి గుండె గాయాన్ని మాపేందుకు ప్రయత్నించడం కన్నా, దాన్ని తమ రాజకీయాలకు ఎలా పావుగా వాడుకోవాలన్నదానిపైనే ఎక్కువ దృష్టిపెడుతున్నది వాస్తవం కాదా! భారత్ ఉదారవాద, బహుళ సమాజ, ప్రజాస్వామ్య వ్యవస్థ అన్న సత్యాన్ని మరచి మోడీ సర్కారు వ్యవహరిస్తున్న తీరు దేశంలోని ఒక్క సిక్కులకే కాదు, ఇతర మైనార్టీ మతస్థులను తీవ్రంగా కలచివేస్తున్న వాస్తవం మరవరానిదంటే ఆశ్చర్యం ఏముంది.

భారత-కెనడా సంబంధాలు కొద్దికాలం కిందటే పట్టాలెక్కాయి. 1970వ దశకం నుంచి రెండు అంశాలు ఉభయదేశాల మధ్య దౌత్యసంబంధాల్లో అవరోధంగా మారాయి. 1974లో భారత్ శాంతియుత అణుపరీక్ష జరపడంతో మన అణుకార్యక్రమంపై కెనడా ఆంక్షలు విధించింది. రెండోది కెనడాలోని గురుద్వారాల ద్వారా ఖలిస్థాన్ ప్రచారాలు సాగడం. 1954లో భారత్‌లో మొదటిసారిగా ప్రయోగాత్మక 40 మెగావాట్ల అణు రియాక్టర్ నెలకొల్పడానికి కెనడా సహకరించింది. దానిపేరు కెనడియన్ ఇండియన్ రియాక్టర్ యురేనియం సిస్టం(సైరస్). ఈ సైరస్ నుంచి వచ్చిన ప్లుటోనియంను 1974లో అణుపరీక్షకు వాడుకోవడం సరికాదని కెనడా వాదన. అయితే 2010లో భారత్-కెనడాల మధ్య అణు సహకార ఒప్పందం కుదరడంతో ఈ వివాదం ముగిసింది. కెనడా నుంచి యురేనియం దిగుమతి మొదలైంది. స్టీఫెన్ హార్పర్ 2009లో, 2012లో భారత్ సందర్శించిన తర్వాత రెండు దేశాల సంబంధాలు బలపడ్డాయి. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా 2010లో కెనడాలో జీ20 సమావేశానికి వెళ్లారు. ప్రధాని మోడీ కూడా 2015లో కెనడా సందర్శించారు. ట్రూడో ఆ దేశ ప్రధాని కావడంతో రెండు దేశాల మధ్య ఖలిస్థాన్ వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ఆ దేశ ప్రధానిగా చేసిన పియరీ ట్రూడో కుమారుడిగానే గాక, ఆధునిక యువనేతగా, ఉదారవాదిగా గుర్తింపు ఉంది. ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (నాఫ్టా) రద్దు చేస్తానని, తద్వారా కెనడాతో వాణిజ్య సంబంధాలను మారుస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన బెదిరింపులను ట్రూడో ఎంతో చతురతతో ఎదుర్కొన్నారు.

ఆంతరంగిక రాజకీయాల్లో తమకు లబ్ది చూకూర్చే వైఖరి, ధోరణిని అనుసరించడం ఏ నేతకైనా సహజమే. కెనడాలో కోటి ఇరవై లక్షలమంది భారతీయులున్నారు. వీరిలో సిక్కులు దాదాపు నలభై శాతం ఉంటారు. వీరంతా కొన్ని రాష్ట్రాల్లో కేంద్రీకృతమై ఉండడంతో వీరి ఓట్లకు ప్రాధాన్యం ఏర్పడింది. ట్రూడో నేతృత్వంలోని లిబరల్ పార్టీకి సిక్కుల మద్దతు ఉంది. ఆయన మంత్రివర్గంలో నలుగురు సిక్కులు ఉన్నారు. అంతేకాదు, ఆ దేశ రక్షణ మంత్రిగా లెఫ్టినెంట్ కల్నల్ హర్జీత్‌సింగ్ సజ్జన్‌ను నియమించారు. అది ఆ దేశ అంతర్గత వ్యవహారమే. కానీ 1984లో సిక్కుల ఊచకోతను ఖండిస్తూ ఆంటారియో రాష్ట్ర అసెంబ్లీలో ప్రైవేటు తీర్మానం ఆమోదం పొందడం, ఆ సభ్యుడ్ని టోరంటో గురుద్వారాలో సన్మానించడం భారత్‌కు ఇబ్బంది కలిగించే అంశాలే. అయితే బీజేపీ నేతలు రాజ్‌నాథ్‌సింగ్, సుష్మాస్వరాజ్‌లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాటి సిక్కులపై దాడులను ఇదే తీరులో ఖండించారనేది గుర్తుంచుకోవాలి. గత ఏడాది పంజాబ్ ఎన్నికలకు ముందు నేటి సీఎం, కాంగ్రెస్ నేత కెప్టెన్ అమరీందర్‌సింగ్ కెనడా పర్యటనకు వీసా ఇచ్చేందుకు కెనడా తిరస్కరించింది. అదే విధంగా కెనడా రక్షణ మంత్రి సజ్జన్ సింగ్ పంజాబ్ సందర్శించినప్పుడు ఆయనను కలవడానికి అమరీందర్‌సింగ్ నిరాకరించారు. ఇప్పుడు ట్రూడో పర్యటనకు వచ్చినప్పుడు ఇతర విదేశీ నేతలకు ఇచ్చిన గౌరవమర్యాదలు మన సర్కారు అందించలేదు. మోడీ విమానాశ్రయానికి వెళ్లి ఆహ్వానించలేదు. కనీసం తన సహజశైలిలో ఆహ్వానం పలుకుతూ ట్వీట్ కూడా చేయలేదు. గుజరాత్ సందర్శించినప్పుడు మోడీ ఆయన వెంట వెళ్లలేదు. ట్రూడో తాజ్‌మహల్ సందర్శిస్తే జిల్లా అధికారులు తప్ప ఇతర పెద్దలు ఎవరూ పాల్గొనలేదు. పర్యటన చివర రోజున మాత్రం ప్రధాని మోడీ ఢిల్లీలో స్వాగతం పలికారు. కొన్ని ఒప్పందాలు కుదిరాయి. ట్రూడో ఒక స్పష్టమైన అవగాహనతోనే ఈ పర్యటనకు వచ్చారు. తన దేశంలో సిక్కులను సంతృప్తి పర్చడం, భారత్‌తో వాణిజ్య ఒప్పందాలు కుదర్చుకోవాలనేది ఆయన లక్ష్యం. ఎటుతిరిగి మన సర్కారుకే ఏ లక్ష్యం లేకుండా ఉంది.

పంజాబ్‌లో ఉగ్రవాదం రూపుమాసినప్పటికీ, కెనడాలో ఖలిస్థాన్ వేర్పాటువాద భావజాలం ఇంకా బలంగా ఉన్నది. ఇతర దేశాల్లోనూ కొత్త రూపంలో బలమైన పునాదితో ఖలిస్థాన్ ఉద్యమాన్ని నిర్మించే ప్రయత్నాలు సాగుతున్నాయి. రెఫరెండం 2020 పేర రెండేండ్ల తరువాత ఖలిస్థాన్ కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరపాలనే ప్రచారోద్యమం సాగుతున్నది. గురుద్వారాల్లోకి భారతీయ రాయబారుల నిషేధం కెనడాలో మొదలై ఇప్పుడు అమెరికాకు, బ్రిటన్‌కు పాకింది. గురుద్వారాలలోకి భారతీయ రాయబారులు రావడాన్ని నిషేధించారు. ఖలిస్థాన్ ఉద్యమాన్ని తిరగదోడే పరిణామాలు భారత-కెనడా సంబంధాలను ప్రభావితం చేస్తున్నాయి. అయితే భారత సర్కారు కూడా దాన్ని తిప్పికొట్టే చర్యలు చేపట్టడంలేదనే చెప్పాలి. రియాద్‌లో రాయబారి గా ముస్లింనే నియమిస్తారు. గల్ఫ్‌లో ఎక్కువమంది మళయాళీలు ఉంటారు. గల్ఫ్‌లో కార్యాలయాలకు బాధ్యులుగా మళయాళీలను నియమించడం ఆనవాయితీ. కానీ కెనడా విషయంలో ఈ నియమం పాటిస్తున్నారా? 1980 దశకంలో మాజీ స్పీకర్, జాట్ సిక్కు గుర్‌దయాళ్ సింగ్ ధిల్లాన్ కెనడాకు రాయబారిగా పనిచేశారు. ఆ తరువాత మళ్ళీ సిక్కును రాయబారిగా నియమించనేలేదు. ట్రూడో పర్యటనను పట్టించుకోకపోవడం ద్వారా దాని ఖలిస్థాన్ అనుకూల వైఖరిపై కర్కశంగా వ్యవహరించామనే సంకేతాలు ఇచ్చేందుకే మోడీ సర్కారు మొగ్గుచూపింది తప్ప, ఆయన రాకను అవకాశంగా తీసుకొని దేశంలోని సిక్కుల జాతీయతను, దేశభక్తిని చాటేందుకు, ఇక్కడ వేర్పాటువాదానికి అవకాశం లేదనే సందేశాన్ని ఆ దేశ ఖలిస్థాన్ భావజాలంతో ఉన్నవారికి పంపేందుకు ప్రయత్నించడం విస్మరించింది. ఓ మంచి అవకాశాన్ని చేజార్చుకున్నది.

చురక

భవిష్యత్తులో వచ్చునంటా
భారీ రైతుపోరాటం
తెలంగాణ రైతు సమితి
తెగనడిపె ఆరాటం

పోరుపథం ఓట్ల కొరకు
ఫోజుకొట్టె కేసీఆరు
పోరురైతు చేతులకు
బేడీలేసి తిప్పే జోరు

- వేల్పుల నారాయణ

అంతర్జాతీయం

కొరియాలో శాంతి బీజం - సిరియాలో యుద్ధ ఆజ్యం


బుడ్డిగ జమిందార్

దక్షిణకొరియాలో ఫిబ్రవరి 9 నుండి ప్రారంభమైన వింటర్ ఒలిం పిక్స్ క్రీడలు 25న వైభవపూరిత వాతావరణంలో ముగిసాయి. 92 దేశాల నుండి 2,914 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నార్వే 14 గోల్డు, 14 సిల్వర్, 11 కాంస్య పతకాలతో 39 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలవగా 31 పాయింట్లతో ద్వితీయ స్థానంలో జర్మనీ, 29 పాయింట్లతో తృతీయస్థానంలో కెనడాలు నిలిచాయి. గడచిన సంవత్సర కాలం నుండి కొరియా ద్వీపకల్పంలో నెలకొని ఉన్న ఉత్కంఠలతో అసలు ఈ ప్రపంచ క్రీడలు యుద్ధ వాతావరణంలో జరుగుతాయా అనే ఆందోళనలు సర్వత్రా వినిపించాయి. కానీ దీనికి భిన్నంగా శాంతి హస్తాన్ని చూపి ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తనదేశం నుంచి సోదర కొరియాకు క్రీడాప్రతినిధి వర్గాన్ని పంపించటమే కాక సోదరి కిమ్ యోజోంగ్‌ను ప్రారంభోత్సవానికి, ఫిబ్రవరి 25న ముగింపు ఉత్సవాలకు జనరల్ కిమ్ యోంగ్-చోల్‌ను పంపించటం ద్వారా ఇరుదేశాల మధ్య శాంతి చర్చలకు శ్రీకారం చుట్టిన ఘనత ఉత్తర కొరియా అధ్యక్షునికే దక్కుతుంది. అయితే ప్రకటించని శాంతి పతకం మాత్రం ఇరుకొరియాల అధ్యక్షులకే దక్కుతుందని ప్రపంచంలోని ప్రముఖ పత్రికలు రాశాయి. ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న ఐఓసీ ప్రెసిడెంట్ థోమాస్ బాక్ మాట్లాడుతూ 'ఇరుకొరియాల క్రీడాకారులు చేసిన మార్చ్ శాంతియుతమైన భవిష్యత్తును కోరుకొన్నట్లుగా ఉంది' అని వారిని అభినందించారు. ప్యోంగ్ చాంగ్ ఒలింపిక్ క్రీడలు నూతన శాంతిపుంతల్లో విహరించాయని థోమాస్ బాక్ అన్నారు.

దేశాలమధ్య యుద్ధ వాతావరణాన్ని దూరం చేసేవి క్రీడలు మాత్రమేనని వింటర్ ఒలింపిక్స్ మరొక్కసారి రుజువుచేశాయి. భారత్- పాకిస్థాన్ వంటి దేశాల్లో ఉన్న కొద్దిమంది క్రికెట్ ఉన్మాదులు ఇరుదేశాల మధ్య శాంతి చర్చలకు విద్రోహంగా తయారవుతున్నారు. క్రీడాస్ఫూర్తితో పాకిస్థాన్- భారత్‌ల మధ్య దౌత్యసంబంధాల్ని మెరుగుపరచుకొనే అవకాశాన్ని వెతకాలి. ఆసియా ఖండంలో


కొరియా ఒలింపిక్స్‌లో రష్యన్ ఐస్ స్కేటింగ్ క్రీడాకారిణి సగీతావో


సిరియాలో అమెరికా బాంబుదాడుల్లో తల్లడిల్లుతున్న ఓ చిన్నారి

పాక్- భారత్- చైనాల మంచి సంబంధాలు ప్రజల శాంతి సౌభ్రాత్ర త్వాలకు చాలా అవసరం కూడా. దక్షిణకొరియా వింటర్ ఒలింపిక్స్ సంద ర్భంగా ఉత్తరకొరియా అధ్యక్షుడు పంపిన ప్రతినిధి నాయకుడు కిమ్ యోంగ్ చోల్ అమెరికాతో శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించటం ఆహ్వానించదగిన పరిణామం. కానీ ట్రంప్ ప్రభుత్వం మాత్రం శాంతి చర్చలకు సిద్ధంగా లేదు. ఫేజ్-2 సన్నాహాలు చేస్తూ యుద్ధ వాతావరణం సృష్టిస్తూ ఇంకా దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, జపాన్‌లను ఉత్తరకొరియాపై ఉసిగొల్పుతూ మరలా నూతన ఆంక్షలను ప్రకటించింది.

సోవియట్ యూనియన్ పతనం తర్వాత అమెరికా యుద్ధ ఆగడాలకు మిలిటరీ కవ్వింపు చర్యలకు ప్రపంచ వ్యాప్తంగా హద్దులేకుండా పోయింది. ముఖ్యంగా మధ్య ప్రాచ్యంలో ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, లిబియా, సిరియా, ఎమెన్ వంటి దేశాల్లో యుద్ధాలకు అధికారికంగా 7 లక్షల కోట్ల డాలర్లు (మనదేశ జీడీపీకి 3 రెట్లు ఎక్కువ) వ్యయం చేసినట్లు ఒప్పుకోవటం జరిగింది. అనధికారికంగా ఇది 10 లక్షల కోట్లు దాటిందని అంచనా. ట్రంప్ దీన్ని అనవసర చర్య అని పైకి ప్రకటించి కూడా 2018 సంవత్సరానికి అదనంగా 5400 కోట్ల డాలర్లను మిలిటరీ ఖర్చుకు చేర్చాడు. ప్రపంచంలో మిలిటరీ ఖర్చులో 40 శాతం వరకూ (2016లో 61000 కోట్ల డాలర్లు) ఒక్క అమెరికాయే చేస్తున్నది. 2018 జనవరి 27న ట్రంప్ ప్రభుత్వం అణ్వస్త్రాల స్థితిగతులకు సమీక్షను 100 పేజీల నివేదికలో పొందుపరచి విడుదల చేసింది. ఈ సమీక్షను అనుసరించి ట్రియాడ్- నేల, వాయు, సముద్రజలాలు- అను మూడుచోట్ల అణ్వస్త్రాలకు సంబంధించిన సమీక్షచేసి రానున్న కాలంలో ఈ మూడు చోట్లా ఇప్పుడు ఉన్న అణ్వాయుధాలను ఆధునీకరించటానికి, నూతన అణ్వస్త్రాలను దించటానికి కొత్త బడ్జెట్‌తో ప్రవేశించనుంది. ఈ విధానం ప్రపంచంలో ముఖ్యంగా యూరప్‌లో రష్యాను, ఆసియా పసిపిక్‌లో చైనాను నూతన ఆయుధ పోటీల్లోకి దించనుంది. భారత్- పాకిస్థాన్ వంటి దేశాలు కూడా ఈ ఆయుధ పోటీల్లో రంగప్రవేశం చేసి అభివృద్ధికి దూరమవుతున్నాయి. ఇప్పటికే ప్రపంచంలో 18 వేల వరకూ అణ్వాయుధాల గుట్ట పోగయి ఉంది. వీటిల్లో 16 వేల వరకూ చెరిసగం అమెరికా, రష్యాల దగ్గరే పేరుకుపోయి ఉన్నాయి. ఈ దేశాలు ముందు అణ్వాయుధ రహిత దేశాలుగా తయారై మిగతా దేశాలకు శాంతి ఉపదేశాలు చేయాలి. స్వీయరక్షణకై కేవలం 10 అణ్వాయుధాలు కూడా లేని ఉత్తరకొరియాను పెద్ద విలన్‌గా చూపే ప్రయత్నం అమెరికా మానుకోవాలి.

సిరియాలో 2015 సెప్టెంబరులో రష్యా వాయుసేనల రంగప్రవేశం తర్వాత ఉగ్రవాదం చాలావరకూ బలహీనపడింది. ప్రభుత్వ సేనలు బలం పుంజుకొని దేశంలో ఇస్లామిక్ టెర్రరిజంపై విజయం పూర్తిగా సాధిస్తున్న సమయంలో సిరియాలోని ఆఫ్రీన్ జిల్లా కుర్దుల సమస్య తెరపైకి వచ్చింది. టర్కీ, సిరియా, ఇరాక్, ఆర్మేనియాల్లో మూడున్నర కోట్ల కుర్దులు ఎప్పటినుంచో ప్రత్యేక కుర్దిస్థాన్ కోసం పోరాడుతున్నారు. జనవరి 20 నుండి ఆపరేషన్ వొలీవ్‌బ్రాంచ్ పేరిట ఆఫ్రీన్‌లో కుర్దులు, సామాన్య ప్రజలపై టర్కీ వాయుదాడులు ప్రారం భించి ప్రాణాల్ని తీస్తున్నది. టర్కీలోని పీకేకే కుర్దుల పార్టీకి అనుబంధంగా సిరియాలోని పీవైడీ పార్టీల పేరిట పనిచేస్తున్నారని టర్కీ వీరిపై దాడుల్ని ముమ్మరం చేసింది. కానీ ఈ పీవైడీతో అమెరికా సంబంధాల్ని ఏర్పర చుకొని సిరియా అస్సాద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దాడు ల్ని ప్రోత్సహిస్తూ నిధులు, ఆయుధాలు సమకూ రుస్తోంది. ఈ నేపథ్యంలో టర్కీ, అమెరికాల యుద్ధ స్నేహ సంబంధాలు, నాటో యుద్ధ కూటమి సంబంధాలు కూడా బెడిసి కొడుతున్నాయి. అమెరికా యుద్ధ స్థావ రాల్ని ఈ ప్రాంతంలో ఏర్పాటుకు ప్రయత్ని స్తోంది. ఇంకోవైపు సిరి యా, రష్యాలు కూడా ఉగ్రవాదంపై దాడి పేరుతో విమాన దాడులు చేస్తున్నాయి. ఈ అన్ని దేశాల దాడుల మధ్యలో సిరియాలోని సామాన్య ప్రజానీకం- ముఖ్యంగా చిన్నారులు మరణిస్తున్నారు. తెలియకుండా యుద్ధ సంస్కృతి తుపాకీతో స్నేహం అమెరికన్లకు ఉగ్గుతోపోసిన విద్యగా మారుతూ మానవ సంబంధాల్ని నాశం చేస్తుందనటానికి ప్రత్యేక నిదర్శనం స్కూలు పిల్లల్లో సైతం పాకిన ఉన్మాదానికి నిదర్శనం మొన్న ఫ్లోరిడా స్కూల్‌లో తుపాకీ కాల్పుల్లో నేలకొరిగిన అమాయక స్కూలు పిల్లలు. తుపాకులను నిరోధించటానికి ఇష్టపడని అమెరికా సామ్రాజ్యవాదం స్కూలు టీచర్లను కూడా తుపాకుల్ని పట్టుకోమంటోంది. సరిగ్గా ఈ తత్వాన్నే సిరియా, కొరియాలలో అమలు చేయమంటోంది సామ్రాజ్యవాద యుద్ధసంస్కృతి. సామ్రాజ్యవాద యుద్ధ సంస్కృతిని నిరశిస్తూ యుద్ధ రహిత శాంతి స్థాపనకోసం పయనిద్దాం. కొరియా వింటర్ ఒలింపిక్స్‌ను ఆదర్శంగా తీసుకొందాం.

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం
జాతీయ కార్యవర్గ సభ్యులు.
సెల్ : 9849491969

సౌజన్య పక్షపాతం


సంగిరెడ్డి హనుమంతరెడ్డి

పాలకులు అబద్ధాలు, అతిశయోక్తులు, అశాస్త్రీయాలు వల్లించినా, ప్రజావ్యతిరేక విధానాలతోపాలించినా సహచరులు ప్రశ్నించరు. పెట్టుబడిదారీ పాలన ముదిరి సామ్రాజ్య వాదంగా మారుతుందని మార్క్స్ అన్నారు. సౌజన్య పక్షపాతం, నిరాసక్త, నిష్క్రియాత్మకత కవలలు. ఈ దుష్ట చతుష్ట యాలు సామాజిక వినాశకాలు.

సౌజన్య పక్షపాతం: అధినేతలకు,యజమానులకు మన స్తాపం కలుగుతుందనిఅసంత ృప్తిని వ్యక్తీకరించనిలేదా తక్కువగా ప్రస్తావించే స్పందనాతీరును,మానసిక ధోరణిని సౌజన్య పక్షపాతం అంటారు. తమ అభిప్రాయాన్ని, నిజాన్ని, జ్ఞానాన్ని దాచి సమాజం ఆమోదించే ఆలోచనను చెప్పడమే సౌజన్య పక్షపాతం.దీన్ని హాథోర్న్ ఎఫెక్ట్ (పరిశీలక ప్రభావం) అని కూడా అంటారు.అమెరికాలో షికాగో దగ్గర ఈ ప్రభావాన్ని తొలిసారిగా అనుభవించిన స్థలం హాథోర్న్. మనలను ఇతరులు గమనిస్తున్నప్పుడువారికి అనుకూలంగా ప్రవర్తించడమే పరిశీలక ప్రభావం.ఆధునిక మానవున్ని ఆవరించిన అనేక అభిజ్ఞాత పక్షపాతాలలో ఇదీ ఒకటి."వారు మాపోషకులు, మేము లబ్ధిదారులం. వారి సహాయానికి కృతజ్ఞులం. వారిని తప్పుపట్టం, విమర్శించం." ఇదీ అనుచరుల సమర్థన. అధికారం దారితప్పి, నీతినిజాయితీలుతగ్గి, అహంకారం పెరిగి,పొగడ్తలకు పొంగి, తెగడ్తలకు కుంగి, తెగిడిన వారిని తెగటార్చుతున్నప్పుడుప్రజా జీవితంలో, సామాజిక సంబంధాలలో సౌజన్య పక్షపాతం ప్రత్యక్షమౌతుంది.

సర్వేలలో సౌజన్య పక్షపాత ధోరణులు: అనేక అంశాలపై సర్వేలు జరుగుతాయి. సర్వే చేస్తున్న సంస్థ మద్దతు ఇవ్వాలనుకున్న వాళ్ళకు అనుకూల జవాబులు వచ్చేటట్లు ప్రశ్నావళి రూపొందిస్తారు. అమరావతి భూసేకరణ సందర్భంలో ఒక దినపత్రిక వాకింగ్ పార్కులలో చర్చాగోష్టి నిర్వహించేది. అందులో పాలక పార్టీకి అనుకూలమైన జవాబులు వచ్చేటట్లు ప్రశ్నలడిగేవారు. మన ప్రధాని పత్రికలకు ఇంటర్వ్యూ ఇవ్వరు. ఇస్తే ఆయన ఇచ్చిన ప్రశ్నలనే పాత్రికేయులు అడగాలి. ప్రజలు పాలకులకు కోపమొచ్చే జవాబులు చెప్పరు. తమ నైజాన్ని బయట పెట్టుకోరు. అభ్యుదయవాదులుగా నటిస్తారు. ఒక సర్వేలో 80% ప్రజలు పర్యావరణ పరిరక్షణకు పాటుబడుతున్నామని చెప్పారు. అదే నిజమైతే పర్యావరణం ఎందుకు పాడవుతోంది? ఎవరైనా మేము పర్యావరణాన్ని పట్టించుకోమని చెపుతారా? అని తార్కిక ప్రశ్న. రాజకీయ ప్రశ్నలకూ ఆమోద జవాబులే ఇస్తారు. ప్రధాని 'మనసు మాట' కార్యక్రమం వింటారా? ప్రధాని పథకాలు. విదేశీ పెట్టుబడులు మంచివా? వంటి ప్రశ్నలకు విరుద్ధ జవాబులిచ్చి, సంఘీయుల సతాయింపునకు గురికావాలని ఎవరైనా కోరుకుంటారా?అభిప్రాయ సేకరణ ప్రారంభిస్తారు. ముగ్గురు అస్మదీయులను అడుగుతారు. సహజంగా ముగ్గురూ సానుకూల జవాబులిస్తారు. 100% మద్దతు లభించిందని ప్రకటిస్తారు.

ప్రజల మధ్య వ్యక్తిగత సంబంధాలను అంచనా వేయడానికి మౌఖిక సమావేశాలు, గుణాత్మక అధ్యయనాలు, ప్రత్యక్ష పరిశీలనలు జరిపారు. ప్రజా సేవలను పరీక్షించారు. భారత్, పెరూ, రువాండా లలో విరుద్ధ ఫలితాలు వచ్చాయి. మందు పేరు తప్పుగా పలికినందుకు మొరాకోలో నర్సు నవ్వారని, తన సహోద్యోగులకు చెప్పి ఎగతాళి చేశారని మెర్సిని అన్నారు. మెరుగైన సేవలను కోరినందుకు ఈక్వెడార్‌లో క్రిస్టింషా కు, హోండురాస్‌లో ముండిగోకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. వరుసగా నేపాల్, బొలీవియా, బంగ్లాదేశ్‌లకు చెందిన స్కూలర్, రాంస్, హుసేన్ లు తమకు ఆసుపత్రులలో విరుద్ధ ప్రవర్తనలు ఎదురయ్యాయని, మమ్మలను మూర్ఖులుగా పరిగణించారని తెలిపారు. అయినా బహిరంగ సర్వేలో మొరాకో లో 94%, ఈక్వడార్, ఉగాండా, జింబాబ్వే లలో 99%, కరీబియన్, లాటిన్ అమెరికాలలో 100% తమను మర్యాదగా చూశారని, తమకు అద్భుత సేవలు లభించాయని చెప్పారు.ఉత్తర ప్రదేశ్ లో ఆరోగ్య సేవలు అధ్వాన్నం. అయినా 2,428 మందిని సర్వే చేయగా 33% మందే నిజం చెప్పారు. జార్ఖండ్ రాష్ట్రం రాంచి జిల్లాలో బుర్ము, కంకే, ఒర్మాంఝి ప్రాంతాలలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన మహిళలు గ్రామీణ ఆరోగ్య సేవలకు సంబం ధించి నిజాలను దాచారు. ప్రభుత్వ శాఖలు శిక్షణా తరగతులు నిర్వహిస్తాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయాచితలబ్ధి పొందుతారు. శిక్షణ తర్వాత సేకరించే ఫీడ్ బ్యాక్ లో విద్యార్థులందరూ అబద్ధాలే రాస్తారు. ప్రయోజనాలు పోతాయని వీళ్ళ భయం. ఫలితంగా ప్రజాధనం ఖర్చయినా శిక్షణల ప్రయోజనం నెరవేరదు.

కేంద్ర పాలకులు అమెరికా తానా అంటే తందానా అంటున్నారు. అమెరికా అభివృద్ధి శాఖ మన వాణిజ్య శాఖ 2016 అక్టోబర్‌లో భారత్ లో నగదురహిత ఆర్థికంపై ఒప్పందం చేసుకున్నాయి. ఆమేరకు ప్రధాని ఏకపక్షంగా పెద్దనోట్ల రద్దు చేశారు. మంత్రివర్గం, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ నోరు విప్పలేదు. ప్రజా వ్యతిరేక బిల్లులు, కార్యక్రమాలు, పథకాల విషయంలో మంత్రులు, అధికారులు పట్టించుకోరు. కేంద్ర నిఘావిభాగాలు, ఎన్నికల సంఘం, అధికారగణం ప్రధాని మాట జవదాటరు. బీజేపీ అధ్యక్షుని ఆదేశాలను సంఘ్ గవర్నర్లు, విశ్వవిద్యాలయాల ఉపాధ్య క్షులు, సంఘీయులు పాటి స్తారు. కార్పొరేట్ల విన్యాసాలకు అధికారులు, మంత్రులు చిందేస్తారు. విశ్వ విద్యాలయాలు, ప్రయోగ శాలలు, పరిశోధనాలయాలకు నిధులు తెగ్గోస్తే, దేశద్రోహం అభాండాలతో విద్యార్థులను నిర్బంధిస్తే ప్రగతి ఎలా సాధ్యం? ఇంతటి తిరోగమన "అభివృద్ధి" నమూనాను అమలు చేస్తుంటే సంబంధి తులు ఎవరూ అడగరు, అడ్డుకోరు. సౌజన్య పక్షపాతం వీళ్ళను అడ్డుకుంటుంది. సంస్కృతీ పునరుద్ధరణ పేరుతో మానవ సంస్కృతిని నాశనం చేస్తున్నారు. మనిషి మొండానికి ఏనుగు తలను అతికించిన ప్లాస్టిక్ సర్జరీ, జన్యుశాస్త్రం, కాండ కణ సాంకేతిక పరిజ్ఞానం హైందవ భారతంలోనే ఉన్నాయని మోడీ అన్నారు. ఆ సభలో పలువురు ప్రఖ్యాత వైద్యులు, అమితాభ్ బచ్చన్, సచిన్ తెండూల్కర్, సునిల్ గవాస్కర్ వంటి ప్రముఖులు ఉన్నారు. కాని నోరు విప్పలేదు. వీరందరికీ ఏదో భయం. అందుకే ఈ నిష్క్రియాపరత్వ, పక్షపాతాలు. పాకిస్తానీయులు తలలు నరుక్కు పోయిన భారత సిపాయిల మొండాలకు పశు శిరస్సులను అతికించకుండా నాటి పాలకులను ఎందుకు నిందించారని ఎవరూ ప్రశ్నించలేదు.

ఆంధ్ర ప్రదేశ్ కు ప్రత్యేక తరగతి హోదాపై మూడేండ్ల నుండి రాష్ట్ర పాలకులు కేంద్ర పాలకులకు వంత పాడుతున్నారు.అమరావతిలో ఎక్కడో ఉన్న విదేశీ సంస్థలకు, మతసంస్థలకు, ప్రైవేట్లకు వేల ఎకరాలు దానం చేశారు. అక్కడే ఉండి ప్రభుత్వాధినేతలకు ఊడిగం చేస్తున్న అధికారులకు, కార్మికులకు, ప్రగతిలో భాగస్వాములైనపేద రైతులకు, వ్యవసాయ కార్మికులకు, పేదలకు, వెనుకబడ్డ వర్గాలకు ఒక్క అడుగు భూమి కూడా ఇవ్వలేదు. ఇది సౌజన్య పక్షపాతం పొందడానికి చేసిన పరోక్ష భూవిక్రయం.

పాలకపక్షం గాక పాలితపక్షం వహించేది,నిజాన్ని నిర్భయంగా నివేదించేది పాత్రికేయత. వామపక్షాల పత్రికలు తప్ప నేటి మాధ్యమాలన్నీ కార్పొరేట్ల సొంతం. కార్పొరేట్ల యజమానులు, ప్రభుత్వాధినేతలు, మతాధికారులు ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసిమెలిసి పనిచేస్తున్నారు. నీకిది నాకది (క్విడ్ ప్రో కొ) సూత్రాన్ని అమలు చేస్తున్నారు. అందుకే వార్తలు, కథలు, కథనాలు, వ్యాసాలు, విశ్లేషణలు, వివరణలు, చిత్రాలు, వీడియోలు, సినిమాలు అన్నీ వీరి ప్రయోజనాలను కాపాడుతున్నాయి. సామాన్యుల, తాడిత, పీడిత జనాల, కూలీల, అణగదొక్కబడిన తరగతుల, శూద్రుల, గిరిజన ఆదివాసుల, రైతుల, మహిళల సమస్యలు ప్రతిబింబించవు. చట్టసభలలోని ధనికులు, వాణిజ్యవేత్తలు, గుత్తేదారులు, పెట్టుబడిదారులు చేసుకునే ప్రజావ్యతిరేక చట్టాలకు ఈ పత్రికలు మద్దతిస్తాయి. ప్రజామోదాన్ని సంపాదిస్తాయి. మతఛాందసాలను, మూఢనమ్మకాలను పోషిస్తాయి. అవినీతిని అందలమెక్కిస్తాయి. సామ్రాజ్యవాదాన్ని సమర్థిస్తాయి. యుద్ధాలకు మద్దతునిస్తాయి. ఇదంతా పత్రికా సౌజన్య పక్షపాతమే.

సౌజన్య పక్షపాతం నకారాత్మకతను సకారాత్మకంగా మారుస్తోంది. పరిశోధనలను దారితప్పిస్తున్నది. సామాజిక శాస్త్రాల పరిశోధన ప్రయోగాలపై దుష్ప్రభావం కలిగిస్తుంది. దీని సామాజిక ప్రభావాలు పిల్లల, విద్యార్థుల, యువకుల వ్యక్తిత్వ వికాసం, నైతికతల అభివృద్ధి మీద చెడు ప్రభావాలను కలిగిస్తాయి. ఇంటర్వ్యూ చేసినవారిని సంతోషపెట్టడానికి, సంబంధిత అధికారులకు కోపం తెప్పించకుండా ఉండడానికి వ్యక్తీకరించిన ఈ సౌజన్య పక్షపాతాల వలన సేవలు ఇంకా అధ్వాన్నమవుతాయి. అధికారులు, ప్రభుత్వాలు మరింత గర్విష్టులు కావడానికి, ప్రజాసేవలను ఇంకా అశ్రద్ధ చేయడానికి దారితీస్తాయి. ప్రపంచ వ్యాపితంగా పరిశోధన ఫలితాలను తారుమారు చేస్తాయి. ఫాసిజాన్ని, సామ్రాజ్య వాదాన్ని ప్రోత్సహిస్తాయి.

ఆర్థిక మోసాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నీరవ్ మోడీ 12వేల కోట్ల కుంభకోణానికి ఆలస్యంగా స్పందించిన మోడీ హుంకరించారు. మోసగాళ్ళు విదేశాలకు పారిపోయారు. అక్కడ మోడీయం పనిచేయదు. సౌజన్య పక్షపాతం పక్షవాతంలా పనిచేస్తోంటే చర్యలుండవు, నల్లధనం రాదు, అవినీతి పోదు, ప్రజాస్వామ్యం మనుగడ కోల్పోతుంది, రాజ్యాంగం రద్దవుతుంది, భారత్ హిందూత్వ మత దేశమవుతుంది.

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం
జాతీయ కార్యదర్శి, సెల్ : 9490204545

వణుకుతున్న 'సిరియా'

సిరియా ...
నీ గుండెలపై
అణుబాంబులు కురిపిస్తున్నారు
నెత్తుటి ముద్దలతో దేశం తడిసిపోతోంది
చిన్న పిల్లల మృతదేహాలు
వణుకుతున్న దేశ ప్రజలు
భయంతో పరుగులు
నెత్తిమీద కుప్పకూలిన భవంతులు
శిథిలాల కింద పసికందుల ఆక్రందనలు
నెత్తుటితో తడిసిన మొఖాలు
శరీరమంతా గాయాలు
'తెగిపోయిన పేగు బంధాలు'
'చెల్లాచెదురుగా ' పడివున్న అవయవాలు
పసిపిల్లల యేడుపులు
కనికరంలేకుండా కురిపిస్తున్న 'బాంబులు'

సిరియా ... సిరియా... సిరియా...
యుద్ధ కాంక్ష కోసం రగిలిపోతున్న దేశాలు
పైకి మాత్రం ' శాంతి ' ఒప్పందాలు
నీ వంక
దేబిరించుకొని చూస్తున్న
ప్రపంచ దేశాలు....

- తంగిరాల సోనీ


విశాలాంధ్ర
బతుకు
The Life
బుధవారం
28 ఫిబ్రవరి 2018



పురాతనం...ఆధునికం!

ఈ చిత్రంలో ఏం కనపడుతోంది? ముందున్న మంచుతో నిండిన సైకిల్...అది ఆనుకుని ఉన్న ఒక రెయిలింగ్. అంతేనా...మరి దాని వెనకనున్నదేమిటో అర్థమైందా! కొలీజియం. రోమ్‌లో అతి పురాతనమైన భవనం. చెప్పకోవాలంటే దీనికి చాలా పెద్ద చరిత్రే ఉంది. అత్యంత పురాతనమైన ఈ భవనం ముందు ప్రస్తుత కాలానికి అద్దం పడుతూ తెల్లని మంచు కప్పేసిన ఈ చిత్రం పురాతనం, ఆధునికం కలబోతలా లేదూ!

వేగంగా చదవడమెలా!



చదవడం కూడా ఒక కళే. కొంతమందికి వాళ్ళు చదివింది వాళ్ళకే అర్థం కాదు. మరికొంతమందికి వాళ్ళు అర్థం చేసుకోవడమే కాదు ఎదుటివాళ్ళకీ స్పష్టంగా అర్థమయ్యేలా చదవగల నేర్పు ఉంటుంది. కొందరు చాలా నిదానంగా చదువుతారు. అయినా ఏం చదివారో చెప్పలేరు. మరికొందరు చాలా వేగంగా చదువుతారు. అంతే చక్కగా చదివింది గుర్తుపెట్టుకోగలుగుతారు. ఎక్కువ విషయాలను గ్రహించగలుగుతారు. ఏంటీ తేడా? అంతే వారివారి సామర్థ్యాల్లో తేడా. ఈ సామర్థ్యాలు ఎక్కడ నుంచి వస్తాయి? అన్నీ అందరికీ పుట్టుకతోనే రావు. సాధనతోనూ సమకూర్చుకోవచ్చు. ఆ మాటకొస్తే జన్మత: నైపుణ్యాలను ఒంటబట్టించుకునేవారు అతి తక్కువ మంది ఉంటారు.

చాలామంది చాలావరకూ అభ్యాసం, సాధనతోనే అన్నీ సాధిస్తారు. దీనికి సంబంధించినదే... మన తెలుగులో చక్కని పద్యము కూడా ఒకటి ఉంది....సాధనమున పనులు సమకూరు ధరలోనే...అన్నది అందులోని ఒక వాక్యం. చదవడమూ అంతే. సాధన, అభ్యాసంతో అలవాటు చేసుకోవచ్చు. మరి ఈ సాధన ఎలా అన్నదే ఇప్పుడు మనం తెలుసుకోవలసిన విషయం. విజ్ఞాన సంపద అంతా పుస్తకాల్లోనే నిక్షిప్తమై ఉంటుంది. తక్కువ సమయంలో ఎక్కువ పుస్తకాలను చదవడం ద్వారా కావలసినంత జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు. ఇదెలా అంటే వేగంగా చదవడం ద్వారానే సాధ్యం. ప్రపంచంలోని గొప్పగొప్ప భావాలన్నీ పుస్తకాల్లోనే కనిపిస్తాయి. మంచి పుస్తకాలు మనల్ని చైతన్యవంతులను చేయడమే కాదు మేథస్సును, నైపుణ్యాలను కూడా అందిస్తాయి. జీవితాలను మార్చగల శక్తి పుస్తకాలకు ఉంది. అందుకు మనచుట్టూ ఉన్న సమాజంలో ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. జీవితం సంగతి ఎలా ఉన్నా వేగంగా చదవడం, చదివింది గుర్తుపెట్టుకునేందుకూ కొన్ని మార్గాలున్నాయి. అవి

- నిదానంగా చదివే అలవాటు ఉన్నప్పుడు ఒక్కసారే వేగాన్ని అందుకోవాలని ప్రయత్నించవద్దు. ఒక్కో పేరా చదివి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఒకదాని తర్వాత మరో పేరా చదవడం ద్వారా మొత్తంగా అందులో ఏముందో సారాంశం అర్థం చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇలా చదవడం వల్ల నిదానంగా చదివినా చదివింది గుర్తు ఉంటుంది.
- క్లాసు పుస్తకాలు అయినా లేదా జనరల్ పుస్తకాలు అయినా చదివింది గుర్తుండాలంటే ముందు ఏకాగ్రత ఉండాలి. ఒక పక్కన చదువుతూనే మరోవైపున ఫోన్ సౌండ్స్ వినడం లేదంటే ఇంకేదో ఆలోచించడం చేస్తే చదివేది ఏమాత్రం మైండ్‌కి ఎక్కదు. జ్ఞాపకం అసలే ఉండదు. ఏదేమైనా మన చూపూ, మనస్సు రెండూ పుస్తకం మీదే ఉండాలి. అప్పుడే ఏకాగ్రత కుదురుతుంది. జ్ఞాపకం ఉంటుంది. ఏకాగ్రతతో చదివితే మీకు తెలియకుండానే మీరు చదివే వేగమూ అదే పెరుగుతుంది.
- అల్బర్ ఐన్‌స్టీన్ గొప్ప మేథావి కదా! చదవడం గురించి ఆయన చెప్పింది కూడా ఒకసారి ఇక్కడ గుర్తుచేసుకుందాం. ఏదైనా చదవడానికి కష్టంగా, క్లిష్టంగా ఉందనుకున్నప్పుడు మూడుసార్లు చదవాలి అన్నది ఆయన సూత్రం. ఆ తర్వాతే అది మన మైండ్‌కి ఎక్కుతుంది అంటారాయన. ఇందుకోసం కొంచెం సమయం తీసుకున్నా పర్వాలేదు. మళ్ళీమళ్ళీ చదవడమే ఉత్తమం. ఈ ప్రయత్నమే క్రమంగా వేగంగా చదవడానికీ, అర్థం చేసుకోవడానికీ దోహదపడుతుంది.
- ఒకసారి చదవగానే బుర్రకు ఎక్కలేదా? మళ్ళీమళ్ళీ చదివినా ఎక్కడం లేదా? అయితే అప్పటికి అది వదిలేయండి. కాసేపు అంటే కనీసం పావుగంట రిలాక్స్‌గా అటూఇటూ తిరిగి రండి. వీలుంటే ఓ కప్పు కాఫీ లేదంటే ఏదైనా మీకు ఇష్టమైన జ్యూస్ తాగేయండి. అప్పుడు వచ్చి చదవండి. వెంటనే బుర్రకు ఎక్కుతుంది. పైగా ఇలా చేసినవి ఎక్కువకాలం జ్ఞాపకం ఉంటాయి కూడా.
- కొన్నిసార్లు కొంత మేటర్ అలా కళ్ళతో చదివినట్లే ఉంటుంది కానీ అందులో ఏముందో తెలీదు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో అక్కడే ఆగిపోకుండా మొత్తం ఆ పేజీ అదే క్లాసు పుస్తకాలైతే మొత్తం చాప్టర్ ఒకసారి చుట్టేయండి. అప్పుడు మళ్ళీ మీకు అర్థం కాలేదనుకున్న భాగాన్ని చదవండి. సులభంగా బోధపడుతుంది. వేగంగా చదవడం, అర్థం చేసుకోవడం అలవాటు చేసుకోవడానికి ఇదొక మంచి ట్రిక్కు. ఒక్కసారి ఆచరించి చూస్తే దీని ఫలితం ఏమిటో మీకే అర్థం అవుతుంది.



- ప్రయత్నం అంటూ ప్రారంభమయ్యాక ఎంతోకొంత పురోగతి ఉంటుంది కదా! గత వారం కంటే మెరుగయ్యారా? లేదా? వేగంగా చదువుతున్నారా? లేదా గమనించుకోండి. మెరుగుదల ఉందా? అయితే ఇప్పుడు ఇక టైమ్ సెట్ చేసుకోండి. అరగంటలో ఎన్ని పేజీలు చదవగలుగుతున్నారో చూసుకోండి. ఇంకెంత పురోగతి సాధించాలో నిర్ణయించుకోండి. ఆ చదివినదాంట్లో ఎంత అర్థం చేసుకోగలుగుతున్నారో కూడా లెక్కేసుకోండి.
- అలసట, నీరసం, కళ్ళు తిరగడం లాంటివి ఉన్నప్పుడు ఏమీ చదవద్దు. చదివినా అది కాలక్షేపానికే అయ్యి ఉండాలి. ఎందుకంటే ఇలాంటప్పుడు చదివినవి అర్థంకావు, అస్సలు గుర్తుండవు. చదివింది జ్ఞాపకం ఉండాలంటే మెదడు క్రియాశీలంగా ఉండాలి. మెదడు క్రియాశీలంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలి. ఏకాగ్రతను పెంచే ఆహారం ఎక్కువ తీసుకోవాలి.
- ఇది ఆఖరి చిట్కానే గానీ అన్నింటికంటే అవసరమైన చిట్కా. అదే అభ్యాసం...సాధన. ఒక్క చదవడం ఏంటి..సాధనతో ఏదైనా సాధించేయవచ్చు. అందుకే మన తెలుగులో ఒక నానుడి ఉంది....అభ్యాసం కూసు విద్య అని. తరచుగా చదవడం వల్ల, వీలు చిక్కినప్పుడల్లా, అవకాశం దొరికినప్పుడల్లా చదువుతూ ఉంటే వేగంగా చదవడం అదే అలవాటు అవుతుంది.

వేగంగా చదవడం అలవాటు చేసుకోవడానికి, అర్థం చేసుకోవడానికి ఇంతకుమించిన చిట్కాలు, మార్గాలు ఏమీ లేవు. స్పీడ్‌గా చదవడం, అంతే స్పీడ్‌గా అర్థం చేసుకోవడం అనేవి మంచి నైపుణ్యాలు. తరచుగా ఈ పని చేయడం ద్వారా మాత్రమే వీటిని ఒంటబట్టించుకోగలుగుతాం. ఇక్కడ కావలసినదేమంటే కొంచెం ఓర్పు, ఇంకొంచెం ఓర్పు అంతే. ప్రయత్నం అంటూ ఉంటే కొంచెం ఆలస్యమైనా సాధించలేనిదేమీ లేదు.

-ఎస్ఎస్

అలసటగా ఉన్నప్పుడు....


ఇలా చేయవద్దు!

పనిచేస్తూ ఉండగా కళ్ళు వాలిపోతున్నాయా? లేదంటే రోజంతా నీరసంగా, చిరాగ్గా అనిపిస్తోందా? పగలంతా మత్తుగా, రాత్రిపూట నిద్రలో ఏదో అసౌకర్యంగా అనిపిస్తోందా? అయితే మీరు తీవ్రమైన అలసటలో ఉన్నట్టే. ఇది అనేక దీర్ఘకాల అనారోగ్యాలకు సంకేతం కూడా అనే విషయాన్ని గ్రహించాలి. మనస్సుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శరీరం మాత్రమే అలసిపోతే వెంటనే బెడ్ మీదకి చేరిపోయి నిద్రకు ఉపక్రమించవచ్చు. నిద్ర నుంచి లేవగానే అలసట తీరిపోతే పర్వాలేదు. లేదంటనే సమస్య. ఈ ఇబ్బంది ఇలాగే రోజుల తరబడి కొనసాగితే హార్మోన్ల విడుదల, శరీర ఉష్ణోగ్రత, రోగ నిరోధక వక్తి, బరువు నియంత్రణ లాంటి అనేక కీలకమైన అంశాలపై ప్రభావం చూపిస్తుంది. క్రమంగా ఒంట్లో శక్తి క్షీణించిపోతుంది, ఏకాగ్రత తగ్గిపోతుంది, జ్ఞాపకశక్తి మందగిస్తుంది. మన మూడ్ మన నియంత్రణలో లేకుండా పోతుంది. ఇలాంటి లక్షణాలన్నీ కనిపించాయా? అయితే మీ జీవనశైలిని మార్చుకోవాల్సిందే. తీవ్రమైన అలసటలో ఉన్నప్పుడు చేయకూడని పనులూ కొన్ని ఉన్నాయి. అవి..



- కప్పుల మీద కప్పులు కాఫీ లాగించే అలవాటు ఉందా? అయితే వెంటనే ఇది మానుకోండి. ఇది అలసటకు కారణమవుతుంది. కాఫీ అతిగా తాగడం వల్ల తాత్కాలికంగా శక్తి వచ్చినట్లు అనిపిస్తుంది కానీ నిజానికి దీర్ఘకాలంలో ఇది శరీరంలో శక్తిని హరించేస్తుంది. కాఫీలోని కెఫీన్ తాగిన తర్వాత దాదాపు ఐదు గంటలు పొట్టలోనే తిష్ట వేస్తుంది. ఒకసారి తాగితేనే ఈ పరిస్థితి. మరి వెంటవెంటనే తాగితే మరో ఐదు గంటలు, మరో ఐదు గంటలు ఇలా కెఫీన్ కదలకుండా పొట్టలోనే ఉండిపోతుంది. ఇది రాత్రిపూట నిద్రపట్టకుండా చేస్తుంది.
- అలసటగా ఉన్నప్పుడు జిమ్‌కి వెళ్ళి ఎక్కువ సమయం కష్టపడవద్దు. ఎక్కువ ఎక్సర్‌సైజ్‌లు చేయడం వల్ల ఒంట్లో శక్తి చాలావరకూ కరిగిపోతుంది. కండరాలూ సరిగ్గా పనిచేయక నీరసం మరింత ఎక్కువవుతుంది. జిమ్‌కి వెళ్ళడం కాకుండా వాకింగ్, బైకింగ్ లాంటి చిన్నచిన్న ఎక్సర్‌సైజ్‌లు చేయాలి. వీటివల్ల కండరాలకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు.
- నీరసంగా ఉంది కదాని ఎక్కువసమయం అదేపనిగా అలాగే పడుకుని ఉండిపోవద్దు. ఇది మంచి పద్ధతి కాదు. పగటిపూట అస్సలు పడుకోవద్దు. ఇది రాత్రి నిద్రకు దూరం చేస్తుంది. దీనివల్ల తర్వాత రోజుకి మరింత అలసట అనిపిస్తుంది. కావాలంటే పగలు చిన్న కునుకు తీయండి. అది 20, 30 నిముషాలకే పరిమితం చేయండి. ఈ నిద్ర మిమ్మల్ని చురుకుగా, క్రియాశీలంగా ఉంచుతుంది.
- రాత్రిపూట రోజువారీ నిద్రా సమయాన్ని తగ్గించేయవద్దు. అలసటగా ఉన్నప్పుడు అలారం పెట్టుకుని ముందుకుముందే అసలే లేవవద్దు. ఇది నిద్రాశైలిని దెబ్బతీయడమే కాదు. ఆరోగ్యాన్నీ క్షీణింపచేస్తుంది. గాఢనిద్ర లేకపోతే అలసట మరింత పెరుగుతుంది.
- జంక్ ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్ తీసుకోవద్దు. ఎక్కువ కేలరీలు ఉన్న కొవ్వు పదార్థాలను దగ్గరకి రానివ్వవద్దు. ఇది అనారోగ్యాన్ని పెంచడమే కాదు బరువు పెరిగేందుకూ కారణమవుతుంది. దీనివల్ల మీ నీరసం ఏమీ తగ్గకపోగా దీర్ఘకాల వ్యాధులు వచ్చేందుకు కారణమవుతుంది. రుచికరమైన, ఆరోగ్యకరమైన, కూరగాయలు, చికెన్, బ్రౌన్‌రైస్ లాంటివితీసుకోండి.
- ఎక్కువ సమయం సోషల్‌మీడియాలో ఉండవద్దు. ఇది మనస్సును చిరాకుపరచడమే కాదు ఫోన్ నుంచి వచ్చే రేడియేషన్ శారీరక శక్తినీ దెబ్బతీస్తుంది. అలసటగా ఉన్నప్పుడు సోషల్ మీడియాకు దూరంగా ఉండి చూడండి. మీలో వచ్చే మంచి మార్పు ఏమిటో మీకే అర్థమవుతుంది. సోషల్‌మీడియాలో ఎక్కువసమయం ఉండడం వల్ల మెదడు మీద ప్రభావం పడుతుంది. ఇది నిద్రకు దూరం చేస్తుంది.
- ఆల్కహాల్ జోలికి వెళ్ళవద్దు. మత్తు పదార్థాలు గాఢ నిద్ర రాకుండా చేస్తాయి. వారాంతాల్లో ఆలస్యంగా నిద్రపోవడం లాంటివీ చేయవద్దు. ఆకలిగా ఉందని అర్థరాత్రి వేళ స్నాక్స్ తీసుకోవద్దు. ఇవి అరగకపోవడం వల్ల కొత్త సమస్యలు వచ్చిపడతాయి. జీర్ణశక్తి దెబ్బతిని అలసట, నీరసం మరింత ఎక్కువవుతాయి.

మీ ఫేషియల్‌ని మీరే తయారుచేసుకోండి



తెల్లటి చర్మం కోరుకోని వారుండరు కదా! ప్రత్యేకించి అమ్మాయిలకి తెల్లని చర్మం అంటే మరింత ఇష్టం. ఇప్పుడు అబ్బాయిలు కూడా తెల్లగా ఉండాలని ఆశపడుతున్నారు. తెల్లగా, అందంగా, నిగారించే చర్మం కావాలని అందరూ అనుకుంటున్నారు. కానీ ప్రస్తుత జీవన విధానంలో ఇది అసాధ్యం. ముఖంపై మొటిమలు, చర్మం నల్లబడటం, నిగారింపు లేకపోవడం, కళ్ళ కింద నలుపులాంటి సమస్యలు లేనివాళ్ళు చాలాతక్కువ. వీటిబారినుంచి బయటపడేందుకు బ్యూటీపార్లర్లు, స్పాలను ఆశ్రయించేవాళ్ళే ఎక్కువ. అక్కడ చేసే ఫేషియల్‌ని మీరు ఇంటిదగ్గరే తయారు చేసుకోవచ్చు. బయట రసాయనాలు కలిపిన ఫేషియల్స్ కన్నా మన వంటింట్లో ఉండే పదార్థాలతో సహజంగా తయారుచేసుకోండి. దీనివల్ల ఖర్చూ తగ్గుతుంది, మీ అందమూ పెరుగుతుంది. ఫేషియల్స్ మనకు మనమే చేసుకోగలమనే ఆత్మవిశ్వాసమూ వస్తుంది. మరి దీన్ని ఎలా తయారుచేయాలో తెలుసుకుందామా! ఏ ఫేషియల్‌కైనా నాలుగు విషయాలు తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి.

అవి 1. శుభ్రపరచడం 2. రుద్దడం 3 మర్దనా 4 పూత

శుభ్రపరచడం

బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌కి మెదటగా ముఖాన్ని శుభ్రపరచాలి. దీని కోసం మూడు, నాలుగు టేబుల్ స్పూన్‌ల పాలు తీసుకోండి. ఈ పాలలో కొంచెం ఉప్పు వేయండి. దూది ఉండల్ని చేసుకొని ఈ మిశ్రమంలో కొద్దిసేపు నానబెట్టండి. ఈ దూది ఉండలతో ముఖం మీద మలినాలను తొలగించండి. ఈ మిశ్రమాన్ని మొటిమలు, గాయాలు వున్నచోట మాత్రం రాయకండి. అలా చేస్తే దీనిలోని ఉప్పు వల్ల అక్కడ మంటలు వస్తాయి.

రుద్దడం

దీనికోసం 2 టేబుల్ స్పూన్‌ల పంచదార, 2 టేబుల్ స్పూన్‌ల తేనె, కొద్దిగా నిమ్మరసాన్ని తీసుకోండి. వీటిని బాగా కలపండి. ఈ మిశ్రమాన్ని మీ వేళ్ళతో ముఖంపై రాయండి. బ్లాక్‌హెడ్స్, వైట్‌హెడ్స్ వున్నచోట రెండు, మూడు నిముషాలు బాగా రుద్దండి. తర్వాత 5 నిముషాలు అలా వుంచి చల్లని నీటితో కడిగేయండి. ఇలా చేయడం వల్ల చర్మంలోని మృత కణాలన్నీ తొలగిపోతాయి.

మర్దనా

మర్దనా చేయడం కోసం అరటి పండు, బొప్పాయి గుజ్జులు, తేనె, నిమ్మ రసాన్ని తీసుకోండి. వీటితో సహజ సిద్ధమైన మసాజ్ క్రీమ్‌ని తయారు చేసుకోండి. అరటి, బొప్పాయి గుజ్జులో రెండు టేబుల్ స్పూన్‌ల తేనె, మూడు టేబుల్ స్పూన్‌ల నిమ్మ రసాన్ని వేసి కలిపితే క్రీమ్ తయారైనట్లే. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి వేళ్ళతో కుడి నుంచి ఎడమకు, ఎడమ నుంచి కుడికి తిప్పుతూ మసాజ్ చేయండి. మొత్తం ముఖం అంతా నుదురు, ముక్కు, బుగ్గలు, గడ్డం నుంచి మెడ వరకూ బాగా మసాజ్ చేయండి. మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ బావుంటుంది. ఇలా చేయడం వల్ల ముఖంపై నల్లటి మచ్చలు తొలగుతాయి.

మాస్క్

పూతను తయారు చేయడానికి చందనం, రోజ్ వాటర్ లేదా పాలు తీసుకోండి. రెండు టేబుల్ స్పూన్‌ల చందనంలో జిడ్డు చర్మం వారైతే కొంచెం పాలు, మామూలు చర్మం వారైతే కొద్దిగా రోజ్ వాటర్‌ని కలపండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించండి. ఆరిన తర్వాత ముఖాన్ని చల్లని నీటితో కడిగేయండి. ఇలా చేస్తే మీ ముఖం మరింత కాంతివంతంగా వుంటుంది. ఇదీ ఫేషియల్ తయారు చేసే పద్ధతి. దీనిని ఇకపై ఇంట్లోనే చేసుకోండి. మీ ముఖవర్చస్సును మరింత పెంచుకోండి.



జరిగిన కథ

రైలు కదులుతూండగా - "అమ్మా...అమ్మా..! నీ ఆజ్ఞ నేను మీరలేదు. మాలతిని కనిపెట్టుకునే వున్నాను" అనుకున్నాను మనస్సులో . మాలతి నిపుణులైన వైద్యుల చేతుల్లో వుంది. వాళ్ళు చేతనైన చికిత్స చేస్తున్నారు. అంతటితో వదిలిపెట్టేదాం అనుకున్నాను... రెండు గంటలకి మేట్రను వచ్చి "మీ స్నేహితురాలు పెద్దగండం తప్పి బైటపడింది. ఇప్పుడే పురుడు వచ్చింది - మొగ పిల్లడు. ఎనిమిదిపౌన్ల బరువు. ఆమెకి రెండు మూడు గంటల్లో తెలివి రావచ్చులెండి" అంది. ఆమెకి ధన్య వాదాలు చెప్పి-అమ్మని తల్చుకుని ఆ బెంచిమీదే నిద్ర పోయాను....మెలుకువ వొచ్చింది. తెల్లవారుతూంది. ఆస్పత్రి గడియారం ఐదు గంటలకొట్టింది. పరిసరాలన్నీ కొత్తగా ఉన్నాయి. ఎక్కడున్నానో జ్ఞాపకం తెచ్చుకోవలసి వచ్చింది.

(నిన్నటి సంచిక తరువాయి)

నేను లేవడం చూచి రాత్రి నర్సు "బాలింతరాలు, పిల్లడూ చక్కగా నిద్రపోతున్నారు. మీరు మధ్యాహ్నంవస్తే - తల్లీ పిల్లడినీ చూద్దురుగాని" అంది నవ్వుతూ.

బీచంట నడిచి సముద్రపుగాలి ముఖానికి తగిలేసరికి బడలిపోయిన చురుకుతనం ఉత్సాహం వొచ్చింది. తమతో ఆడుకోమని ఆ కెరటాలు ఆహ్వానిస్తున్నాయి. కాని గోపికలు కృష్ణుడు జ్ఞాపకం వచ్చి సముద్రుణ్ణి ముట్టుకోలేదు. జాలరులు ఎప్పటిలాగు చేపల వేటకి బయలుదేరుతున్నారు. రోడ్డుమీద అక్కడక్కడ మనుష్యుల అలికిడి, వీధుల్లో కొన్నికొన్నిచోట్ల దీపాలు - నాలుగైదిళ్ళముందర ముగ్గులు. ఒకరిద్దరు గంపల వాళ్ళు 'జపానువాడు మరింత వేగం రాడు' అని. కొంతమందికైనా ధైర్యం తోచిందన్నమాట. అంచేత మదనంకూడా వచ్చేస్తాడు. ఇల్లు తీసుతారుగా వుందని శివ్వమ్మగారు చీదరించుకుని నన్ను దెప్పుతుందేమో? ఇల్లు చేరుకోగానే - దాసీమనిషి రాకపోతే - అంట్లగిన్నెలు తోమేసి - ఇల్లు వూడ్చి - పొయ్యి అలికేస్తాను. ఎలాగేనా తంటాలుపడి చింతపండుగాని డాబామీదనుంచి దింపి - కొట్టుగదిలో జేరెయ్యాలి. ఆమె ధ్యానం అంతా ఆ చింతపండు మీదే వుంటుంది. అందులో సహం ధ్యానం మాలతిమీద వుంటే బాగుండిపోను! నిప్పుచేసి - బొగ్గుల కుంపటి మీద అత్తెసరు పడేస్తాను. రాత్రికి ఆ అన్నమే మూత పెట్టుకుంటే సరిపోతుంది. అమ్మకి టెలిఫోనుచేసి సొమ్ము తెప్పించుకుని - మాలతిని చూసి - రేపు మెయిలులో చెన్నపట్నం వెళ్ళిపోతాను.

....నాన్న మాత్రం ఏమంటారో! మదనంతో....నేను....?

6 అతడు

జపాను ప్లేన్లు మొన్న విశాఖపట్నంపై బాంబులు వేశాయని వార్తలు - అసలు కబుర్లే తెలియడంలేదు. అన్నిరకాల గాలి కబుర్లూ చెలరేగుతున్నాయి. కాకినాడ రేవు - విశాఖపట్నం హార్బరు పూర్తిగా పరశురామ ప్రీతి అయిపోయాయట. రెండు బస్తీలు సగం తగలెట్టి - మిగతాసగం మరఫిరంగులతో ధ్వంసం చేశాడుట. వూళ్ళు వదిలేసి జనం పారిపోయారట. సుభకి యేం ప్రమాదం జరిగిందో ఏమిటో - నాకేం తోచటంలేదు. రాజమహేంద్రవరం నుంచి కంట్రోలు ఫోను పలకలేదు. దాంతో - చెన్నపట్నంనుంచి కూడా జనం భయపడి - పట్నం వదిలి పారిపోతున్నారు. "జపానువాడు పట్నంమీదికి నేడో రేపో వస్తే రావచ్చును - మనదేశాన్ని కాపాడుకొనే బాధ్యత మన మీదుంది" అని రాజాజీ అంటున్నాడు. 'జపానువాడు వస్తే వాడితో మనం సత్యాగ్రహం చెయ్యాలిగాని భూదహనం చెయ్యకూడదు - చేస్తే పాపం వస్తుంది' అంటున్నారు గాంధీగారు. 'జపానువాడు వచ్చాడంటే - వాడిని మనం కత్తి కఠార్లతో చేతనైనంతవరకూ ఎదిరించి యుద్ధం చెయ్యాలి' అంటున్నాడు నెహ్రూ. "జపానువాడు రాడు. వచ్చినా వాడు మనవాడు" అంటున్నారు కాంగ్రెస్ వాళ్ళు - సోషలిస్టులున్ను. 'జపానువాడు వచ్చి తీరుతాడు. వాడితో నేనూ వస్తున్నాను. స్వరాజ్యం నాతో కూడా తీసుకువస్తున్నాను. వాడికి బ్రహ్మ రథంపట్టి, పూలదండవేసి పూర్ణకుంభం యిచ్చి, నా కూడా ఢిల్లీచలో!" అంటున్నారు సింగపూరునుంచి సుభాష్. ఇవన్నీ విని తోకఝాడించి పారిపోతున్నాడు ఇంగ్లీషువాడు. నలుగురూ



నాలుగుమాటలు చెప్పగానే - గొర్రెల మందలా - ప్రజలు భయభ్రాంతులై - చెల్లాచెదరై పోతున్నారు. నాలాంటి వాడికే మతిపోతూంటే - సామాన్యుల మాటేమిటి?..... నేనెక్కడికి పోగలను?... ముందు సుభ క్షేమసమాచారం తెలుసుకోవాలి. శాంతంగారికి టెలిఫోను చేసి కనుక్కోందునా? కూతురి క్షేమం తల్లికి తెలియకుండా వుంటుందా? నాకంటే వెయ్యిరెట్లు ఆదుర్దా పడుతుంటుందామె. నేను టెలిఫోనులో అడుగుతే ఆమె ఏమను కుంటుందో? ముక్కూ ముఖం తెలియని పరాయివాడు కూతురుగురించి అడిగితే ఆమె యేమి అపోహ పడుతుందో? వూరికే నీలాపనిందకీ కారణం అవుతుందేమో? మా యిద్దరిపేర్లు



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

నలుగురు నోట్లోపడితే సుభ యెంత బాధపడుతుందో?...శాస్త్రిగారికే టెలిఫోన్ చేసి చూద్దునా?

లౌక్యుడు-జాగ్రత్త అయినవాడు. అమ్మో! ఆయన కాంగ్రెసు వాడు. చిన్న ఉద్యోగస్థులతో మాటాడితే తనకి కళంకం వస్తుందనుకుంటాడేమో? ఏమి చెయ్యను?...

...కంట్రోలు ఫోను ఇప్పుడే వచ్చింది. ప్రజలు పుకార్లు పుట్టించినంత ప్రమాదం జరగలేదట. విశాఖపట్నం నుంచి మాత్రం జనం విధివిరామం లేకుండా పారిపోతున్నారుట - మళ్ళీ జపాను ప్లేన్లు వచ్చి దాడిచేస్తాయని. రాజమహేంద్రవరం నుంచి మొదటిసారిగా ఈవేళ రైలు విశాఖపట్నం చేరిందట... సెలవుపెట్టి విశాఖపట్నం వెళుదునా? అయ్యో! అందుకు సుతరామూ వీలులేదే. సెలవులన్నీ రద్దుచేశాం - ఎవరి స్థానాల్లో వాళ్ళుండాలని - ఉత్తర్వులు జారీచేశారు. ఏదేనా పని కల్పించుకొని వాల్తేరు వెళ్ళి తీరాలి! అదొక్కటే మార్గం. అనాకపల్లి వంతెన తనిఖీ అని పేరు చెప్పి - ప్రత్యేక సెలూన్‌లో దడబడాలుగా వెళితే - మనసు అడిగేవాడుండడు. అబ్బే! నా సొంత పనికోసం అబద్ధాలు చెప్పి - మీదుమిక్కిలి రానూపోనూ ఖర్చులూ, భత్యాలూ అపహరించడమా? అమ్మ యీ విధంగానే - కాసులు కూడబెట్టి నాకు చదువు చెప్పించిందా? నా నిజాయితీ ఎక్కడికీ పోయింది? నా బుద్ధి బూర్లు తింటూందే!

మదనగోపాలరావుకి టెలిఫోను చేసి చూస్తాను. అతను సబ్ కలక్టరు - నేను రైల్వే ఇంజనీరుని. ఇద్దరం మిలిటరీ హోదాలో వున్నాం. విశాఖపట్నం పోర్టు స్టేషన్ సరిగ్గా పని చేస్తుందా? అని అధికారరీత్యా అడిగి - ప్రసంగవశాత్తు మీ ఇంట్లో అందరూ క్షేమమే కదా - అని అడుగుతా. దాంతో సుభ యోగ క్షేమం తప్పకుండా తెలుస్తుంది...ఫోను చేస్తే అక్కడి ఫోను పలకలేదన్నారు. పలకకపోవడమేమిటి. అతను ఎక్కడికి వెళతాడు? గాయాలు దెబ్బలు తిన్నవాళ్ళ సహాయార్థం - వూరినుండి పారిపోతున్నవాళ్ళకి ధైర్యం చెప్పడానికి - వూళ్ళోకి వెళ్ళివుంటే - ఇంటిల్లిపాదీ ఏం అయ్యారు? బంట్రోతుల ఎక్కడికి పోయారు? సుభ యేమైంది? కచేరికి వెళ్ళేముందు మళ్ళీ వొకసారి టెలిఫోను చేసి చూస్తాను.....

టెలిఫోనులో సుభే మాట్లాడింది! ఆమె గొంతుక తీగెమీనుంచి రాకుండానే- ఆమె మాట్లాడబోతుందని నాకు తెలిసిపోయింది! ఇంట్లో ఆమె ఒక్కర్తే వుందిట. జపాన్ దాడి విశేషాలన్నీ చెప్పింది. ప్రమాదం యేమీ జరగలేదు కాని - పవరుహౌసులో మాత్రం నలుగురు చచ్చిపోయారేమో అని అనుకుంటున్నారుట. జనం మాత్రం భయభ్రాంతులై వారు వదిలేసి పారిపోతున్నారట. ఇదిగో పులి అంటే అదిగో పుట్ర - అని పుకార్లు అంతూపంతూ లేదుట. ఏ నిమిషానికానిమిషమే జపానువాడి ప్లేన్లమీద నుంచి సరాసరి ఏరాడకొండమీద దిగి గాలిగుమ్మటపు సైన్యాలు విడిశాయనీ - సబ్ మెరైన్లమీద ఎవ్వరికీ తెలీకుండా అప్పుడు హార్బరులో ప్రవేశించి నీటి అడుగున దాంకుని - సమయానికి పొంచివున్నాడనీ ఏ రాత్రైనా హార్బరులో స్టీమరులన్నిటినీ ముంచేసి-ప్లేన్లమీదనుంచి దాడిచేసి -విశాఖపట్నం, విజయనగరం, భీమునిపట్నం ఆక్రమించు కుంటాడనీ అంటున్నారు ప్రజ. కాంగ్రెసు జండాలు యెగుర వేసిన యిళ్ళమీద బాంబులు వేయమని - కాంగ్రెసు జండాలు లేని ఇళ్ళని తగులబెడతామని - కబుర్లు పంపించు తున్నారనీ - వూళ్ళోవాళ్ళనుకుంటూ-జండా ప్రతిష్ఠాపనలు చేసుకుంటున్నా రుట! ఎవరో ఇద్దరు ముగ్గురు కమ్యూనిస్టుల ఇళ్ళమీదతప్ప వూరంతా కాంగ్రెసు జెండాల తోరణాలతో అలంకరిస్తున్నారట. ఊరువదిలేసి వెళ్ళిపోవడమే దేశభక్తి చిహ్నం అనీ, బ్రిటీషు వాడితో అసలైన సహాయ నిరాకరణము అదే అనీ - వూరిలో ఇంకా మొండిగా వుండిపోయిన వారిని లేచిపొమ్మని కొందరు పెద్దలు ప్రోత్సహిస్తున్నారని చెప్పుకుంటున్నారట! జపానువాడు వేసిన బాంబులన్నీ హార్బరులో మందుగుండు సామాగ్రితెచ్చిన అమెరికను స్టీమరు మీదే వెయ్యడానికి ప్రయత్నించడం - వూరిలో ఒక్క బాంబుకూడా వెయ్యకపోవడం - ఇన్నాళ్ళయినా ప్రజ ప్రవాహంగా పారిపోతుంటే మళ్ళీమళ్ళీ వచ్చినా ప్రజమీద ఒక్కబాంబేనా వెయ్యకపోవడం ఇదంతా జపానువాడికి మనమీద వుండే ప్రేమగౌరవాలకి తార్కాణం అని - అందుకు సుభాషే కారణం అనీ - పారిపోతున్న ప్రజకూడా జపానువాడిని వేనోళ్ళ పొగడుతూనే పారిపోతున్నారుట! అనుకోకుండా మదనగోపాల రావూ తల్లిదండ్రులతోసహా జబ్బుగా వున్న బంధువుని చూడడా నికి బొబ్బిలి వెళ్ళవలసి ఆ రోజు పది గంటలకే వెళ్ళాడుట. ఆమె స్నేహితురాలికి పురుడు వచ్చిందిట. అందుచేత తరచు ఆస్పత్రికి వెళ్ళుతూండిట. రెండు రోజుల్లో చెన్నపట్నం వచ్చేస్తున్నానంది. వచ్చేముందు నాకు టెలిఫోను చేస్తానంది, రైలుకి రమ్మనమంది.

...టెలిఫోనులో సుభ నవ్వులు విన్న క్షణం నుంచీ అన్ని చికాకులూ మాయం అయిపోయాయి. జపానువాడి దండ యాత్ర, హిట్లరు దిగ్విజయం, దేశంలో అయోమయపు పరిస్థి తులు, ఇక్కడ ప్రజ యిళ్ళూ వాకిళ్ళూ వదిలేసి పారి పోవడం, బర్మానుంచి బతుకుజీవుడా అని తమ సర్వస్వం వదలుకుని పారి పోయివచ్చిన కాందిశీకులు. కరువుకాలంలో చిన్నజీతగాళ్ళు మంగలంలో పేలాల్లాగు మాడిపోవడం, పెద్ద అధికార్ల లంచ గొండి తనం, నీతి జాతి పోయి డబ్బే ప్రధానం అవడం, నేను కూము మీద బకింగుహేము కెనాలు మీద కట్టబోయే వంతెనలు, అందుకు ఇనుము వంతెనలు' - మొన్న పెద్ద దొర నాకు చెప్పిన పాఠం, అన్నీ మర్చిపోయాను...ఇవన్నీ కల్ల, ఆమె నవ్వే వాస్తవం!

– ఇంకా వుంది.

కేంద్ర బడ్జెట్‌లో ఆపరేషన్ గ్రీన్స్‌కు ఎన్ని కోట్లు కేటాయించారు ?

విశాలాంధ్ర ప్రజ్ఞ



1. 2018-19 సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ఎవరు ప్రవేశపెట్టారు ?
   1. రాజ్‌నాథ్ సింగ్ 2. అరుణ్ జైట్లీ
   3. నరేంద్రమోడీ 4. యశ్వంత్ సిన్హా
2. 2018-19 బడ్జెట్ అంచనాలలో రెవెన్యూ వసూళ్లు ఎంత ? (రూ. కోట్లలో)
   1.13,74,203 2. 15,15,771
   3. 17,25,738 4. 16,35,641
3. 2018-19 బడ్జెట్‌లో రెవిన్యూ లోటును ఎంతగా అంచనా వేశారు ?
   1. రూ.4,16,034 కోట్లు
   2. రూ.3,21,163 కోట్లు
   3. రూ.4,38,877 కోట్లు
   4. రూ.3,21,163 కోట్లు
4. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో దేశం ఎంత శాతం అభివృద్ధిని సాధించనున్నది ?
   1. 7.5% 2. 8 %
   3. 9 % 4. 7 %
5. ప్రస్తుత బడ్జెట్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన 'జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం' ఎన్ని కోట్ల మంది పేద ప్రజలకు లబ్ధి చేకూర్చనుంది ?
   1. 30 కోట్లు 2. 50 కోట్లు
   3.. 40 కోట్లు 4. 15 కోట్లు
6. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 6.5 శాతం నుండి ఎంతశాతానికి పెరుగుతుందని అంచనా వేసినట్లు తెలిపారు ?
   1. 6.75 శాతం 2. 7 శాతం 3.
   7.5 శాతం 8. 6.2 శాతం
7. 2018-19లో డిజిటల్ భారత్‌కు కేటాయింపులు (రూ.కోట్లలో) ఎంత?
   1. 80,000 2. 3073
   3. 18000 4. 7513
8. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విద్యాసెస్సు ఎంత ?
   1. 5 % 2. 4 %
   3. 2 % 4. 0.5 %
9. రక్షణ రంగానికి బడ్జెట్‌లో ఎన్నికోట్లు కేటాయించారు ?
   1. రూ.1.73 లక్షల కోట్లు
   2. రూ.3.25 లక్షల కోట్లు
   3. రూ.2.82 లక్షల కోట్లు
   4. రూ. 4.15 లక్షల కోట్లు
10. ఈ క్రిందివాటిని జతపరుచుము
   1. ప్రాథమిక లోటు ఎ. 48,481
   2. కోశ లోటు బి. 6,24,276
   3. మొత్తం వ్యయం సి. 24,42,213
   4. మూలధన వసూళ్లు
   డి. 7,16,475
   1. 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   2. 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
   3. 1-బి, 2-ఎ, 3- డి, 4-ఎ
   4. 1-సి, 2-ఎ, 3-డి, 4-బి
11. పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం ఎంతగా అంచనా వేశారు ? (రూ.కోట్లలో)
   1. రూ.35,000 కోట్లు
   2. రూ.80,000 కోట్లు
   3. రూ.50,000 కోట్లు
   4. రూ.40,000 కోట్లు
12. మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ సుంకం ఎంతశాతం విధించారు ?
   1. 20% 2. 15 %
   3. 18% 4. 12 %
13. అన్నిరంగాల్లో కొత్త ఉద్యోగుల తరపున ఉద్యోగుల భవిష్య నిధికి వేతనంలో ఎంతశాతం మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించనుంది ?
   1. 12% 2. 15%
   3. 18 % 4. 17%స
14. 2018-19 బడ్జెట్‌లో రైల్వేశాఖకు మూలధన వ్యయంగా ఎన్నికోట్లు కేటాయించారు ?
   1. రూ.25,500 కోట్లు
   2. రూ.1,46,500 కోట్లు
   3. రూ.27,000 కోట్లు
   4. రూ.66,030 కోట్లు
15. గత ఏడాది రైల్వేబడ్జెట్‌లో సవరించిన అంచనాల కంటే ఇది ఎంత శాతం ఎక్కువ ?
   1. 15 శాతం 2. 13 శాతం
   3. 22 శాతం 4. 25 శాతం
16. ఈ సంవత్సర కేటాయింపులో సింహభాగాన్ని రైల్వేలో ఏ కార్యక్రమాలకు వెచ్చించనున్నారు ?
   1. భద్రత 2. మౌలిక వసతులు
   3. సామర్థ్య పెంపు 4. కొత్త లైన్ల నిర్మాణం
17. భారతీయ రైల్వేస్టేషన్ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన ఎన్ని ప్రధాన స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తారు ?
   1. 500 2. 600
   3. 750 4. 120
18. వ్యవసాయ రుణాల లక్ష్యం వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఎన్ని లక్షల కోట్లకు పెంచారు ?
   1. రూ.13 లక్షల కోట్లు
   2. రూ.11 లక్షల కోట్లు
   3. రూ.15 లక్షల కోట్లు
   4. రూ.10 లక్షల కోట్లు
19. త్వరగా పాడైపోయే బంగాళాదుంప (ఆలూ), టమాటా, ఉల్లి వంటి పంటల ధరల్లో ఏర్పడే అనూహ్య హెచ్చుతగ్గుల సమస్య పరిష్కారానికి ఏ పేరుతో కార్యక్రమాలు చేస్తారు ?
   1. ఆపరేషన్ గ్రీన్స్
   2. ఆపరేషన్ సీడ్స్
   3. ఆపరేషన్ సెన్సిటీస్
   4. ఆపరేషన్ వెజ్
20. కౌలు రైతులకు రుణ సౌకర్యం లభించేందుకు వీలుగా తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనున్న సంస్థ ఏది ?
   1. నాబార్డ్
   2. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ
   3. నీతి ఆయోగ్
   4. గృహమంత్రిత్వశాఖ
21. ఔషధ, సుగంధ మొక్కల వ్యవస్థీకృత సాగుకు సంబంధిత పరిశ్రమలకు ఎన్ని కోట్లు కేటాయించారు ?
   1. రూ.150 కోట్లు
   2. రూ.200 కోట్లు
   3. రూ.300 కోట్లు
   4. రూ.250 కోట్లు
22. వినియోగదారులకు రైతులు నేరుగా విక్రయించుకోవడానికి, టోకు కొనుగోళ్లకు వీలుగా ఎన్ని వేల గ్రామీణ సంతలను గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు (గ్రామ్స్)గా అభివృద్ధి చేయనున్నారు ?
   1. 17 వేలు 2. 15 వేలు
   3. 22 వేలు 4. 31 వేలు
23. ఆపరేషన్ గ్రీన్స్‌కు ఎన్నికోట్లు కేటాయించారు ?
   1. రూ.500 కోట్లు 2. రూ.350 కోట్లు
   3. రూ.400 కోట్లు 4. రూ.180 కోట్లు
24. మత్స్య పశుపాలన రైతుల పెట్టుబడి అవసరాలు తీర్చడానికి కిసాన్ క్రెడిట్ కార్డు సౌకర్యం, వీరికి వడ్డీ రాయితీ ప్రయోజనంతోపాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎన్నివేల కోట్ల రూపాయలు కేటాయించారు ?
   1. రూ.9 వేల కోట్లు
   2. రూ.10 వేల కోట్లు
   3. రూ.500 వేల కోట్లు
   4. రూ.12 వేల కోట్లు
25. 'ఆకుపచ్చ బంగారం' అని దేనిని అంటారు ?
   1. తోట పంటలు 2. వెదురు
   3. కాయగూర పంటలు
   4. గడ్డి
26. వెదురు పరిశ్రమను ప్రోత్సహించడానికి ఎంత మొత్తం కేటాయించారు ?
   1. రూ.1,290 కోట్లు
   2. రూ.1500 కోట్లు
   3. రూ.1425 కోట్లు
   4. రూ.2000 కోట్లు
27. ఏ సంవత్సరం నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది ?
   1. 2020 2. 2022
   3. 2030 4. 2019
28. పంటల బీమా పథకాల అమలుకు కేంద్ర బడ్జెట్‌లో 2018-19 కి నిధుల కేటాయింపులు ఎంతగా ఉన్నాయి ?
   1. రూ.10 వేల కోట్లు
   2. రూ.13 వేల కోట్లు
   3. రూ. 15 వేల కోట్లు
   4. రూ. 20 వేల కోట్లు
29. సాగునీటిని పొదుపుగా వాడుతూ పంటల ఉత్పాదకత పెంచేందుకు ఎన్ని వేల కోట్లను కేంద్రం ప్రకటించింది ?
   1. రూ.4 వేల కోట్లు
   2. రూ.8 వేల కోట్లు
   3. రూ. 9 వేల కోట్లు
   4. రూ. 6 వేల కోట్లు
30. దేశవ్యాప్తంగా ఎన్ని లక్షల ఎకరాల్లో బిందు సేద్యం పరికరాల ఏర్పాటుకు నిధులు వెచ్చిస్తారు ?
   1. 10 లక్షల ఎకరాల్లో
   2. 40 లక్షల ఎకరాల్లో
   3. 35 లక్షల ఎకరాల్లో
   4. 13 లక్షల ఎకరాల్లో
31. 2018-19లో ఎంతశాతం విస్తీర్ణం పంటలకు రైతులు ప్రీమియం చెల్లించేలా చూసి బీమా పరిధిలోకి తేవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది ?
   1. 35 శాతం 2. 50 శాతం
   3. 33 శాతం 4. 25 శాతం
32. మద్దతుధర ప్రకటించేటప్పుడు పంటలను ఎన్ని విభాగాలుగా వర్గీకరిస్తారు ?
   1. 5 2. 7
   3. 10 4. 12
33. పంటలను ప్రభుత్వానికి అమ్ముతున్న రైతులు ఎంతశాతం ?
   1. 7.2 % 2. 3.4 %
   3. 5.8 % 4. 5.2 %
34. జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం క్రింద ఎవరిని సేంద్రీయ సాగు చేసేలా ప్రోత్సాహం కల్పిస్తాయి ?
   1. ఉపాంత రైతులు
   2. చిన్న కమతందార్లను
   3. మహిళా స్వయం సహాయక సంఘాలు
   4. పెద్ద రైతులు
35. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎన్ని లక్షల కోట్లను గ్రామీణ ప్రాంతాలపై వెచ్చించనున్నది ?
   1. రూ.14.34 లక్షల కోట్లు
   2. రూ.5.41 లక్షల కోట్లు
   3. రూ.12.96 లక్షల కోట్లు
   4. రూ.9.78 లక్షల కోట్లు
36. ప్రతి జిల్లాలోనూ ఆదర్శ నైపుణ్య కేంద్రాల ఏర్పాటు ఏ కార్యక్రమం కింద చేపడతారు ?
   1. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన
   2. జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం
   3. ప్రధానమంత్రి కౌశల్ కేంద్ర
   4. ఆయుష్మాన్ భారత్
37. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలు వచ్చే ఏడాది మార్చి నాటికి ఎన్ని కోట్లకు చేరుకుంటాయని తెలిపింది ?
   1. రూ.75,000 కోట్లు
   2. రూ.50,000 కోట్లు
   3. రూ.63,000 కోట్లు
   4. రూ. 43,000 కోట్లు
38. భారతదేశంలో గ్రామాల్లో అప్పుల ఊబిలో కూరుకుపోయిన కుటుంబాలు ఎంతశాతం ఉన్నాయి ?
   1. 31.4 % 2. 24.8%
   3. 20.3 % 4. 12 %
39. అప్పులకు గల కారణాలు ప్రధానంగా ఏవి ?
   1. పంట పెట్టుబడులు, వ్యవసాయం నష్టదా యకంగా ఉండటం
   2. సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలకు వెచ్చించడం
   3. అనారోగ్యాలు మరియు పిల్లల చదువు
   4. పైవన్నీ
40. పట్టణాల్లో రుణగ్రస్తమవుతున్న కుటుంబాల శాతం ఎంత ?
   1. 30.2 % 2. 22.4%
   3. 15.3 % 4. 18.3 %
41. గ్రామీణ భారతంలో రుణాలకు సంబంధించి క్రిందివాటిలో తప్పుగా ఉన్నది ఏది ?
   1. సంస్థాగత రుణాలు - 56 %
   2. సహకారం వాటా - 24.8 %
   3. దీర్ఘకాలిక రుణాలు తీసుకుంటున్నది - 10 %
   4. సంస్థాగతేతర రుణాలు - 64 %
42. గ్రామీణ ప్రాంతంలో కుటుంబంపై సగటు రుణభారం ఎంత ?
   1. రూ.1,03,457 2. రూ.3,78,238
   3. రూ. 2,15,416 4. రూ. 7,15,218
43. 'రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన' కింద పేద కుటుంబాలకు వార్షిక కవరేజీ ఎంతమేర మాత్రమే లభిస్తుంది?
   1. రూ.50 వేలు 2. రూ. 30 వేలు
   3. రూ. లక్ష 4. రూ. 5 లక్షలు
44. 2018-19 బడ్జెట్‌లో జాతీయ పౌష్టికాహార మిషన్‌కు సంబంధించిన కేటాయింపులు ఎన్ని రెట్లు పెరిగాయి ?
   1. మూడు రెట్లు 2. రెండు రెట్లు
   3. ఐదు రెట్లు 4. నాలుగు రెట్లు
45. మోడీ కేర్‌గా వ్యవహరిస్తున్న ఎన్‌హెచ్‌పీఎస్‌లో 2018-19కి తాత్కాలికంగా ఎంతమొత్తం కేటాయించారు ?
   1. రూ.3 వేల కోట్లు
   2. రూ.2 వేల కోట్లు
   3. రూ.5 వేల కోట్లు
   4. ఏదీ కాదు
46. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో కుటుంబానికి సగటు రుణ భారం ఎంత?
   1. రూ.3,78,238 2. రూ.2,67,516
   3. రూ.2,18,496 4. రూ. 3,25,472
47. ఈ క్రిందివాటిలో వాస్తవములు ఏవి ?
   1. పర్యావరణ మంత్రిత్వశాఖకు కేటాయింపులు - రూ.2,675.42 కోట్లు
   2. టైగర్ ప్రాజెక్టుకు - రూ.350 కోట్లు
   3. ప్రాజెక్టు ఎలిఫెంట్ - రూ.30 కోట్లు, అటవీశాఖకు - రూ.160 కోట్లు
   4. పైవన్నీ
48. అంతర్జాతీయ కార్మిక సంస్థ గణాంకాల సర్వే ప్రకారం 2017లో నిరుద్యోగుల సంఖ్య ఎంత ?
   1. 1.83 కోట్లు 2. 1.23 కోట్లు
   3. 2.01 కోట్లు 4. 2.15 కోట్లు
49. దేశంలో ఏటా 1.20 కోట్ల మంది శ్రామిక శక్తి జతపడుతుండగా ఉపాధి కల్పన మాత్రం ఎంతగా ఉంటుంది ?
   1. 30 లక్షలు 2. 55 లక్షలు
   3. 14 లక్షలు 4. 43 లక్షలు
50. ప్రస్తుతం దేశంలో శ్రామికశక్తి ఎంత అందు బాటులో ఉంది ?
   1. 55 శాతం 2. 43 శాతం
   3. 65 శాతం 4. 71 శాతం
51. క్రిందివాటిలో సరియైనవాటిని గుర్తించుము ?
   1. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ ప్రాంతాల్లో 51 లక్షల ఇళ్ల నిర్మాణం
   2. పట్టణ ప్రాంతాల్లో 37 లక్షల గృహ నిర్మాణం
   3. 1 మరియు 2
   4. ఏదీ కాదు
52. మోడీ సర్కార్ రెండేళ్లలో 'అందుబాటులోకి అందరికీ ఇళ్ళు' పథకాలకు కేటాయించిన మొత్తం ఎంత ?
   1. రూ.1,10,753 కోట్లు
   2. రూ.1,57,106 కోట్లు
   3. రూ.30.61 కోట్లు
   4. రూ.1,32,701 కోట్లు
53. ప్రస్తుత పన్నురేటు శ్లాబులు ఎన్ని ఉన్నాయి ?
   1. 3 2. 5 3. 7 4. 9
54. 1970-71లో పన్నురేటు దాదాపు ఎన్ని శ్లాబులు ఉండేది ?
   1. 7 2. 11
   3. 5 4. 9
55. ప్రస్తుత పన్నురేటు కనిష్ట మరియు గరిష్ఠం ఎంత ?
   1. 5% - 30% 2. 5% - 20%
   3. 15% - 45 %4. 12% - 35 %
56. 2018-19 బడ్జెట్ అంచనాలలో మొత్తం పన్ను వసూళ్ళు జీడీపీలో ఎంత శాతం ?
   1. 11.3% 2. 11.6 %
   3. 12.1 % 4. 15.3 %
57. 2018-19 బడ్జెట్ శాస్త్ర సాంకేతిక రంగానికి ఎంతశాతం కేటాయించింది ?
   1. 17% 2. 7 %
   3. 10 % 4. 12%
58. శాస్త్ర సాంకేతిక రంగంలోని ఉప విభాగాలలో దేనికి ఎక్కువ కేటాయింపులు జరిగాయి ?
   1. అణు ఇంధన 2. ఇస్రో
   3. డీఆర్‌డీవో 4. డీఎస్‌టీ
59. కేంద్ర పన్నుల్లో గత ఏడాదికంటే మిన్నగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు లభించే వాటా ఎంత ?
   1. 16% 2. 18%
   3. 14% 4. 15%
60. 2018-19 ఆర్థిక సంవత్సరానికి వర్తించే శ్లాబు పన్నులు ఏవి ?
   1. ఆదాయ పరిమితి రూ.2,50,000కు లేదు
   2. రూ.2,50,001-5,00,000 వరకు 5 %
   3. 25,00,000-1,00,00,000 వరకు 20 %
   4. పైవన్నీ
61. అటల్ పింఛన్ యోజన (ఏపీవై) పథక ప్రారంభం ఎప్పుడు?
   1. 2015 మే 9 2. 2014 జులై 14
   3. 2016 ఆగస్టు 15 4. 2015 మార్చి 4
62. ఏపీవై పథకానికి సంబంధించి క్రిందివాటిలో తప్పుగా ఉన్నది ఏది ?
   1. ఈ పథకంలో చేరని వారికి 60 ఏళ్లు వచ్చినప్పటి నుంచి ప్రారంభం అవుతుంది.
   2. ఉత్తరప్రదేశ్, బీహార్, తమిళనాడు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.
   3.2018 జనవరి నాటికి 80 లక్షల మందికి పైగా సభ్యులుగా చేరారు.
   4. కనిష్టం 1000, గరిష్ఠం 10,000 పొందుతారు.
63. ప్రధానమంత్రి ఎల్ఐసీ వయో వందన యోజన కింద సీనియర్ సిటిజన్లు రూ.7.5 లక్షలు మదుపు చేసే అవకాశం ఉండేది. దానిని ఇప్పుడు ఎంతకు పెంచారు ?
   1. రూ.10 లక్షలు 2. రూ.15 లక్షలు
   3. రూ.25 లక్షలు 4. రూ.12 లక్షలు
64. 2017ల దేశంలో కుబేరులు ఎంతమంది ఉన్నారు ?
   1. 9 2. 25
   3. 50 4. 101
65. దేశంలో ఎంతమంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు (టెంటూల్కర్ కమిటీ ప్రకారం) ?
   1. 36% 2. 21%
   3. 26% 4. 11%
66. దేశంలో అట్టడుగున ఉన్న 50 శాతం మందికి దేశ ఆదాయంలో వారి వాటా ఎంత ?
   1. 15% 2. 20%
   3. 18% 4. 25%
67. 60-80 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారందరికీ వ్యక్తిగత పన్ను ఎంత పరిమితి వరకు ఉండదు ?
   1. రూ. 2,50,000 2. రూ. 3,00,000
   3. రూ.3,50,000 4. రూ. 4,50,000
68. భారతదేశంలో 67 కోట్ల మంది సంపద మాత్రం ఏడాదిలో ఎంతశాతం పెరిగింది ?
   1. 2% 2. 1%
   3. 5% 4. 2.5%
69. జాతీయ మహిళా కమిషన్‌కు 2018-19 కి ఎన్ని కోట్లు కేటాయించారు ?
   1. 24 కోట్లు 2. 35 కోట్లు
   3. 18 కోట్లు 4. 56 కోట్లు
70. ప్రధానమంత్రి మాతృవందన యోజనకు 2018-19కి కేటాయించిన మొత్తం ఎంత ?
   1. రూ.2,400 కోట్లు
   2. రూ.2,800 కోట్లు
   3. రూ.3,500 కోట్లు
   4. రూ.1,400 కోట్లు

సమాధానాలు

1. 2	2. 3	3. 1	4. 1
5. 2	6. 1	7. 2	8. 2
9. 3	10. 1	11. 2	12. 1
13. 1	14.2	15. 3	16. 3
17. 2	18. 2	19. 1	20. 3
21. 2	22. 3	23. 1	24. 2
25. 2	26. 1	27. 2	28. 2
29. 1	30. 2	31. 2	32. 1
33. 3	34. 3	35. 1	36. 3
37. 1	38. 1	39. 4	40. 2
41. 4	42. 1	43. 2	44. 1
45. 2	46. 1	47. 4	48. 1
49. 2	50. 3	51. 3	52. 1
53. 1	54. 2	55. 1	56. 3
57. 1	58. 2	59. 1	60. 4
61. 1	62. 4	63. 2	64. 4
65. 3	66. 1	67. 2	68. 2
69. 1	70. 1		

(మిగతా రేపటి సంచికలో)

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-99.36 ▼	-28.30 ▼	◀◀	29,200	-100 ▼	41,600	
34,346.39	10,554.30	29,300	ప్రొద్దుటూరు 29,240	39,800	ప్రొద్దుటూరు 41,700	64.87
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
భారతీ ఎయిర్‌టెల్	431.05	2.07
రెడ్డీ ల్యాబ్స్	2,234.15	1.82
ఎన్‌టీపీసీ	165.50	1.53
హీరో మోటార్‌కార్ప్	3,600.00	1.34
రిలయన్స్	955.50	1.21

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
యాక్సిస్ బ్యాంక్	537.50	-2.68
ఎస్‌బీఐ	267.80	-2.53
ఐసీఐసీఐ బ్యాంక్	319.65	-2.25
బీహెచ్ఇఎల్	94.00	-2.20
సన్‌ఫార్మా	563.30	-2.02

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.79	64.87
యూరో	79.89	79.91
పౌండ్	90.89	90.45
ఆస్ట్రేలియా డాలర్	50.85	50.85
సింగపూర్ డాలర్	49.23	49.18

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,200	31,229
చెన్నై	29,200	31,229
బెంగళూరు	28,700	30,695
ముంబై	30,080	31,171
విజయవాడ	29,300	31,600
విశాఖపట్నం	29,200	31,854
ప్రొద్దుటూరు	29,240	30,700
ముడి చమురు		66.39



పెరిగిన బంగారం, తగ్గిన వెండి ధరలు

ముంబై: అంతర్జాతీయంగా బంగారం ధరలు 0.03శాతం పెరిగి 1333.30 డాలర్లు పలికింది. వరుసగా నాలుగవ రోజు బంగారం ధర రూ.190లు పెరిగి 10 గ్రాములు రూ.31,850 పలికింది. స్థానిక ఆభరణాల వర్తకులు, ట్రేడర్ల నుండి డిమాండ్ పెరగడం ప్రధానకారణంగా ఉంది. వెండి ధర మాత్రం రూ.150లు తగ్గి కేజీ వెండి ధర రూ.39,550లకు చేరింది. పరిశ్రమలు, నాణేల తయారీ దారుల నుండి డిమాండ్ తగ్గడం వెండి ధర తగ్గేందుకు కారణమైంది. బంగార ధర గత మూడుసెషన్లలో రూ.310లు లాభపడింది. సవరు బంగారం అంటే 8గ్రాములు రూ.24,800 పలికింది.

నష్టాల్లో రూపాయి




ముంబై: డాలర్ మారకంతో రూపాయి విలువ ఈక్విటీ మార్కెట్‌లో మంగళ వారం నష్టాల్లో నమోదైంది. సోమ వారం 64.80 వద్ద ముగిసిన రూపాయి 0.13శాతం విలువ కోల్పోయి 64.89 వద్ద నిలిచింది.

29.2 మిలియన్ టన్నులకు చేరనున్న

చక్కెర ఉత్పత్తి

ముంబై: దేశీయ చక్కెర ఉత్పత్తి రికార్డుస్థాయిలో 2017-18 సంవత్సరానికి 29.2 మిలియన్ టన్నులకు చేరుకోవచ్చునని అంచనా.. సెప్టెంబరు 30తో ముగిసిన కాలంతో మహారాష్ట్రలో ఉత్పత్తి అయిన 4.2 మిలియన్ టన్నులతో కలిసి భారత్ 20.3 మిలియన్‌టన్నుల చక్కెరనుఉత్పత్తిచేసింది. సుమారు 12శాతం పెరగవచ్చునని తాజా నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయ అమ్మకాలను ప్రోత్సహించేందుకు గాను ఎగుమతులపై సుంకం నిషేధించడంతో ప్రపంచంలో షుగర్ ఉత్పత్తిదారుల్లో ప్రపంచలోనే రెండవ అతిపెద్ద ఉత్పత్తి దారుగా నమోదైంది. అక్టోబరు 1 నుండి ప్రారంభమైన మార్కెటింగ్ సీజన్‌లో జనవరిలో ఇచ్చిన నివేదికాధారంగా 26.1 మిలియన్ టన్నులుగా నమోదైంది. దేశీయ షుగర్ ధరలు గత నాలుగునెలల్లో 11శాతానికి పడిపోయాయి. చక్కెర ఎగుమతులపై 20శాతం ఎగుమతి సుంకాన్ని రద్దు చేస్తున్నట్లు ఆహార సంక్షేమ మంత్రి ఈ నెల ప్రారంభంలోనే తెలియజేసారు. ఎగుమతి సుంకాన్ని రద్దుచేసినప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్‌లో స్థానిక ధరల కన్నా చక్కెర ధరలు తక్కువగా ఉండటంతో చక్కెర మిల్లులు ఎగుమతిచేసే పరిస్థితిలేదని సుగర్ మిల్స్ అసోసియేషన్ అభిప్రాయం. ప్రభుత్వం చక్కెర ఎగుమతులనుప్రోత్సహించకపోతే దేశీయ ధరలతో మాత్రం పంట గిట్టుబాటుకాదనేది డీలర్ల అభిప్రాయం.

మార్కెట్లూ శిక్షిస్తాయ్..!



ముంబై: చట్టంలో లొసుగులను ఉపయోగించుకొని బ్యాంకులను మోసం చేసేవారిని ప్రభుత్వం శిక్షించడం మాట ఎలా ఉన్నా మార్కెట్లు మాత్రం కఠినంగా శిక్షిస్తాయన్నది నిజం. వివిధ కుంభకోణాలతో సంబంధం ఉన్న దాదాపు డజను కంపెనీలు తమ అత్యధిక విలువతో పోల్చుకుంటే నేడు దాదాపు 90శాతం షేర్ విలువను కోల్పోయాయి. దీనికి కేతన్‌పరేఖ్ ట్రేడింగ్ చేసిన కె-10 కంపెనీలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఆయన కుంభకోణం బయటపడిన తర్వాత కె-10 కంపెనీలుగా పేరుపడిన సంస్థలు నేడు 99శాతం మార్కెట్ విలువను కోల్పోయాయి. అప్పట్లో కేతన్ ఈ కంపెనీల వాటాల విలువను పెంచి వీటి ఆధారంగా కొన్ని బ్యాంకుల నుంచి భారీగా అప్పులు చేసి ముంచేశాడు. దీంతో తర్వాత ఆ కంపెనీలు కోలుకోలేదు. 2009లో యూనిటెక్, డిబి రియాల్టీ సంస్థల పేర్లు 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణంలో ఇరుక్కున్నాయి. దీంతో 85శాతం మార్కెట్ విలువను కోల్పోయాయి. 2017లో ఈ కేసు తీర్పు వెలువడ్డాకే డీబీ రియాల్టీ షేర్లు రూ.36 నుంచి రూ.83కు చేరాయి. ప్రస్తుతం రూ.58 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ సంస్థ హవా నడిచిన 2010 మార్చిలో షేరు ధర రూ. 540. ఇటీవల వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ వ్యవహారం బయటకు రావడంతో గీతాంజలీ జ్యూవెలర్స్, డి.ఎస్.కులకర్ణి డెవలపర్స్ మార్కెట్ విలువ 96శాతం కోల్పోయింది. నీరవ్ మోడీ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపణలు ఎదుర్కొన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేర్ కూడా 30శాతానికి పడిపోయింది. తాజాగా సింభోలి షుగర్స్ వ్యవహారం తెరపైకి రావడంతో సింభోలీ షుగర్స్ 20శాతం విలువ కోల్పోయింది. మరోపక్క ఓబీసీ షేరు 12శాతానికి పైగా పతనమైంది. ఒక సారి ఇన్వెస్టర్ల నమ్మకాన్ని కోల్పోయిన కంపెనీలు కోలుకోవడం అత్యంత కష్టమని నిపుణులు చెబుతున్నారు.

స్వల్ప నష్టాల్లో మార్కెట్లు



ముంబై: గత రెండు సెషన్లలో లాభాల్లో నమో దైన దేశీయ స్టాక్ మార్కెట్లు వారం రెండవరోజు నష్టాల్లో ముగిసాయి. సోమవారం రికార్డుల్లో నమోదైన సూచీలు బ్యాంకింగ్ స్టాక్స్ నష్టాల్లో నమోదు కావడంతో ప్రతికూల ప్రభావం చూపాయి. నిఫ్టీ పిఎస్‌యు బ్యాంక్ ఇండెక్స్ 3.5 శాతానికి దిగజారింది. బిఎస్ఇ సెన్సెక్స్ 99.36పాయింట్ల నష్టంతో 0.29శాతంతో 34,346.39 పాయింట్ల వద్ద నిఫ్టీ 28.30 పాయింట్ల నష్టంతో 0.27శాతంతో 10,554.30 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సెషన్ పూర్తి ఊగిసలాటల్లో ముగిసింది. ప్రథమార్థంలో సెన్సెక్స్ 165.04 పాయింట్లు తాకింది. ఇంతలోనే ఇండెక్స్ 130.88 పాయింట్లకు దిగజారింది. నిఫ్టీ కూడా 49పాయింట్లు పెరిగి మధ్యాహ్న సమయానికి 45.35 పాయింట్లకు దిగజారింది. బిఎస్ఇ స్టాక్స్‌లో 1701 షేర్లు నష్టాల్లో నమోదు కాగా, 1036 షేర్లు లాభాల్లో కొనసాగాయి. 148 షేర్లలో మాత్రం ఎటువంటి మార్పులేదు. ఇండస్ ఇండ్ బ్యాంకు 0.54శాతానికి పడిపోయింది. సెక్టరల్ సూచీల్లో బిఎస్ఇ, రియాల్టీ, బ్యాంకెక్స్, ఫైనాన్స్ నష్టాల్లో నమోదుకాగా టెలికాం, ఎనర్జీ, యుటిలిటీస్ లాభాల్లో నమోదయ్యాయి. డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి జీడీపీ ఫలితాలు బుధవారం వెలువడనున్న నేపథ్యంలో మదుపరులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. బ్లూమ్‌బర్గ్ సర్వే నివేదిక ఆధారంగా, జీడీపీ 7 శాతానికి పెరగవచ్చునని సర్వే వెల్లడిం చింది. అంతకు ముందు త్రైమాసికంలో 6.3 శాతంగా నమోదైంది. బిఎస్ఇ మిడ్‌కాప్ 0.50 శాతం, స్మాల్‌కాప్ 0.35శాతం దిగజారాయి. భారతి ఎయిర్‌టెల్, డాక్టర్ రెడ్డీ లాబ్స్, హీరో మోటాకార్ప్, ఆర్ఐఎస్ ప్రధాన లబ్ధిదారులుకాగా, యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బిఐ, సన్ ఫార్మా, ఐసిఐసిఐ బ్యాంకు నష్టాల్లో నమోదయ్యాయి.

నష్టాల్లో పీఎన్‌బీ షేర్లు

పిఎన్‌బి షేర్లు 20నెలల కనిష్టానికి దిగజారి 9శాతంపైగానష్టాల్లో నమోదయ్యాయి. రియాల్టీ షేర్లు నష్టాల్లో నమోదయ్యాయి.

అంతర్జాతీయంగా ఆసియా షేర్లు : జపాన్ నిక్కీ విలువ 1.1శాతంపెరిగి మూడు వారాల గరిష్టానికి చేరింది. ఎమ్ఎస్‌సిఐ బ్రాడెస్ట్ ఇండెక్స్ ఆసియా పసిఫిక్ షేర్లు జపాన్ వెలుపల మూడువారాల గరిష్టానికి చేరింది. వాల్ స్ట్రీట్ ఎస్ అండ పి 500 1.18శాతం లాభాన్ని నమోదుచేసింది.

బ్రిటీష్ సాటిలైట్ టివి జైంట్ స్కై 20 శాతంపైగా లాభాల్ని నమోదుచేసింది. యుకె ఎఫ్‌టిఎస్ఇ 100 ఇండెక్స్ 0.4 శాతంతో 7391.91 పాయింట్లు నమోదు చేసింది. ఫ్రాంక్‌ఫర్ట్ డిఏఎక్స్ 30 ఇండెక్స్ 0.4శాతం పెరిగి 12,573.65 పాయింట్లు నమోదు చేసింది. పారిస్ సిఏసి 40 0.3శాతంతో 5358.57 వద్ద ముగిసింది.

సోలార్ ఇన్వెస్టర్ ఆఫ్ ది ఇయర్‌గా

ఫ్రోనియస్ ఇండియా



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రముఖ సోలార్ ఇన్వర్టర్ సప్లయ్ సంస్థ ఫ్రోనియస్ ఇండియా సోలార్ ఇన్వర్టర్ కంపెనీ ఆఫ్ ది ఇయర్‌గా గౌరవం దక్కించుకుంది. రూఫ్ టాప్ సోలార్ కాంగ్రెస్ 2018లో సిల్వర్ అవార్డును సొంతం చేసుకుంది. అడ్వాన్స్ టెక్నాలజీని అందిస్తున్నందుకు ఈ అవార్డు దక్కింది. సోలార్ ఇన్వర్టర్ల తయారీ, విక్రయ సంస్థగా ఫ్రోనియస్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన సంస్థ. ముంబై ఎయిర్‌పోర్టు, ఢిల్లీ మెట్రో, గౌహతి రైల్వేస్టేషన్‌తో పాటు నాంపల్లి రైల్వేస్టేషన్ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ఫ్రోనియస్ ఇండియా చేపట్టింది. రూఫ్ టాప్ సోలార్ కాంగ్రెస్ 2018 సందర్భంగా సోలార్ ఇన్వర్టర్ కంపెనీ ఆఫ్ ది ఇయర్ అవార్డును సంస్థ సేల్స్ మేనేజర్ జిందాల్ అందుకున్నారు.

మార్చి 15న బ్యాంకు ఉద్యోగుల సమ్మె లేదు

ఢిల్లీ: మార్చి 15న ప్రకటించిన ఉద్యోగుల సమ్మెను పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో రద్దు చేస్తున్నట్లు ద యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్స్ తెలిపింది. ప్రస్తుత గందరగోళ పరిస్థితుల్లో సమ్మె నిర్వహించడం భావ్యం కాదని నిశ్చయించుకొన్నట్లు ఏఐబీఈఏ జనరల్ సెక్రటరీ వెంకటాచలం పేర్కొన్నారు. ఆదివారం యూనియన్ నాయకులు నిర్వహించిన సమీక్షలో చర్చించిన అంశాలను ఆయన వివరించారు. పంజాబ్ నేషనల్ కుంభకోణం పట్ల యూనియన్ సభ్యులంతా తీవ్ర విచారం వ్యక్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరూ ఊహించని రీతిలో జరిగిన ఇలాంటి మోసాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

బ్యాంకు లావాదేవీలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టే బదులు నేరానికి కారకులుగా భావిస్తున్న వ్యక్తులపై మాత్రమే దృష్టిసారిస్తే బాగుంటుందని సూచించారు. బ్యాంకుల పనితీరును పర్యవేక్షించే సంస్థలు సైతం నిర్లక్ష్యంగా వ్యవరించాయని అన్నారు. ఈ విష యంలో సంబంధిత బ్యాంక్ ఉన్నతాధికారుల పాత్రను కూడా బయట పెట్టాలని డిమాండ్ చేశారు. బ్యాంకులను ఓ కంట కనిపెడుతూ ఉండాల్సిన రిజర్వ్ బ్యాంక్‌లో కొందరు వ్యక్తులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు.

మార్కెట్లోకి టీవీఎస్ ఎన్‌టార్క్ 125



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ద్విచక్ర, త్రిచక్ర వాహనాల తయారీలో అగ్రగామి సంస్థ అయిన టీవీఎస్ మోటార్ కంపెనీ 125 సీసీ స్కూటర్‌ను ఆవిష్కరించింది. యువత అభిరుచులకు అనుగుణంగా ఎన్‌టార్క్ 125 టీవీఎస్‌ను రూపుదిద్దారు. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని తయారు చేశారు. మంగళవారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో టీవీఎస్ ఎన్‌టార్క్ 125ని మార్కెట్లోకి విడుదల చేసింది. కంపెనీ జనరల్ మేనేజర్ ఆంథోని మాట్లాడుతూ యువత కోసం ప్రత్యేకంగా టీవీఎస్ ఎన్‌టార్క్ 125ని రూపుదిద్దామని చెప్పారు. రేస్ పెడిగ్రీ అభివృద్ధి ఆధారంగా రూపకల్పన చేసినట్లు వెల్లడించారు. అత్యా ధునిక సీవీటీఐ-ఆర్‌వీవీ 3 వాల్ ఇంజన్లు ఉంటాయని, ఈ స్కూటర్ ప్రత్యేకమైన సాంకేతిక ప్లాంట్స్‌తో అనుసంధానించినట్లు వివరించారు. 125 అనేది స్పోర్టిగా, స్టైలిష్‌గా, హైపర్‌ఫార్మెన్స్ టెక్నాలజీ లోడెడ్‌తో రూపొందించినట్లు తెలిపారు. ప్రత్యేక అంశాల మేలు కూర్పుతో వాహనదారులకు ఉల్లాసం కలిగించేలా తయారు చేశామ న్నారు. బ్లూటూత్ ఎనేబుల్డ్ స్కూటర్, సెల్‌ఫోన్ కనెక్టివిటీ, నావిగేషన్ అసిస్టెన్స్, ఇంజిన్ క్లీన్ స్విచ్, స్పీడ్ మీటర్, టాప్ సీడ్ రికార్డర్ వంటివి ప్రత్యేక అంశాలని తెలిపారు. టీవీఎస్ మోటార్ కమిటీ శైలి, పనితీరు, సాంకేతిక మేలు కలయికతో తయారు చేసినట్లు వివరించారు.

నోకియాతో చేతులు కలిపిన బీఎస్ఎన్ఎల్!

ముంబై: ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ తాను ప్రారంభించనున్న 4జీ, వాయిస్ ఓవర్ ఎల్‌టీఈ సేవలకు మద్దతు లభించేలా నోకియాతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు జరిగాయి. నోకియా భారత్‌లోని 10 టెలికాం సర్కిళ్లలో తన టెక్నాలజీని వినియోగిస్తోంది. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గోవా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తెలంగాణ రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. అందుబాటులో ఉన్న అత్యాధునిక సేవలను వినియోగించుకొని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు అత్యుత్తమ సేవలను అందజేస్తుందని సంస్థ ఛైర్మన్, ఎండీ అనుపమ్ శ్రీవాస్తవ తెలిపారు. నోకియాకు చెందిన సింగిల్ రేడియో యాక్సెస్ నెట్‌వర్క్‌ను వినియోగించుకొని 2జీ, 3జీ, 4జీ వినియోగదారులకు చౌకగా సేవలను అందిస్తామని శ్రీవాస్తవ చెప్పారు. దీంతోపాటు వీవోఎల్‌టీఈ టెక్నాలజీని వినియోగించుకొని 4జీ వినియోగదారులకు హెచ్‌డీ క్వాలిటీ వాయిస్ సేవలను అందజేస్తుంది.

పంట పండింది

- వారెన్ బఫెట్‌కు కార్పొరేట్ పన్ను కోతల కిక్కు
- బెర్క్‌షైర్ హాథవేకు రూ. 2 లక్షల కోట్ల ప్రయోజనం
- అమెరికాలో 35 నుంచి 21 శాతానికి పన్ను తగ్గడమే కారణం



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం.. వారెన్ బఫెట్‌కు చెందిన బెర్క్‌షైర్ హాథవే లాభాల్ని అమాంతం పెంచేసింది. అగ్రరాజ్య నూతన పన్ను చట్టంతో సంస్థ లాభం ఏకంగా రూ.2 లక్షల కోట్ల మేర ఎగబాకింది మరి. గతేదాది కంపెనీకి 65.3 బిలియన్ డాలర్ల నిర్వహణపరమైన లాభం రాగా, ఇందులో వ్యాపార కార్యకలాపాల వల్ల వచ్చింది 36 బిలియన్ డాలర్లు మాత్రమే. 29.3 బిలియన్ డాలర్లు కార్పొరేట్ పన్ను కోతలతోనే మిగలడం గమనార్హం. డాలర్‌తో పోల్చితే ప్రస్తుత రూపాయి మారకం విలువ ప్రకారం ఇది రూ.1,89,600 కోట్లతో సమానం. ఈ విషయాన్ని భాగస్వాములకు రాసిన వార్షిక లేఖలో బెర్క్‌షైర్ ఛైర్మన్, సీఈవో వారెన్ బఫెట్ పేర్కొన్నారు. అమెరికా కార్పొరేట్ సంస్థలు చెల్లించే పన్నును నిరుడు డిసెంబర్‌లో 35 శాతం నుంచి 21 శాతానికి ట్రంప్ సర్కారు తగ్గించిన సంగతి విదితమే. ఇది అక్కడి కార్పొరేట్లకు కాసుల వర్షం కురిపిస్తుండగా, బిలియనీర్ ఇన్వెస్టరైన బఫెట్‌కు మరింత కలిసొస్తున్నది. ట్రంప్ నిర్ణయం.. బెర్క్‌షైర్ కార్పొరేట్ పన్ను చెల్లింపులను భారీగా తగ్గించింది. ఇక 2017లో బెర్క్‌షైర్ నికర ఆదాయం ఒక్కసారిగా 44.94 బిలియన్ డాలర్లకు ఎగిసింది. 2016లో ఇది 24.07 బిలియన్ డాలర్లుగానే ఉన్నది. తగ్గిన కార్పొరేట్ పన్నుతో మా ఆదాయం కూడా పెరిగిందని వారెన్ బఫెట్ తన లేఖలో స్పష్టం చేశారు. కాగా, బెర్క్‌షైర్ హాథవేకు పదుల సంఖ్యలో సంస్థలుండగా, డైరీ క్వీన్ నుంచి డ్యూరాసెల్ వరకు బెర్క్‌షైర్‌వే. అంతేగాక అమెరికన్ ఎక్స్‌ప్రెస్, యాపిల్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, చార్టర్ కమ్యూనికేషన్స్, కోకా-కోలా, డెల్టా ఎయిర్‌లైన్స్, జనరల్ మోటార్స్, గోల్డ్‌మన్ సాచ్స్, మూడీస్, వెల్స్ ఫార్గో, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ తదితర సంస్థల్లోనూ బెర్క్‌షైర్‌కు చెప్పుకోదగ్గ వాటాలే ఉన్నాయి. 87 ఏండ్ల బఫెట్.. 11వ యేట నుంచే పెట్టుబడులు పెడుతుండటం విశేషం. బెర్క్‌షైర్ హాథవే నగదు నిల్వలు 116 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు బఫెట్ తెలిపారు. మున్ముందు మరిన్ని సంస్థల కొనుగోలుకు ఈ నిధులను వినియోగిస్తామని ఈ సందర్భంగా బఫెట్ ప్రకటించారు. 2017 నాటికి సంస్థ ఈక్విటీ విలువ 358 బిలియన్ డాలర్లకు చేరిందని చెప్పారు.

విజ్ఞానం

డిప్రెషన్‌తో మెదడులో మార్పులు



సంవత్సరాలుగా పెరుగుతున్న డిప్రెషన్ మానవ మెద దును పలు మార్పులకు గురి చేస్తుంది. మెదడులోని పెరుగుతున్న మాన సిక వ్యాధి పెరుగుతున్న కొలదీ అంటే కనీసం దశాబ్దకాలంగా ఎటువంటి చికిత్సకు నోచుకోకపోతే మెదడు పలు మార్పులకు లోనవుతుందని సెంటర్ ఫర్ అడిక్షన్ అండ్ మెంటల్ హెల్త్ వెల్లడించింది. మానసిక వత్తిడివలన కలిగే డిప్రెషన్‌ను ప్రారంభ దశలో చికిత్సచేయించకపోతే అల్జీమర్స్, పార్కిన్‌సన్స్ వంటివాటికి గురయ్యే సూచనలు ఉన్నట్లు వెల్లడైంది. బ్రెయిన్ ఇన్‌ఫ్లమేషన్‌ను బ్రెయిన్ ఇమేజింగ్ అనే పాజిట్రాన్ ఎమిషన్ టోమోగ్రఫీతో గుర్తించవచ్చు. బ్రెయిన్ ఇమ్యూన్ సెల్స్ అయిన మైక్రోగ్లియా మెదడులోని ఇన్‌ఫ్లమేటరీకి కారణం. వీటివలన మెదడు పలు అపసవ్యతలు ఏర్పడవచ్చు. ఎక్కువ ఇన్‌ఫ్లమేషన్‌కు గురైనపుడు డిప్రెషన్‌బారిపడే అవకాశంఉంది. మైక్రోగ్లియా యాక్టివేషన్‌కు లోనైందీ, లేనిదీ ట్రాన్స్‌లోకేటర్ ప్రోటీన్ అనేమార్కర్ పెట్ ఇమేజింగ్ ద్వారా వెల్లడవుతుంది. 10ఏళ్లకు పైగా డిప్రెషన్‌కు గురైన 25మంది, 10ఏళ్లలోపు డిప్రెషన్‌కు గురైన 25 మంది, డిప్రెషన్ వ్యాధిలేని 30మందిపై చేపట్టిన పరిశోధనలో ట్రాన్స్‌లోకేటర్ ప్రోటీన్ లెవెల్స్ మెదడులోని వివిధ ప్రాంతాల్లో చికిత్సకు లోనుకానివారిలో 30శాతం అధికంగా ఉన్నట్లు గుర్తించారు.

బీట్‌రూట్ రసంతో

గుండె జబ్బులు నయం



బీట్‌రూట్ రసంవంటి సప్లిమెంట్ల వినియోగంతో హార్ట్ ఫెయిల్యూర్ సమస్యలకు దూరం కావచ్చునని తెలుస్తోంది. శారీరక వ్యాయామంతో పాటు డైటరీ నైట్రేట్ అధికంగా ఉండే బీట్‌రూట్ జ్యూస్‌తో హృద్రోగ వ్యాధులను అరికట్టవచ్చు. వీటితో గుండె కండరాల సంకోచాన్ని నివారించడంతోపాటు రక్తానికి అవసరమైన ఆక్సిజన్ అందించే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. గుండె వ్యాధులతో లక్షలాది మంది మరణించడం మనకు తెలిసిందే.... శారీరక వ్యాయామంతో వీరికి కావలసిన ఆక్సిజన్, బీట్‌రూట్ సప్లిమెంట్లతో మరింత లాభం చేకూరుస్తుందని వెల్లడైంది.



డాటా సైన్స్ టెక్నాలజీపై

టాలెంట్ స్ప్రింట్ శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానంలో 20 లక్షలమందికి పైగా సాంకేతిక నిపుణులను శక్తిమంతులను చేయాలనే భారతదేశం యొక్క ప్రధాన లక్ష్యామని టాలెంట్ స్ప్రింట్ ఎండీ, సిఇఒ శాంతను పాల్ తెలిపారు. డాటా సైన్స్, బ్లాక్‌చైన్, ఫిన్‌టెక్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ వంటి నూతన సాంకేతికతలలో నైపుణ్యాలలో లక్ష మందికి పైగా నిపుణులను శక్తిమంతులను చేసేందుకై ప్రతిష్టాత్మకంగా ప్రణాళికలను రూపొందించామని, అందుకోసం, ప్రాక్సిస్ బిజినెస్ స్కూల్ భాగస్వామ్యంతో 'డేటా సైన్స్ ఫర్ మేనేజర్స్'ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాల్లో లక్ష మందికి పైగా పనిచేసే సాంకేతిక నిపుణులకు నూతన సాంకేతికతలలో నైపుణ్యాన్ని అందించనున్నామని, పరిశ్రమలో అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన భాగస్వాముల సహకారంతో తాము ఈ ప్రోగ్రామ్‌ను ప్రారంభించామన్నారు. ఫిన్-టెక్, బ్లాక్‌చైన్ ప్రోగ్రామ్‌లను అందించేందుకు ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమ ప్రముఖులైన రిప్పల్, పేపాల్, పేటిఎమ్ పేమెంట్స్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఇండియన్ ఏంజిల్ నెట్‌వర్క్‌తో కలిసి ఇప్పటికే చేపట్టడం జరిగిందన్నారు. ప్రాక్సిస్ బిజినెస్ స్కూల్ ఫౌండేషన్ సహ-వ్యవస్థాపకుడు, డైరక్టర్ చరణ్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ బిజినెస్ అనాలటిక్స్‌లో పూర్తిస్థాయి ప్రోగ్రామ్‌లను అందించడంలో దేశవ్యాప్తంగా ప్రాక్సిస్ 2వ ర్యాంక్‌ను కలిగివుందని, డేటా సైన్స్ ఫర్ మేనేజర్స్ అనేది అన్ని రంగాలకు చెందిన మేనేజర్లు, వ్యాపార ప్రముఖులకోసం ఉద్దేశించి రూపొందించడం జరిగిందన్నారు. టాలెంట్ స్ప్రింట్‌తో భాగస్వామ్యం వహిస్తున్నందుకు ప్రాక్సిస్‌కు ఎంతో ఆనందంగా ఉందని, హైదరాబాద్‌లో పనిచేస్తున్న నిపుణులకు ఈ ప్రోగ్రామ్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు.

వచ్చే నెలలో ఎయిర్‌టెల్-గూగుల్ ఫోన్లు

న్యూఢిల్లీ: భారత్‌లో అతి తక్కువ ధరలో ఆండ్రాయిడ్ ఓరియో('గో' ఎడిషన్) స్మార్ట్ ఫోన్‌ను అందించేందుకు గూగుల్‌తో ప్రముఖ టెలికాం కంపెనీ ఎయిర్‌టెల్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. 'మేరా పెహలా స్మార్ట్‌ఫోన్' (నా తొలి స్మార్ట్‌ఫోన్)లో భాగంగా ఆండ్రాయిడ్ ఓరియో వెర్షన్‌తో పనిచేసే బేసిక్ 4జీ స్మార్ట్‌ఫోన్లను మార్చి నుంచి అందుబాటులోకి తీసుకురాబోతోంది. ఇందులో భాగంగా దేశీయ మొబైల్ కంపెనీలైన లావా, మైక్రోమ్యాక్స్ తొలి సెట్ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేయబోతున్నాయి. ఈ ఫోన్లలో ఎయిర్‌టెల్‌కు చెందిన మై ఎయిర్ టెల్ , ఎయిర్‌టెల్ టీవీ, వింక్ మ్యూజిక్ వంటి అప్లికేషన్లు ప్రీలోడెడ్‌గా లభిస్తాయి. 1జీబీ ర్యామ్ అంతకంటే తక్కువ సామర్థ్యంతో రూపొందించిన స్మార్ట్‌ఫోన్ల కోసం ఆండ్రాయిడ్ ఓరియో(గో ఎడిషన్)ను ప్రత్యేకంగా రూపొందించారు. దీంతో పాటు ఈ ఎడిషన్ కోసం రూపొందించిన యాప్స్ వేగంగా పనిచేస్తూ అతి తక్కువ డేటాను వినియోగిస్తాయి. గూగుల్‌తో ఈ భాగస్వామ్యం తమ 'మేరా పెహలా స్మార్ట్‌ఫోన్' కార్యక్రమంలో ఓ మైలురాయిగా నిలిచిపోతుందని భారతి ఎయిర్‌టెల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ వాణి వెంకటేశ్ చెప్పారు. మార్కెట్లోకి తక్కువ ధర కలిగిన స్మార్ట్‌ఫోన్లను అందించాలన్న తమ లక్ష్యానికి ఆండ్రాయిడ్ గో ఊతమిస్తుందని పేర్కొన్నారు. మరోవైపు ఈ ప్రోగ్రామ్‌లో కొనుగోలు చేసే స్మార్ట్‌ఫోన్లకు క్యాష్ బ్యాక్ ఆఫర్‌తో పాటు మరిన్ని ఆకర్షణీయమైన ప్లాన్‌లు లభిస్తాయని వెల్లడించింది.



వరిసాగులో ప్రధానంగా పీడించేది బెరుకు. నాసిరకం విత్తనాలు వాడటం వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంటను కాపాడుకోవడంతో పాటు నష్టపరిహారం పొందే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వరిపైరులో బెరుకు రాకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఇందుకు ముఖ్యంగా విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు ముఖ్యం. గతంలో రకరకాల విత్తనాలను కలిపి నకిలీలను డీలర్లు అమ్మేవారు. వీటిని నాటడం వల్ల వరిలో బెరుకు వచ్చిన సందర్భాలు అనేకం. వీటి ప్రభావం వల్ల వరిపైరులో తల్లి కర్ర ముందుగా ఈనుతుంది. ఇందుకు రైతులు ఆందోళన చెందనవసరం లేదు. దాని ఈనిక అక్కరకు రాకుండా పోతుంది. ఆ తరువాత పిల్లకర్రలు వేసే పిలకలనే దృష్టిలోకి తీసుకోవాలి. వరి దిగుబడులు ఇచ్చేవి ఇవే. అలాంటి వరిపైరు సాగుపై ఆందోళన చెందవద్దని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి వారు ఇచ్చిన సూచనలు ఈ విధంగా ఉన్నాయి.

వరిలో బెరుకు..

జాగ్రత్తలతో మెరుగైన దిగుబడులు

సాగునీటి ఎద్దడి కారణంగా నారు మడిలో పైరు బాగా ముదిరాక నాటడం కూడా బెరుకు రావడానికి కారణంగా చెప్పవచ్చు. ముదిరిన నారుకు కనీసం 60 రోజుల వయస్సు ఉంటుంది. అలాంటి నారును ఊడ్చాక తక్కువ రోజుల పంట దిగుబడి విత్తనాలైతే 15 రోజుల్లోనే పొట్ట దశకు చేరతాయి. ప్రైవేటు కంపెనీల వద్ద, డీలర్ల వద్ద కూడా రైతులు నకిలీ విత్తనాల గురించి తెలియకుండానే రైతులు కొనుగోలు చేస్తారు. ఆ కంపెనీలు చెప్పిన విత్తన రకాలు వారు విక్రయించే సంచుల్లో రావు. తీరా వారు మోసపోయామని తెలియకముందే రైతులకు అమ్మేస్తారు.

20-25 బస్తాల దిగుబడి?

వరిపొలంలో బెరుకు వచ్చినా సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎకరాకు 20-25 బస్తాలకు తగ్గకుండా దిగుబడులు పొందవచ్చు. ఎరువుల మోతాదు పెంచాలి. ఎకరాకు 75 కిలోల ఎరువును వేయడంతోపాటు మరో 25 శాతం పెంచాలి. మూడు దఫాలుగా వేసే ఎరువును రెండు దఫాలుగానే వేయాలి. ఊడ్చే సమయంలోనే సగం.. అనగా 50 కిలోల ఎరువును వేయాలి.

ఎరువులు, సంరక్షణ మందుల కొనుగోలు విధానం

ప్రభుత్వ గుర్తింపు పొందిన తయారీ సంస్థల ఎరువుల బస్తాలను మాత్రమే కొనుగోలు చేయాలి. ఏ వివరాలూ లేని సంచుల్లో ఇచ్చే ఎరువులను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయకూడదు. కొనుగోలు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. సంరక్షణ మందులు కొనుగోలు చేసినప్పుడు సీలు సరిగా ఉన్న డబ్బాలు, సీసాలు చూసి రశీదుతోపాటు కొనాలి. ఐఎస్ఐ ముద్ర ఉన్నవాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. మందు ప్యాక్‌లపై మందులు తయారుచేసిన తేదీ, గడువు తేదీ తప్పనిసరిగా ఉండాలి. అలా ఉంటేనే ఆ మందులను వాడాలి. మోసపూరిత మాటలు నమ్మి, తెలియని వ్యక్తుల వద్ద రైతులు మందులను కొనరాదు. వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన డీలర్ వద్దనే విత్తనాలు, ఎరువులు, సంరక్షణ మందులు బిల్లుపై కొనాలి. అదేవిధంగా ఎండో సల్ఫాన్, బీహెచ్‌సీ - 10 శాతం, ఇథైల్ పేరాధ్యాన్ రకాల పురుగు మందులను మార్కెట్‌లో అమ్ముతున్నా కొనుగోలు చేయవద్దు. వీటిని రద్దు చేశారు.



విత్తన కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన విత్తన దుకాణ డీలర్ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల నుంచి మాత్రమే విత్తనాలు కొనాలి.
- విత్తన సంచిపై లాట్ నంబరు, కాల పరిమితిని చూసి విత్తనాలు కొనాలి. రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి.
- రైతు కొనుగోలు చేసిన విత్తనాల సంచులు, ట్యాగ్‌లు, రసీదులను పంటకాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలి.
- విత్తేముందు రైతు విత్తనాల మొలక శాతాన్ని పరీక్షించి విత్తుకోవాలి. దీనివల్ల సమయం ఆదా అవుతుంది. అంతేకాక సకాలంలో విత్తనాలు కొనవచ్చు.
- విత్తనా నాసిరకం అని సాగు సమయంలో తెలిస్తే ఆయా కంపెనీల నుంచి నష్టపరిహారం పొందాలంటే బిల్లు, ఖాళీ సంచి ఉండాలి.

అగ్గితెగులు బెడద

ఈ మాసంలో వరికి అగ్గితెగులు ఆశించడానికి అనువైన వాతావరణ పరిస్థితులు ఉంటాయి. పైరు ఆకులపై నూలు కండె ఆకారపు అగ్గితెగులు మచ్చలు గమనించిన వెంటనే క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాలి. ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రొథయోలేన్ 1.5 మిల్లీలీటర్లు చొప్పున లీటరు నీటికి కలిపి పైరుపై బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. నత్రజని ఎరువును అవసరం మేరకే పైపాటుగా వేయాలి. పొలంలో ఎల్లప్పుడు నీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి.

వరికి కాండం తొలిచే పురుగు బెడద

- నారుమడి నుంచి కంకిపాలు పోసుకునేవరకు పురుగుల దాడి
- సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం
- శాస్త్రవేత్తల హెచ్చరిక



వరిలో నారుమడినుంచి పైరు పాలుపోసుకునే దశ వరకూ వ్యాపించే కాండం తొలిచే పురుగును నియంత్రించాలి. అప్పుడే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. కాండం తొలిచేపురుగును మొవ్వపురుగు, మొగి పురుగు అని కూడా రైతులు పిలుస్తారు. సమగ్ర యాజమాన్య చర్యలు చేపట్టకపోతేనే కాండం తొలిచే పురుగు వల్ల దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఈ పురుగు వల్ల రైతుకు ఆర్థికంగా అధిక నష్టం వాటిల్లుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. వారి సూచనల ప్రకారం పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలు ఈ విధంగా ఉన్నాయి.

పురుగు సోకితే తాలు గింజలు

▸▸ చిరుపొట్ట ఏర్పడిన తరువాత ఈ పురుగు ఆశిస్తే వెన్నులో నుంచి గింజలకు పోషకాలు అందక అవి తాలుగా మారతాయి.

▸▸ తల్లిరెక్కల పురుగు గుడ్లను ఆకు చివరి పైభాగంలో గుంపుగా పెట్టి, వాటి ఉదరం చివరగల వెంట్రుకలతో కప్పి ఉంచుతుంది.

▸▸ ఈ పురుగులు గుంపులుగా మొక్క పైభాగంలో చేరి ఆకు తొడిమ పైనున్న పత్రహరితాన్ని గోకి తింటాయి.



▸▸ పంటలో ఈ పురుగు చేసే నష్టం వల్ల మొక్క ఆకులు తెల్లని చారలుగా ఏర్పడతాయి.

▸▸ ఈ పురుగు కాండం లోపలికి చేరి కణజాలాన్ని తినడం వల్ల మువ్వ ఆకులు విడిపడక మువ్వకుళ్లు ఏర్పడుతుంది.

పురుగు నివారణ ఇలా..

వరి పిలకలు తొడిగే దశలో ఎకరానికి లీటరు నీటికి 1.6 మిల్లీలీటర్ల మోనోక్రోటోఫాస్ కలిపి పిచికారీ చేయాలి. లేదా క్లోరిఫైరీపాస్ 2.5 మిల్లీలీటర్లు లేక పాస్ఫామిడాన్ 2 మిల్లీలీటర్లను కలిపి పిచికారీ చేయాలి. ఇలా చేస్తే పురుగులను సమర్థంగా నివారణ చేయవచ్చు. అంకురం దశలో 10 నుంచి 15 రోజుల సమయంలో ఎకరానికి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున చల్లుకోవాలి. పురుగు మందులైతే ఎకరానికి లీటరు నీటికి క్లోరిఫైరీపాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా ఎస్పేట్ 1.5 గ్రాములు లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పసుపు రంగులో పురుగు

తల్లిపురుగు పసుపు రంగులో ఉంటుంది. రెక్కల మధ్యలో నల్లటి మచ్చలు, ఉదరం చివర పట్టు వంటి వెంట్రుకలను కుచ్చుగా కలిగి ఉంటుంది. మగ పురుగైతే పరిమాణంలో ఆడ పురుగుల కంటే చిన్నగా గోధుమరంగులో ఉంటుంది. రెక్కల చివర అంచున అనేక చిన్న చిన్న చుక్కలను కలిగి ఉంటుంది.

నారుమడి నుంచే యాజమాన్య చర్యలు

▸▸ కాండం తొలిచే పురుగులను ప్రాథమిక దశనుంచే నిర్మూలించాలి.

▸▸ వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు నారుమడి నుంచే సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టాలి.

▸▸ నారు తీయడానికి వారం రోజుల ముందే కార్బోఫ్యూరాన్ గుళికలను సెంటు భూమికి 150 గ్రాముల చొప్పున నీటిలో ఇసుకతో కలిపి నారుమడిలో చల్లాలి.

▸▸ నారు నాటేటప్పుడు నారు కట్టల చివర్లను తుంచివేయాలి.

▸▸ నారు నాటిన 30 నుంచి 35 రోజులకు ఎకరానికి 20 వేల చొప్పున ట్రైకోగ్రామా పరాన్నజీవుల గుడ్లను 15 రోజుల వ్యవధిలో మూడుసార్లు వదలాలి.

▸▸ చదరపు మీటరుకు ఒక తల్లిరెక్కల పురుగు లేదా గుడ్ల సముదాయం లేదా 5 శాతం మొక్కవచ్చిన కర్రలు ఉంటే పురుగు మందులు వాడాల్సిందే.


పురుగు జీవితచక్రం ఇలా..

కాండం తొలిచే పురుగులు ఒక్కొక్క గుంపులో 20 నుంచి 80 గుడ్ల వరకు ఉంటాయి. తల్లి పురుగు కనీసం 300 గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లు 5 నుంచి 7 రోజులు పొదిగాక పురుగులు బయటకు వస్తాయి. ఇక లార్వా దశ పూర్తికాలం 30 నుంచి 40 రోజులు. పూర్తి జీవిత కాలానికి పట్టే రోజులు 50 నుంచి 70 రోజులుగా చెప్పవచ్చు.

విశాలాంధ్ర సినిమా

మార్చి 9న విజయ్ దేవరకొండ

'ఏ మంత్రం వేశావే'



పెళ్లిచూపులు, అర్జున్ రెడ్డి చిత్రాలతో యువతలో కథానాయకుడు విజయ్ దేవరకొండ సంపాదించిన పాపులారిటీ అంతా ఇంతా కాదు. ముఖ్యంగా అర్జున్ రెడ్డి చిత్రంతో విజయ్ దేవరకొండ యువతలో మోస్ట్ క్రేజీయస్ట్ హీరోగా మారాడు. ఇక ఈ యువహీరో నటిస్తున్న తాజా చిత్రం 'ఏ మంత్రం వేశావే'. విజయ్ సరసన శివానీసింగ్ నాయికగా నటిస్తోంది. గోలీసోడా ఫిలిమ్స్ నిర్మాణంలో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మల్కాపురం శివకుమార్ సమర్పణలో శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని మార్చి 9న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఈ సందర్భంగా సమర్పకుడు మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ ' గేమ్ నేపథ్యంలో నడిచే విభిన్నమైన కథ ఇది. విజయ్ దేవరకొండ పాత్ర ఇందులో చాలా వైవిధ్యంగా, నేటి యువతరానికి ప్రతినిధిగా కనిపించబోతున్నాడు. పెళ్లిచూపులు, అర్జున్‌రెడ్డి తరహాలోనే ఈ చిత్రం కూడా ఆయన కెరీర్‌లో మరపురాని చిత్రంగా వుండబోతుంది. విదేశాల్లో చిత్రీకరించిన సన్నివేశాలు చిత్రానికి హైలైట్‌గా వుంటాయి. మార్చి 9న చిత్రాన్ని విడుదల చేస్తాం' అని తెలిపారు. శివన్నారాయణ, రాజబాబు, నీలాక్షిసింగ్, ఆశిష్‌రాజ్, ప్రభావతి, దీపక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అబ్బత్ సమత్, సినిమాటోగ్రఫీ: శివారెడ్డి.

దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు రజనీ కొత్త సినిమా

సూపర్ స్టార్ రజనీకాంత్ మరో సినిమా ప్రకటించారు. 2 సినిమాల్ని రిలీజ్‌కు రెడీ చేసిన ఈ స్టార్ హీరో.. తాజాగా మరో సినిమా ఎనౌన్స్ చేసి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రజనీకాంత్ తదుపరి సినిమా ఉంటుంది. దీన్ని ఒక భారీ బడ్జెట్ సినిమాగా చెప్పుకొచ్చారు సమర్పకుడు కళానిధి మారన్. ప్రస్తుతం రజనీకాంత్ చేతిలో 2 సినిమాలున్నాయి. శంకర్ దర్శకత్వంలో 2.0, పా రంజిత్ దర్శకత్వంలో కాలా సినిమాలు పూర్తిచేశారు. వీటిలో కాలా సినిమా ఏప్రిల్ 27న రిలీజ్ అవుతోంది. 2.0 పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఈ రెండు సినిమాల తర్వాత రజనీ సినిమాలు ఆపేస్తారని, పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి వెళ్లిపోతారనే ప్రచారం సాగింది. తాజా ప్రకటనతో ఆ ప్రచారంలో నిజం లేదని తెలిపోయింది. గతంలో పిజ్జా లాంటి హారర్ థ్రిల్లర్ సినిమాను డైరక్ట్ చేశాడు దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు. రజనీ-కార్తీక్ కాంబోలో ఇదే ఫస్ట్ మూవీ కాగా.. 2.0 తర్వాత రజనీకాంత్ కెరీర్‌లో ఇది రెండో భారీ బడ్జెట్ చిత్రంగా నిలవనుంది. సినిమాకు సంబంధించి మరిన్ని వివరాల్ని త్వరలోనే ప్రకటిస్తారు.

షూటింగ్ పూర్తి చేసుకున్న 'మెహబూబా'

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తన కుమారుడు ఆకాష్ పూరితో చేస్తున్న చిత్రం 'మెహబూబా'. ఈ చిత్రం షూటింగ్ పార్ట్ విజయవంతంగా పూర్తైపోయింది. ఇప్పటికే ఆకాష్ పూరి తన వంతు డబ్బింగ్ కూడా మొదలుపెట్టాడు. ఇటీవల విడుదలైన చిత్ర టీజర్‌కు కూడా మంచి స్పందన లభించింది. 1971 ఇండియా, పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో నడిచే ప్రేమ కథగా ఉండనున్న ఈ సినిమాను ఈ వేసవికి భారీ ఎత్తున విడుదలచేయనున్నారు. ఈ చిత్రంలో ఆకాష్ పూరి సరసన నేహాశెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, సందీప్ చౌత సంగీతాన్ని అందిస్తున్నారు. సొంత సంస్థ పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని పూరి స్వయంగా నిర్మిస్తున్నారు.

మళ్లీ అవసరాల, నాని కాంబో మూవీ?



నేచురల్ స్టార్ నానికి నటుడు, దర్శకుడు అవసరాల శ్రీనివాస్‌తో మంచి స్నేహ సంబంధాలున్నాయి. మంచి కథ కుదిరితే వీరి కాంబినేషన్‌లో సినిమా ఉంటుందని ఇద్దరూ చెబుతున్నారు. నాని కోసం అవసరాల శ్రీనివాస్ ఓ మంచి కథను సిద్ధం చేశాడట. రీసెంట్‌గా కృష్ణార్జునయుద్ధం సినిమాను పూర్తి చేసుకున్న నాని తదుపరిగా అశ్వనీదత్ నిర్మాణంలో నాగార్జునతో కలిసి మల్టీస్టారర్ మూవీ చేయబోతున్నాడు. ఈ సినిమా పూర్తయిన తర్వాత అవసరాల శ్రీనివాస్‌తో నాని సినిమా ఉంటుందట. అంటే జూన్‌లో ఈ సినిమా ప్రారంభం అవుతుందని, ఈలోగా ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తవుతాయని సమాచారం.

రవితేజతో హరీష్‌శంకర్ సీటీమార్!

మాస్ మహారాజా రవితేజ ఇప్పుడు వరుస సినిమాలతో స్పీడు పెంచాడు. ప్రస్తుతం కల్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తర్వాత శ్రీనువైట్ల దర్శకత్వంలో రవితేజ అమర్ అక్బర్ ఆంటోని (వినపడుతున్న టైటిల్) సినిమా చేస్తాడు. ఈ సినిమా తర్వాత హరీష్ శంకర్ దర్శకత్వంలో రవితేజ సీటీమార్ సినిమా చేయబోతున్నాడు. ఇటీవల హరీష్ శంకర్ సీటీమార్ సినిమా చేయబోతున్నట్లు ప్రకటించాడు. అయితే అప్పుడు హీరో ఎవరనే విషయాన్ని ప్రకటించలేదు. అయితే ఆ సినిమా రవితేజ చేస్తాడని విశ్వసనీయ వర్గాల సమాచారం. రవితేజ, శ్రీనువైట్ల కాంబినేషన్‌లో సినిమా పూర్తయ్యేలోపు హరీష్ తన దాగుడుమూతలు సినిమాను పూర్తి చేస్తాడని టాక్ వినిపిస్తోంది.

నాగశౌర్యకి గిఫ్ట్ ఇచ్చిన తల్లి

ఛలోతో సూపర్ హిట్ అందుకున్న నాగశౌర్య.. ఇప్పుడు మరో సర్‌ప్రైజ్ గిఫ్ట్ కూడా అందుకున్నాడు. ఈ సినిమా నిర్మాత, నాగశౌర్య తల్లి ఉషా మల్పూరి తనయుడికి కాస్ట్‌లీ కారును గిఫ్ట్‌గా అందించారు. సొంత బ్యానర్ లో కొడుకు నాగశౌర్యను హీరోగా పెట్టి తొలి ప్రయత్నంగా తీసిన ఛలో సూపర్ హిట్ అవ్వడంతో.. తన ఆనందాన్ని ఇలా షేర్ చేసుకున్నారు నిర్మాత ఉష. కేవలం నాగశౌర్య ఒక్కడికే కాదు.. యూనిట్‌లో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో బహుమతులు అందాయి. ఛలో సక్సెస్ సెలబ్రేషన్స్‌లో భాగంగా యూనిట్‌లో పనిచేసిన ప్రతి ఒక్కరికి డబ్బు, బహుమతుల రూపంలో ప్రోత్సాహకాలు అందించారు.



మార్చి 18న రంగస్థలం ప్రీ రిలీజ్ ఫంక్షన్

మరో 5 రోజుల్లో రంగస్థలం టైటిల్ సాంగ్ రిలీజ్ కానుంది. దేవిశ్రీప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు. రంగస్థలం ప్రీ రిలీజ్ వేడుకను ఉగాది సందర్భంగా మార్చి 18న విశాఖ ఆర్కేబీచ్‌లో చేయాలని నిర్మాతలు నిర్ణయించారు. ఈ మేరకు రామ్ చరణ్ కూడా అంగీకారం తెలపడంతో డేట్ ఫిక్స్ అయింది. రంగస్థలంలో చరణ్ సరసన సమంత హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా ప్రీ-రిలీజ్ బిజినెస్ ఇప్పటికే 80 కోట్ల మార్క్‌కు చేరుకుంది. రంగస్థలం సినిమాకు సంబంధించి ఇప్పటికే ఓ సాంగ్ రిలీజైంది. ఆ పాటకు కోటి వ్యూస్ కూడా వచ్చాయి. ఇప్పుడు అదే ఉత్సాహంతో సెకెండ్ సింగిల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది యూనిట్. ఈసారి విడుదల చేయబోయే టైటిల్ సాంగ్‌తో పాటు ఆ పాటలోనే 2 నిమిషాల వీడియోను కూడా చూపించబోతున్నారు.



రూ.500 కోట్ల సినిమా 'రామాయణం'

అల్లు అరవింద్ గతంలో ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన రామాయణం ప్రాజెక్టులో మళ్లీ కదలిక వచ్చింది. అల్లు అరవింద్‌తో పాటు మధు మంతెన, నమిత్ మల్హోత్రా నిర్మాతలుగా ఈ సినిమా రానుంది. ఈ మూవీని రూ.500 కోట్ల బడ్జెట్‌తో రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు వీళ్లు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రానున్న ఈ సినిమాపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ అధికారులతో లక్నోలో చర్చించాడు అల్లు అరవింద్. ఆ ప్రభుత్వం షూటింగ్‌కి అనుమతిని ఇచ్చేసింది. వారు కూడా ఈ మైథలాజికల్ చిత్రాన్ని రూపొందించేందుకు మద్దతు ఇచ్చారు. అత్యాధునిక టెక్నాలజీ, గ్రాఫిక్స్ ఆధారంగా సరికొత్త రామాయణం సృష్టించాలనేది అల్లు అరవింద్ కోరిక.

రాజరథం.. ఓ అద్భుతం

విడుదలకు ముందే ప్రశంసలు



ట్రైలర్ విడుదల అయినప్పటి నుండి 'టాక్ ఆఫ్ ది టౌన్'గా ఉన్న 'రాజరథం' గురించి పరిచయం అక్కర్లేదు. అనేక అంశాలతో ఆకట్టుకుంటున్న 'రాజరథం', ఇప్పుడు ఆ చిత్రానికి పని చేస్తున్న టెక్నీషియన్స్ గురించి కూడా ఇండస్ట్రీలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఈ చిత్రానికి 'సౌండ్' విభాగాన్ని పర్యవేక్షిస్తున్న రాజా కృష్ణన్ దేశంలోనే పేరొందిన టాప్ సౌండ్ మిక్సర్స్‌లో ఒకరు. 'ప్రేమమ్', 'బెంగుళూరు డేస్','విక్రమ్ వేద','అర్జున్ రెడ్డి','అ..ఆ..', 'నా పేరు సూర్య' వంటి చిత్రాలకి ఈయన పని చేశారు. ఆయన 'రాజరథం' కి మిక్సింగ్ చేస్తున్నప్పుడు దర్శకుడు అనూప్ చిత్రాన్ని సాంకేతికంగా అత్యున్న తంగా తీర్చిదిద్దిన విధానం చూసి రాజా కృష్ణన్ మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నారు. ఆయనే ఈ చిత్రానికి 'డాల్బీ అట్మాస్' అవసరం అని, దాని వల్ల ప్రేక్షకులకి మరింత అనుభూతిని అందిచగలమని టీంని ప్రోత్సహించారు. ఈ చిత్రానికి సంబంధించిన 'సౌండ్' విషయంలో ఆయన స్పెషల్ కేర్ తీసుకుని చేస్తున్నారు. "ఈ సినిమా నా కెరీర్ లో నే ఒక మైల్ స్టోన్‌గా నిలిచిపోతుంది. ప్రేక్షకులు సినిమా చూశాక సౌండ్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు" అన్నారు. 'బాహుబలి', 'ఈగ', 'దృశ్యం', 'రంగితరంగా' వంటి చిత్రాలకి పని చేసిన 'కలరిస్ట్' శివ కుమార్ 'రాజరథం'కి పని చేయడం ఒక గొప్ప అనుభ వంగా చెప్తున్నారు. దర్శకుడు అనూప్‌తో ఎన్నో చర్చలు, ఎంతో సమయం గడి పిన శివ కుమార్ స్క్రిప్ట్‌కి తగ్గట్టు ఆకట్టుకునే కలర్ పాల్లేట్స్‌ని ఈ సినిమా కోసం వాడారు. 'రాజరథం' విడుదల అయ్యాక ఈ కలర్ పాల్లేట్స్‌ని మరిన్ని సినిమాల్లో చూస్తారని అన్నారాయన. నిరూప్ భండారి, అవంతిక శెట్టి, ఆర్య, రవిశంకర్, రానా దగ్గుబాటి వాయిస్‌తో ఉన్న 'రాజరథం' ఆకట్టుకునే స్క్రీన్‌ప్లేతో అత్యున్నత ప్రమాణాలతో ఉండబోతోంది. 'రాజరథం'తో దర్శకుడు అనూప్ భండారి మరోసారి తెర మీద తన మేజిక్ చూపించబోతున్నారు. నిర్మాణంలో తమ తొలి ప్రయత్నంగా 'జాలీ హిట్స్' నిర్మించిన 'రాజరథం' ప్రపంచవ్యాప్తంగా మార్చి 23 న విడుదల కాబోతోంది.

9,500 హైరిస్క్ సంస్థలను ప్రకటించిన ఆర్థిక శాఖ

న్యూఢిల్లీ : ఆర్థిక మంత్రిత్వశాఖలోని నిఘా వ్యవస్థ 9,500 అధిక ప్రమాదం గల హైరిస్క్ ఆర్థిక సంస్థల పేర్లను ప్రకటించింది. బ్యాంకింగ్ నియమనిబంధనలు పాటించకుండా మనీలాండరింగ్‌వ్యతిరేక చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని మంత్రిత్వశాఖ తెలిపింది. ఆర్థిక నిఘాసంస్థ (ఎఫ్ఐయూ) ఈ ఏడాది జనవరకు ఉన్న సంస్థల పేర్లతో ఈ జాబితాను వెల్లడించింది. మనీలాండరింగ్ (పీఎంఎల్ఏ) వ్యతిరేకంగా కోఆపరేటివ్ బ్యాంకులతో సహా ఎన్‌బీఎఫ్‌సీలను వాటి లావాదేవీల సమగ్ర సమాచారం అందించాలని ఎఫ్ఐయూ కోరింది. రూ.10 లక్షల కంటే ఎక్కువగా ఉన్న లావాదేవీలను పరిశీలించే బాధ్యత ప్రిన్సిపల్ ఆఫీసర్‌దేనని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొన్నాయి. 2016లో పెద్ద నోట్ల రద్దు తర్వాత ప్రజలను జాగరూకులను చేస్తూ, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ (ఎన్‌బీఎఫ్‌సీ) లావాదేవీల అవకతవకలను బహిర్గతం చేయడమే కాకుండా ఎటువంటి ఆర్థిక లావాదేవీలు జరపకుండా ఎఫ్ఐయూ కట్టుదిట్ట చర్యలు తీసుకుంటోందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కంపెనీల చట్టాల ప్రకారం నమోదు, వ్యాపార రుణం, అడ్వాన్సులు, షేర్లు, బాండ్లు, డిబెంచర్లు, సెక్యూరిటీలను ఎన్‌బీఎఫ్‌సీ కంట్రోలు చేయనుంది.

శుహైబ్ హత్యకేసులో సీబీఐ దర్యాప్తు కోరిన తల్లిదండ్రులు

కోచి : కేరళ యూత్ కాంగ్రెస్ నాయకుడు శుహైబ్ హత్యకేసును దర్యాప్తు చేయడానికి ప్రభుత్వం, సీబీఐ తమ స్పందనను మార్చి 6 లోపు తెలపాలని హైకోర్టు ఆదేశించింది. శుహైబ్ తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేయడంతో జస్టిస్ బీ కెమల్ పాషా దీనిపై పై విధంగా స్పందించారు. ప్రస్తుత దర్యాప్తు పూర్తి అసత్యాలతో తప్పులతడకగా ఉందని, దీంతో సీబీఐతో దర్యాప్తు జరపాలని వారు కోరారు. అధికార సీపీఎం నేతల ఆదేశాను సారం పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారని దీంతో చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై ఉపయోగించాల్సిన యూఏపీఏ చట్టాన్ని కావాలనే పోలీసులు విస్మరించారని పిటిషనర్లు వాదించారు. ప్రధాన నిందితుడైన ఆకాశ్ సీపీఎం కన్నూర్ జిల్లా కార్యదర్శి పి. జయరాజన్‌కు చాలా దగ్గరివాడని అందువల్ల విచారణ స్వతంత్రంగా జరగడం లేదన్నారు. హత్యవెనుక భారీ కుట్రదాగుందని,దీనిపై సమగ్ర విచారణ జరిపి నిజమైన దోషులను పట్టుకోవాలని వారు కోరారు.



మళ్లీ జడ్జిని మార్చేశారు..

సొహ్రాబుద్దీన్ కేసుపై రాహుల్

న్యూఢిల్లీ : సొహ్రాబుద్దీన్ షేక్ కేసులో మరోసారి జడ్జిని మార్చివేశారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. తొలుత.. బాంబే హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జికి సొహ్రాబుద్దీన్ కేసు కేసు విచారణ బాధ్యతలు అప్పగించి.. ఇప్పుడు వారి స్థానంలో వేరొకరిని నియమించడాన్ని రాహుల్ విమర్శించారు. 'సొహ్రాబుద్దీన్ షేక్ కేసు: మీడియాని తప్పు బట్టిన; సీబీఐపై మండిపడ్డ జడ్జిలపై వేటు' అన్న నివేదికను ట్విట్టర్‌లో ట్యాగ్‌చేశారు. సీబీఐ జడ్జి బీజీలోయా మృతి అంశాన్ని రాహుల్ ప్రస్తావించారు. 'హ్యాష్‌ట్యాగ్ లోయా ఎలా చనిపోయారు?' అని పోస్టు చేశారు. తొలుత సీబీఐని సవాల్ చేసిన జస్టిస్ రేవతిదేరా, అమిత్ షాను కోర్టుకు రమ్మన్న జడ్జి జేటీఉత్పట్‌లను సొహ్రాబుద్దీన్ కేసు విచారణ నుంచి తప్పించారని రాహుల్ ట్వీట్ చేశారు. కఠినంగా ప్రశ్నించిన జడ్జిలోయా మరణించారు. ఆయన ఎలా మృతి చెందారు? అని ప్రశ్నించారు. ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయన్న నెపంతో 2005, నవంబరులో గ్యాంగ్‌స్టర్ సొహ్రాబుద్దీన్ షేక్, ఆయన భార్య కౌశర్ బీలను గుజరాత్ పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడం తెలిసిందే.

మేఘాలయ, నాగాలాండ్‌లో ముగిసిన పోలింగ్

- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతం
- నాగాలాండ్‌లో 75%, మేఘాలయలో 67 % పోలింగ్
- నాగాలాండ్‌లో ఘర్షణ ఒకరి మృతి



షిల్లాంగ్/ కోహిమా : రెండు ఈశాన్య రాష్ట్రాలైన మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీలకు మంగళవారం పోలింగ్ ముగిసింది. రెండు రాష్ట్రాల్లోనూ ఓటర్లు భారీగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. చెదురు, మదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నాగాలాండ్‌లో 75శాతం, మేఘాలయలో 67శాతం ఓట్లు పోలయ్యాయి.

నాగాలాండ్‌లోని జున్హెబొటో జిల్లా అకులుటో నియోజకవర్గంలో నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) కొత్తగా ఏర్పాటు చేసిన నేషనలిస్టు డెమొక్రటిక్ ప్రోగ్రెస్సివ్ పార్టీ (ఎన్డీపీపీ) కార్యకర్తల మధ్య ఉదయం 11.10 గంటలకు జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయని నాగాలాండ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) అభిజిత్ సిన్హా తెలిపారు. ఈ ఘర్షణ కారణంగా పోలింగ్ క్రమానికి ఎటువంటి ఆటంకం కలుగలేదని తెలిపారు. పోలింగ్ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రెండు రాష్ట్రాల్లోనూ 60 శాసనసభా నియోజకవర్గాలు చొప్పున ఉన్నాయి. అయితే, రెండు చోట్లా నేడు 59 నియోజకవర్గాల చొప్పునే పోలింగ్ జరిగింది. అభ్యర్థుల మృతి కారణంగా రెండు రాష్ట్రాల్లోనూ ఒక్కొక్క నియోజకవర్గంలో పోలింగ్ వాయిదాపడింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా (ఈవీఎం) లలో సమస్యలు తలెత్తడంతో షిల్లాంగ్‌లోని మోడల్ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.

మేఘాలయలో మొత్తం 18 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రమంతటా 3,000కు పైగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్సీపీ అభ్యర్థి జొనాథనే ఎన్ సంగ్మా ఈ నెల 18వ తేదీన ఐఈడీ పేలుడులో చనిపోవడంతో తూర్పు గారో హిల్స్ జిల్లా విలియంనగర్‌లో పోలింగ్ వాయిదాపడింది. గిరిజన ప్రాంతాలలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు గిరిజన మహిళలు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో బారులుతీరి నిలుచున్నారు. రాష్ట్ర మంతటా సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. పోలింగ్ సందర్భంగా రాష్ట్ర సాయుధ పోలీసు బలగాలు, పోలీసులతో పాటు మొత్తం 106 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సీఏపీఎఫ్)ను మోహరించామని మేఘాలయ సీఈఓ ఎఫ్ఆర్ ఖర్కోంగర్ తెలిపారు. 31 మంది మహిళలు, 80 మంది స్వతంత్రులతో కలిపి 361 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నేడు ఓటర్లు ఈవీఎంలలో బంధించారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా 67 మహిళా పోలింగ్ స్టేషన్లు, 61 మోడల్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

నాగాలాండ్‌లో పోలింగ్‌కు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. నేషనలిస్టు డెమొక్రటిక్ పీపుల్స్ పార్టీ (ఎన్డీపీపీ) చీఫ్ నెఫ్యూ రియో నార్తరన్ అంగమి-2 నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా విజయం సాధించడంతో 59 నియోజకవర్గాలలో నేడు పోలింగ్ ముగిసింది. మొత్తం 2,156 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో సగంపైగా సమస్యాత్మకమైనవిగా ప్రకటించారు. పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. మారుమూలనున్న జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాలలో మధ్యాహ్నం 3 గంటలకే పోలింగ్ ముగిసింది. ఈ రెండు రాష్ట్రాలతో పాటు ఇప్పటికే ఎన్నికలు జరిగిన త్రిపురలో ఓట్ల లెక్కింపు మార్చి 3వ తేదీన జరుగుతుంది.

7-8శాతానికి పైగా వృద్ధిరేటు సాధ్యమే : జైట్లీ



న్యూఢిల్లీ : ఆర్థిక విధానాల్లో మార్పు దృష్ట్యా 7-8 శాతానికిపైగా వృద్ధిరేటును సాధించడం భారత్‌కు సాధ్యమేనని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. భారత్-కొరియా వాణిజ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ వచ్చే 10-20ఏళ్లలో భారత్ శరవేగంగా అభివృద్ధి చెందే ప్రపంచ ఆర్థికవ్యవస్థల్లో ఒకటిగా ఉంటుందన్నారు. ఆత్మపరిశీలన చేసుకొని తప్పులను సరిదిద్దుకొని ముందుకు సాగే సామర్థ్యం భారత్‌కు వుందని, అవసరమైతే కఠినమైన నిర్ణయాలు తీసుకో గలదని ఆయనన్నారు. తాజా పరిణామాలను బట్టి ఈ విషయం స్పష్టమైందని తెలిపారు. 7-8శాతం వృద్ధిరేటు సాధారణమనేది చాలా మంది భావనన్నారు. అయితే, దానిని అధిగమించే శక్తిసామర్థ్యాలు భారత్‌కు ఉన్నట్టు తెలిపారు. ప్రపంచ సహకారం, విధానాల మార్పుతో ఈ లక్ష్యాలను ఛేదించడం కష్టమేమీ కాదన్నారు. కొన్నేళ్లుగా భారత్ పెట్టుబడులకు ద్వారాలు తెరిచిందని, పెట్టుబడిదారులకు మార్గాలను సులభతరం చేసిందని చెప్పారు. భారత్‌లో వాణిజ్యాన్ని సులభతరం చేసినట్టు తెలిపారు. అయితే ఆయా విధివిధానాలను సులభతరం చేయడం ఎందుకన్నా వాదన కూడా ఉందని, యావత్ జాతి సంపూర్ణ కృషితో ఈ దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఒకటే పన్ను విధానాన్ని తీసుకు రావడంలో కేంద్ర ప్రభుత్వం సఫలమైందని, తద్వారా అంతర్జాతీయ పెట్టుబడిదారులకు పన్నుల భారం తగ్గుతుందని, పరోక్ష పన్ను వ్యవస్థ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందని జైట్లీ అన్నారు. పన్నులకు సంబంధించిన భయాలను పూర్తిగా పోగట్టగలిగామని, టాక్సేషన్‌కు స్థిరత్వాన్ని కల్పించామన్నారు. కొన్ని రంగాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోందని జైట్లీ తెలిపారు. దేశంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ రంగంలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు.

రాజ్‌నాథ్‌తో మెహబూబా భేటీ

కాశ్మీర్ పరిస్థితిపై ఇరువురు నేతలు చర్చలు



న్యూఢిల్లీ : జమ్మూ-కాశ్మీర్ ముఖ్యమంత్రి మెహ బూబా ముఫ్తీ మంగళవారం కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఢిల్లీలో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిపై వారు చర్చించారని అధికారవర్గాలు తెలిపాయి. దాదాపు 20 నిముషాలపాటు జరిగిన ఈ సమావేశంలో కాశ్మీర్ లోయలో అదేవిధంగా పాకిస్థాన్ సరిహద్దు వెంబడి భద్రతా పరిస్థితిని రాజ్‌నాథ్‌కు మెహబూబా వివరిం చారు. పాకిస్థాన్‌తో సరిహద్దులో రెండు దేశాల దళాల మధ్య భారీగా కాల్పులు, తీవ్రవాదుల చొరబాటుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రతినిధి దినేశ్వర్ శర్మ చేపడుతున్న శాంతిచర్చల క్రమంపై ఇద్దరు నాయకులు చర్చించారని హోం మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. శ్రీనగర్ కేంద్రంగా గల చినార్ క్రాఫ్స్ కమాండింగ్ జనరల్ ఆఫీసరు లెఫ్టినెంట్ జనరల్ ఏకే భట్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, కాశ్మీర్‌లో ప్రవేశించి నియంత్రణ రేఖ వెంబడి దాడులకు పాల్పడేందుకు పెద్ద సంఖ్యలో టెర్రరిస్టులు వేచివున్నారని తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి భారత్‌లోకి చొరబాటు దారులను పంపేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. జమ్మూ-కాశ్మీర్‌లో 2017లో 515 చొరబాటు ఘటనలు చోటు చేసుకున్నాయని, 75 మంది తీవ్రవాదులను మట్టుపెట్టామని తెలిపారు. 2016లో 454 చొరబాటు ఘటనలు చోటు చేసుకోగా, 45 మంది తీవ్రవాదులను హతమార్చినట్టు తెలిపారు. జమ్మూ రీజియన్‌లో భారత్-పాక్ సరిహద్దు వెంబడి పాక్ దళాలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి జరిపిన కాల్పులలోఒక్క జనవరి నెలలోనే 8 మంది పౌరులు, ఆరుగురు భద్రతా సిబ్బంది హత్యకు గురయ్యారు. దాదాపు 70 మందికి గాయాలయ్యాయని తెలిపారు.

పెట్టుబడులు పెట్టండి.. అవకాశాలు కల్పిస్తాం

భారత్-కొరియా వాణిజ్య శిఖరాగ్ర సదస్సులో మోడీ



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారు. ప్రపంచంలో పెట్టుబడులకు అత్యంత అవకాశాలున్న దేశాలలో భారత్ ఒకటని చెప్పారు. ప్రపంచంతో వ్యాపారం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉన్నదని చెప్పారు. భారత్-కొరియా వాణిజ్య శిఖరాగ్ర సమావేశంలో మోడీ మాట్లాడుతూ, సుస్థిర వాణిజ్య వాతావరణాన్ని సృష్టించేందుకు, నిర్ణయాలను తీసుకోవడంలో అడ్డంకులను తొలగించే దిశగా భారత ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. "రోజువారీ లావాదేవీలలో మేము మరింత సానుకూలతను కోరుతున్నాం. అనుమానాలన్నింటిని నివృత్తి చేసి మరింత విశ్వాసాన్ని పాదుకొల్పే విధంగా మేము కృషి చేస్తున్నాం. ఇవన్నీ కూడా భారతదేశ వైఖరిని పూర్తిగా మార్చివేస్తాయి" అని మోడీ తెలిపారు. విద్యుత్ కొనుగోలుకు సంబంధించి భారత్ ఇప్పటికే మూడో పెద్ద దేశంగా అవతరించిందని అన్నారు. "చాలా తొందరలో నామినల్ జీడీపీతో ప్రపంచంలోనే ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. నేడు ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కూడా భారత్ ఉన్నది" అని మోడీ తెలిపారు. " స్టార్టప్ ఎకో వ్యవస్థ కలిగిన పెద్ద దేశాలలో కూడా మాది ఒకటి" అని చెప్పారు. ప్రభుత్వం డీ రెగ్యులేషన్, డీ లైసెన్సింగ్ క్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. పరిశ్రమల లైసెన్సుల చెల్లుబాటు కాలాన్ని మూడు ఏళ్ల నుంచి 15 ఏళ్లు, అంతకన్నా ఎక్కువకు పెంచుతున్నామని తెలిపారు.

"మీరు గ్లోబ్‌ని కనుక చూసినట్లైతే, మూడు ప్రధానాంశాలు కలిగిన కొద్ది దేశాలను మాత్రమే చూడగలుగుతారు. ఆ అంశాలు : ప్రజాస్వామ్యం, జనాభా, డిమాండు. భారత్‌లో మీరు ఆ మూడింటిని చూస్తారు" అని మోడీ చెప్పారు. కొరియాతో వ్యాపారం చేసేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉందని, మీ పెట్టుబడులు పెంచేందుకు, కాపాడేందుకు ఏదైతే చేయాలో అదంతా చేస్తామని కొరియా వాణిజ్యవేత్తలకు మోడీ హామీ ఇచ్చారు.

ఎస్‌బీఐ సర్వర్ డౌన్!

ముంబై : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు ఆటంకం కలుగుతున్నది. ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నప్పటికీ ఎస్‌బీఐ అధికారులు సకాలంలో దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మందగించింది. కొన్నిసార్లు నెట్‌వర్క్ స్తంభిస్తున్నది. ముంబై కేంద్రంలోని సర్వర్‌లో సమస్య కారణంగా ఈ పరిస్థితి ఉత్పన్నమవుతున్నదని ఎస్‌బీఐ అధికారులు చెప్తున్నప్పటికీ సమస్యను పూర్తిగా పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవడం లేదు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు ఎస్‌బీఐ నోడల్ బ్యాంక్‌గా ఉంది. స్థిరాస్తి రిజిస్ట్రేషన్‌కు ఆస్తి మార్కెట్ విలువలో ఆరు శాతం మొత్తాన్ని స్టాంప్, రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాలి. దీనిని చలానా రూపంలో ఎస్‌బీఐ బ్యాంకుకు చెందిన ఏ బ్రాంచీ నుంచైనా చెల్లించవచ్చు. చలానాను జనరేట్ చేసుకుని ఈ-స్టాంప్ విధానంలో ఫీజును ఆన్‌లైన్‌లోనే చెల్లించవచ్చు. ఆ చలానా కాపీని తీసుకుని డాక్యుమెంట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. లేదా చలానాను ఆన్‌లైన్‌లో జనరేట్ చేసుకుని ఆఫ్ లైన్‌ద్వారానే నేరుగా బ్యాం కులో ఫీజును జమచేయవచ్చు. అయితే బ్యాంకులు తమకు ఫీజు ముట్టినట్లు రశీదు ఇస్తేనే గానీ రిజిస్ట్రేషన్ జరుగదు. ముంబైలో సర్వర్ సమస్యలను సరిచేయకపోవడం వల్ల చలానా రశీదులు జనరేట్ కాక సోమవారం రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి.

జమ్మూలో పోలీసులపై దాడి ఐసీస్ పనే

శ్రీనగర్ : జమ్మూ పోలీసు శిబిరంపై సోమవారం జరిగిన దాడి ఐఎస్ఐఎస్ పనేనని శ్రీనగర్ పోలీసులు తెల్పి చెప్పారు. హురియత్ నాయకుడు ఫజల్ హక్ కురేషి నివాసానికి కాపలాగా ఉన్న పోలీసు ఫరూక్ అహ్మద్‌ను కాల్చి అతని ఆయుధాన్ని ఎత్తుకుపోయా రన్నారు. దీన్ని ధృవ పరుస్తూ ఐసీస్ సంబంధించి అల్ అమఖ్ వార్తా ఏజెన్సీ తమదే బాధ్యత అంటూ, ఇప్పుడే యుద్ధం మొదలైందని ప్రకటించింది. నిషేధిత ఉగ్రసంస్థ కాల్పుల్లో పాల్గొనడం ఆందోళన కలిగిస్తోందని రాష్ట్ర పోలీస్ చీఫ్ ఎస్పీ వాయిద్ వెల్ల డించారు. గతేదాది ఆయన ఐఎస్ఐఎస్ జాడలు లేవని ప్రకటించిన విషయం తెలిసిందే.

రుణాలు ఎగ్గొడుతున్నవి ప్రైవేటు సంస్థలే కదా!

ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్ కుమార్



ముంబై : 'అద్దాల మేడల్లో ఉండేవారు అవతలి వారిపై రాళ్లు విసరొద్దు' అని ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటు పరం చేయాలని డిమాండ్ చేస్తున్న విమర్శకులపై భారతీయ స్టేట్ బ్యాంకు ఛైర్మన్ రజనీశ్ కుమార్ విరుచుకుపడ్డారు. ప్రభుత్వ సంస్థల్లోనే అత్యున్నత పరిపాలనా ప్రమాణాలు పాటిస్తున్నారని... ఇప్పుడున్న మొండి బకాయిలు, తక్కువ స్థాయి ప్రమాణాలున్న కేసులు దాదాపు ప్రైవేటు రంగంలోనే ఉన్నాయని పేర్కొన్నారు.'ప్రైవేటు రంగంలోని సంస్థల్లో కార్పొరేట్ పరిపాలనా విధానాలు చాలా బాగుంటే ప్రభుత్వ రంగంలోని ఏ సంస్థ ఇప్పుడు ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్) వద్ద ఉందో చెప్పాలి' అని రజనీశ్ అన్నారు. ప్రస్తుతం లా ట్రిబ్యునల్ వద్ద ఉన్న కంపెనీలన్నీ ప్రైవేటువే కదా అని ఉదహరించారు. 'రుణ ఎగవేతదారులంతా వారి పరిశ్రమకు సంబంధించిన సంఘాల్లో ముందు వరుసలో కూర్చుకుంటారు. అందరికీ హితబోధలు చేస్తారు. ఈ కాలం లో జరుగుతున్నదంతా ఇదే కదా' అని రజనీశ్ పేర్కొన్నారు. ఎగవేతదారులంతా ముందు వరుసలో బ్యాంకర్లంతా వెనక వరుసలో ఎందుకు కూర్చోవాలని ఆయన ప్రశ్నించారు. వజ్రాల వ్యాపారి, విలాస పురుషుడు నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.11,400 కోట్ల మేర మోసం చేసి విదేశాలకు పారిపోయిన నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థపై విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పాలనా విధానాలు పటిష్ఠంగా లేవని, ప్రమాణాలు ఘోరంగా ఉన్నాయని, ప్రభుత్వ రంగ బ్యాంకులు ఎక్కువగా అవసరం లేదని కొటక్ మహీంద్రా బ్యాంకు ఎక్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఉదయ్ కొటక్ విమర్శించారు. మరికొందరు వ్యాపార వేత్తలు సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలపై విమర్శలు చేస్తున్న వారిపై ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్ ప్రతి విమర్శలు చేశారు. సమాజం మెరుగుపడేందుకు ప్రభుత్వ సంస్థలు కచ్చితమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. 'పట్టణాలకు దూరంగా, పల్లెల్లో, ఇబ్బందికరమైన పరిస్థితుల్లో శాఖలను నడుపుతున్న ప్రైవేటు సంస్థలు ఏమైనా ఉన్నాయా' అని ఆయన ప్రశ్నించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు... ప్రజలు, బ్యాంకింగ్ వ్యవస్థ నమ్మకం పోగొట్టే పని చేస్తుందని తాను భావించడం లేదని అన్నారు.

ప్రేమోన్మాది దాడిలో గాయపడ్డ బాలిక మృతి

మధురై : ప్రేమోన్మాది నిప్పంటించండంతో తీవ్రగాయపడి వారం రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 14 ఏళ్ల బాలిక మంగళవారం కన్నుమూసిందని పోలీసులు తెలిపారు. మధురైలోని రాజాజీ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమె ఆమె చికిత్స పొందుతూ మృతిచెందిందని చెప్పారు. తనతో వివాహానికి నిరాకరించిందన్న కారణంతో ఆ వ్యక్తి ఈ నెల 16న పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వస్తున్న ఆ బాలికపై పెట్రోలు పోసి నిప్పంటించాడని తెలిపారు.

పాక్ దాడిలో ఇద్దరు జవాన్లకు గాయాలు

జమ్మూ : జమ్మూ, కాశ్మీర్‌లోని పూంచ్, రాజౌరీ జిల్లాల్లోని నియంత్రణ రేఖ వెంబడి భారత స్థావరాలు, జనావాసాలపై పాకిస్తాన్ సైన్యం మంగళవారం బాంబులతో దాడి చేసింది. ఈ దాడిలో ఇద్దరు జవానులు గాయపడ్డారు. బీంబెహర్ సెక్టార్‌లో ఉదయం 8.50 గంటలకు మోర్టార్ బాంబులు, ఆటోమాటిక్ ఆయుధాలతో విచక్షణారహితంగా దాడి చేసి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆర్మీ అధికారి తెలిపారు. భారత జవానులు వెంటనే ఎదురు కాల్పులు జరిపారని తెలిపారు.

హజ్ యాత్రకు విమాన చార్జీల తగ్గింపు

న్యూఢిల్లీ : హజ్ యాత్రకు విమాన చార్జీలు తగ్గిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. హజ్ యాత్రపై పీఎంఓ దృష్టి సారించిందని, యాత్రికులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటున్నట్టు కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి ముక్తర్ అబ్బాస్ నక్వి విలేకరులకు తెలిపారు. భారత్ నుంచి 21 విమానాశ్రయాల నుంచి జెడ్డా, మదీనాలకు వెళ్లే ఎయిర్ ఇండియా, సౌదీ ఎయిర్‌లైన్స్‌లలో ప్రయాణించే యాత్రికులకు ఈ చార్జీల తగ్గింపు వర్తిస్తుందని చెప్పారు.

ఎక్సైజ్ పోలీసుస్టేషన్ల ఏర్పాటుకు ఒడిశా ప్రభుత్వం చర్యలు

భువనేశ్వర్ : ఒడిశాలో అన్ని జిల్లాల్లో ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల ఏర్పాటుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు ప్రతిపాదనపై ఇప్పటికే తుదినిర్ణయం చేసినట్టు 48 వ రాష్ట్ర ఎక్సైజ్ స్పోర్ట్స్ మీట్ విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ మంత్రి ఎస్‌బీ బెహ్రా తెలిపారు. ఒడిశాలోని వివిధ ప్రాంతా ల్లో వీటి ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ఎక్సైజ్ పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేస్తే అక్రమ మద్యం వ్యాపారానికి కళ్లెం పడుతుందని చెప్పారు.

రాజస్థాన్‌లో 63.36 లక్షలమందికి పెన్షన్

జైపూర్ : రాజస్థాన్‌లో వృద్ధులు, వికలాంగులు, వితంతువులతోపాటు 63.36 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛను అందిస్తున్నట్టు ఆ రాష్ట్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి అరుణ్ చతుర్వేది మంగళవారం తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయం సందర్భంగా పింఛనుపై అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా బదులిచ్చారు. వృద్ధులకు 48.92 లక్షలు, 4.14 లక్షల మంది వికలాంగులకు పింఛను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

రూ.32.4 లక్షల విలువైన బంగారం స్వాధీనం

కోజికోడ్ : కోజికోడ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.32.4 లక్షలు విలువైన ఒక కిలో బంగారాన్ని ఒక మహిళ నుంచి స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్టు చేశారు. కైరాపూర్ సమీపంలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి మస్కట్ నుంచి వచ్చిన ఆమెను తనిఖీ చేసిన సందర్భంలో పట్టుబడినట్టు చెప్పారు. ఆమె వద్ద నుంచి రూ.32.34 లక్షల విలువైన 1,044 గ్రాముల రెండు బంగారు చైన్లు, నాలుగు గాజులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఆయుధాల మాయం కేసులో ఏఎస్ఐ అరెస్టు

బాటలా : పంజాబ్‌లోని న్యూకోర్టు కాంప్లెక్స్‌లో ఆయుధాల భద్రతా స్టోరేజి నుంచి కన్పించకుండా పోయిన కేసులో అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ (ఏఎస్ఐ)ను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. స్టోరేజి ఇన్‌చార్జి ఏఎస్ఐ సురేందర్‌జిత్ సింగ్ నిర్లక్ష్యం వల్లే 2.33 బోర్ రివాల్వర్లు, పిస్తోల్ కన్పించకుండాపోయినట్టు విచారణలో తేలిందని, ఆయనపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురి మృతి

ముంబై : మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో మంగళవారం తెల్లవారు జామున నిలిపి ఉన్న ఎస్‌యూవీ వాహనాన్ని వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో ఐదుగురు మృతిచెందగా, ఏడుగురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. హగ్లూర్ గ్రామం సమీపంలో తుల్జాపూర్- పండాపూర్ రోడ్డులో ఎస్‌వీయూ వాహనం టైరు పగలటంతో రోడ్డు పక్కన నిలిపి ఉంచారని చెప్పారు. రెండు వాహనాల్లో ప్రయాణీకులు ఉన్నారని తెలిపారు. గాయపడిన వారిని చికిత్స కోసం వెంటనే తుల్జాపూర్ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

మట్టి పెళ్లలు విరిగిపడి తల్లీకూతుళ్లు మృతి

సంబాల్ : ఉత్తరప్రదేశ్‌లోని సంబాల్ జిల్లాలోని రాయ్‌పూర్ కాలా గ్రామంలో మట్టి పెళ్లలు విరిగిపడి తల్లీకూతుళ్లు మృతిచెందగా, ఒకరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. వీరు గ్రామంలోని చెరువు వద్ద మట్టి తవ్వకాలు జరుపుతుండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. గాయపడిన వ్యక్తి ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించినట్టు తెలిపారు.

పెరుగుతున్న ప్రైవేటు వర్సిటీలపై కన్నేయండి

ఈటానగర్ : విద్యా ప్రమాణాలు పాటించని ప్రైవేటు విశ్వవిద్యాలయాల సంఖ్య అరుణాచల్‌ప్రదేశ్‌లో పెరుగుతోందని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర గవర్నర్ బీడీ మిశ్రా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీ పర్యటన సందర్భంలో ఆయన కేంద్ర హెచ్‌ఆర్‌డీ మంత్రి ప్రకాష్ జవదేకర్‌ను కలిశారని, రాష్ట్రంలో ఉన్నత విద్యకు సంబంధించిన అంశాలపై చర్చించారని మంగళవారం అధికారిక ప్రకటన విడుదలైంది.

'బిగ్ వణక్కం' : కమల్‌హాసన్



చెన్నై : విలక్షణ నటుడు కమల్‌హాసన్ 'మక్కళ్ నీది మయ్యమ్' (జస్టిస్ ఫర్ పీపుల్) పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ నెల 21న తమిళనాడులోని ఒత్తకడై మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరైన లక్షమంది ప్రజానీకానికి ధన్యవాదా లంటూ ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటనను విడుదల చేశారు. 'బిగ్ వణక్కం' అంటూ తమిళ స్టైల్‌లో పార్టీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు, అనేకమంది ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ముజఫర్‌నగర్ అల్లర్లపై బీహార్ అసెంబ్లీ రసాభాస

పాట్నా : ముజఫర్‌నగర్‌లో ఇటీవల తొమ్మిది మంది చిన్నారుల మృతికి సంబంధించిన కేసుపై జరిగిన అల్లర్ల నేపథ్యంలో మంగళవారం బీహార్ శాసనసభలో ప్రతిపక్షాలు ఈ అంశాలు లేవనెత్తడంతో బడ్జెట్ సెషన్ రెండవ రోజు రసాభాసగా మారింది. చిన్నారుల మృతి ఘటనపై ప్రభుత్వం బదులివ్వాలని డిమాండు చేస్తూ నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు.

ఎఫ్ఎస్ఏ అమలులో విఫలమైన పుదుచ్చేరి ప్రభుత్వం

పుదుచ్చేరి : ఆహార భద్రత చట్టం (ఎఫ్ఎస్ఏ) అమలుపరచడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందంటూ ప్రతిపక్ష అన్నాడీఎంకే ఆరోపించింది. మంగళవారం అన్నాడీఎంకే శాసనసభా పక్ష నేత అంబాలగన్ విలేకరులతో మాట్లాడుతూ, కేంద్రపాలిత ప్రాంతంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మొత్తం 62.5 శాతం కుటుంబాలు లబ్ధి పొందాలన్న లక్ష్యాన్ని అధిగమించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.



ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి


సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పీజే చంద్రశేఖర్‌రావు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ మార్చి 6వ తేదీన చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. కర్నూలులోని స్థానిక సీఆర్ భవన్‌లో మంగళవారం జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి ఇచ్చిన పిలుపుతో మార్చి 2,3,4 తేదీల్లో జిల్లావ్యాప్తంగా నియోజకవర్గ, మండల స్థాయిలో రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తేనే రాష్ట్రంలో జాతీయ విద్యాసంస్థలు, కొత్త పరిశ్రమలు రావడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం జరిగే ఈ ఉద్యమాల్లో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీ రామచంద్రయ్య, కే రామాంజనేయులు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బీ గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్ రసూల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పీ భీమలింగప్ప, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నభిరసూల్, బాబాఫకృద్దీన్, కే జగన్నాథం, పీ గోవిందు, గురుదాసు, భాగ్యలక్ష్మి, రంగనాయుడు, రాధాకృష్ణ, ఎన్. మనోహర్ మాణిక్యం, చంద్రశేఖర్, పంపన్న గౌడ్, భాస్కర యాదవ్, పీ. సుంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఊరు మీదపడ్డ గజరాజుల గుంపు

విశాలాంధ్ర - హిరమం డలం: శ్రీకాకు ళం జిల్లా హిర మండలంలోని గార్లపాడు పంచాయతీ కురిడివలస గ్రామంలో మంగళవారం ఒక్కసారి 8 ఏనుగుల గుంపు గ్రామంలో చొరబడటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో నాలుగు ఏనుగుల గుంపు పొన్నుటూరు గ్రామ సమీపంలో పంటలను ధ్వంసం చేశాయి. కొత్తగా మరో ఎనిమిది ఏనుగుల గుంపు గ్రామంలో రావడంతో పంటలు నాశనం చేస్తాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారి తిరుపతిరావు, బీట్ అధికారి సవర తుంబేసు, కేర్‌టేకర్‌లు ఈ ప్రాంతంలో సంచరిస్తూ స్థానికులను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపులో రెండు మగ, నాలుగు ఆడ, రెండు పిల్ల ఏనుగులు ఉన్నాయి. పిల్ల ఏనుగుల్లో ఒకటి రెండేళ్ల వయస్సు, మరొకటి రెండు నెలల వయస్సు ఉంటుందని అంచనా. వీటిని ఫొటోలు తీయరాదని అటవీ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో సంచరిస్తున్న నాలుగు ఏనుగుల్లో అన్నీ ఆడ ఏనుగులే కావడం గమనార్హం. ఈ రెండు ఏనుగుల గుంపులూ కలిస్తే ఏం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏడాది క్రితం ఒడిశా నుంచి ఎనిమిది ఏనుగుల గుంపు మందస, పలాస, మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేశాయని, ఇప్పుడు హిరమండలంలో ఎలాంటి ముప్పు తెచ్చిపెడతాయోనని స్థానికులు, రైతులు భయపడుతున్నారు.

కొడుకు, కోడలు మృతితో వృద్ధ దంపతుల ఆత్మహత్య



విశాలాంధ్ర - గంగాధరనెల్లూరు : చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు మండలంలోని బాలగంగనపల్లి పంచాయతీకి చెందిన బట్టుజంగన పల్లిలో కొడుకు, కోడలు మృతిని జీర్ణించుకోలేని వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం ఇరగమరెడ్డి (90), ఆదెమ్మ (80) దంపతులకు కొడుకు జయరామిరెడ్డి(50), కోడలు సరోజమ్మ (45) ఉన్నారు. ఆరు నెలల క్రితం వీరు తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో వృద్ధ దంపతులు నిత్యం వారిని గుర్తు చేసుకుంటూ తీవ్రంగా మదనపడేవారు. ఈ నెల 25వ తేదీన ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఇరగమరెడ్డి, ఆదెమ్మ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. గంగాధరనెల్లూరు ఎస్సై రాజశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దళిత మహిళా నేతపై టీడీపీ నేత దాడి

విశాలాంధ్ర- మంగళగిరి : అమరావతి రాజధాని ప్రాంతంలోని మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ నేత ఆదే పార్టీకి చెందిన దళిత మహిళా నేతను అత్యంతహీనంగా కులం పేరుతో దూషిస్తూ దాడి చేయడంపై మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు కింద కేసు నమోదు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి ఇంటి వద్దకు వెళ్లిన తనను పార్టీకి చెందిన పోలవరపు హరిబాబు కులం పేరుతో దుర్భాషలాడుతూ దాడి చేశారని అదే పార్టీ దళిత మహిళా నేత దర్శి వనరాణి మంగళవారం ఉదయం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో హరిబాబుపై 323, 506,509 ఐపీసీ సెక్షన్ 3(1),(ఆర్)(ఎస్), ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 2015 కింద కేసులు నమోదు చేసినట్టు పట్టణ సీఐ హరికృష్ణ తెలిపారు. ఇప్పటికే హరిబాబుపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు వున్నాయి. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం చేయడం, భూ కబ్జా కేసుల్లో హరిబాబు నిందితుడిగా ఉన్నాడు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటు కూడా ఉంది. ఈ సందర్భంగా వనరాణి మాట్లాడుతూ ఇన్‌చార్జి చిరంజీవి నివాసం వద్దకు తాను వెళ్లిన సమయంలో పోలవరపు హరిబాబు అక్కడకు వచ్చి నీవు ఎందుకు వచ్చావంటూ బూతు పదాలతో కులం పేరుతో దుర్భాషలాడుతూ తనపై దాడి చేశారన్నారు. హరిబాబుపై ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు, ఎంఆర్పీఎస్, ఎస్సీ,ఎస్టీ రైట్స్ యాక్ట్ ప్రచార సమితులతో పాటు పలువురు దళిత సంఘాల నేతలు ఆమెకు మద్దతు తెలిపారు. దళిత మహిళా నేతపై దాడి చేయడాన్ని నిరసిస్తూ ఇకపై నియోజకవర్గంలో జరిగే దళితతేజం కార్యక్రమంలో తాము పాల్గొనబోమని పార్టీకి చెందిన దళిత సంఘాల నేతలు ప్రకటించారు.

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు



విశాలాంధ్ర - కాకినాడ : తూర్పుగోదావరి జిల్లా పోలీసుల ఎదుట ముగ్గురు మావోయిస్టులు లొంగిపోయారు. ఎటపాక డివిజన్ పరిధిలో మరో మావోయిస్టును అరెస్టు చేశారు. కాకినాడలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విశాల్‌గున్నీ మంగళవారం వివరాలను మీడియాకు వెల్లడించారు. 2014వ సంవత్సరం వరకు పోలంపల్లి, కుంటదళంలో పనిచేసిన కూరం భీమ, గొల్లపల్లి ఎల్వోసీలో దళ సభ్యునిగా పనిచేసిన సోడి మల్లేష్, పోలంపల్లి ఎల్వోసీ నందు దళ సభ్యునిగా పనిచేసిన పద్దమ్ మల్లలు లొంగిపోయారన్నారు. పీఆర్పీఎఫ్ జవాన్లతో జరిగిన ఎదురు కాల్పుల్లో వీరు పాల్గొన్నట్టు వివరించారు. ఎటపాక కన్నయ్యగూడెం వద్ద వాహనాల తనిఖీలో మావోయిస్టు, మిలిషియా సభ్యుడు ముస్సికి పాండును అరెస్టు చేసి అతని వద్ద కరపత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శాతవాహన ఎక్స్‌ప్రెస్ 10వ నంబరు ప్లాట్‌ఫామ్ నుంచి బయలుదేరును



విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్లే శాతవాహన ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ మార్చి ఒకటో తేదీ నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు 10వ నంబరు ప్లాట్‌ఫామ్ లో బయలుదేరు తుందని రైల్వేస్టేషన్ డైరెక్టర్ సిహెచ్. సురేష్ మంగళవారం ఇక్కడ ఒక ప్రకటనలో తెలిపారు. శాతవాహన ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం రోజూ 6వ నంబరు ప్లాట్‌ఫామ్ నుంచి బయలుదేరుతుంది. ఈ ప్లాట్‌ఫామ్‌లో ఫిట్‌లైన్ మరమ్మత్తుల దృష్ట్యా 45 రోజుల పాటు ఈ మార్పును ప్రయాణికులు గమనించాలని కోరారు.

ఆ రీచ్‌లో రాత్రుళ్లే తవ్వకాలు

- కళ్లేపల్లిలో ఇసుక మాఫియా బరితెగింపు
- గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు
- రాజకీయ ఒత్తిళ్లతో సెలవుపై మైనింగ్ ఏడీ?



విశాలాంధ్ర బ్యూరో - శ్రీకాకుళం : ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. విశాఖపట్టణంలో ఇసుక అవసరాల పేరుతో శ్రీకాకుళం రూరల్ మండలం కళ్లేపల్లి వద్ద నాగావళి నది నుంచి నిబంధనలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి వేళ లారీల్లో ఇసుక తరలిస్తున్నారు. పెద్ద శబ్దాలతో పాటు దుమ్మూ ధూళి ఎగిసిపడటంతో కళ్లేపల్లి గ్రామస్తులకు కంటి మీద కునుకు లేకుండాపోతోంది. ఉదయాన్నే ఇళ్లనీ దుమ్ముతో నిండి పోవడంతో చేసేది లేక గత సోమవారం వారు మూకు మ్మడిగా కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మైనింగ్ శాఖకు కలెక్టర్ నుంచి ఆదేశాలు చేశాయి. ఆ శాఖ సిబ్బంది చర్యలకు సిద్ధం కావడంతో ఇసుక రవాణాదారులు రాజకీయ నేతలను ప్రయోగించారు. వారి నుంచి ఒత్తిడి లేక గనులు, భూగర్భశాఖ శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ తమ్మునాయుడు ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టు సమాచారం. దీర్ఘకాలిక సెలవు తీసుకునేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. గతంలోనూ ఎచ్చెర్ల మండలం ముద్దాడపేట ర్యాంపు విషయంలో జిల్లాలోని ఇద్దరు మంత్రుల మధ్య నలిగిపోయిన తమ్మునాయుడు తాజా నిర్ణయం జిల్లాలో కలకలం రేపుతోంది. నాలుగు రోజులుగా ఏడీ సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ కావడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

పేరుకే క్వారీ అనుమతులు

విశాఖపట్టణంలోని ఓ బహుళ జాతి సంస్థ నిర్మాణం కోసమని ఏడాది క్రితమే కళ్లేపల్లి ర్యాంపునకు కొందరు పెద్దలు అనుమతి తెచ్చుకున్నారు. ఇక్కడి ఇసుకను సంబంధిత సంస్థకు మాత్రమే తరలించే అనుమతి వుంది. ఆ సంస్థ పేరుతో ప్రైవేటు లారీల్లో ఇతర అవసరాలకు అమ్మకాలు చేపట్టారు. ధర రూ.2,500కు మించకూడదని ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ లారీ లోడింగ్ పేరుతో ఒక్కో లారీ నుంచి రూ.ఏడు వేలు దండుకోవడం గత ఏడాది నుంచీ కొనసాగుతోంది. ఈ ర్యాంపులో 32,500 క్యూబిక్ మీటర్ల మేర ఇసుక తవ్వకాలకు అనుమతి ఉన్నప్పటికీ ఆ నిబంధనకు ఎప్పుడో కాలం చెల్లిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రివేళల్లో ఇసుక తవ్వకాలు నిషేధం. కళ్లేపల్లిలో పగలంతా ఏమీ జరగనట్లే వుంచి రాత్రివేళల్లో నదిలోనే నేరుగా పెద్ద యంత్రాలతో లారీల్లో లోడింగ్ చేస్తున్నారు. యంత్రాల వినియోగం నిషిద్ధమని తెలిసినప్పటికీ కొందరు అధికారుల అండదండలతోనే ఈ తంతు నడిపిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ ర్యాంపునకు శ్రీకాకుళం పట్టణం మీదుగానే వాహనాలు రాకపోకలు సాగించాల్సి ఉంది. పగటి వేళ పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నాయి. రాత్రివేళల్లో ఇసుక రవాణా నిషేధం. అలాంటప్పుడు ఈ ర్యాంపునకు అనుమతి ఇవ్వడంలోనే మతలబు కనబడుతోంది. ఈ ర్యాంపు పక్కనున్న కళ్లేపల్లి గ్రామస్తులకు రాత్రి వేళ వాహనాల మోతతో చుక్కలు కనబడుతున్నాయి. దీంతో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసి రెండు వారాలవుతున్నా చర్యలు తీసుకోకపోవడంతో వారంతా స్థానిక ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికి ఫిర్యాదు చేశారు. తనకు తెలియకుండా తన నియోజకవర్గంలో ఇసుక ర్యాంపు ఎలా కేటాయించారని ఆమె అవాక్కయినట్లు సమాచారం. ఆమెకు తెలియకుండా, ఆమె నివాసం ఉంటున్న అరసవల్లి పైనుంచే పదుల సంఖ్యలో లారీలు ఎలా వెళ్తాయనేది కళ్లేపల్లి వాసుల సందేహం.

ప్రభుత్వ ఆదేశాలు అమలు చేసే ప్రయత్నంలో..

ప్రజలకు ఇబ్బంది కలగని రీతిలోనే ఇసుక ర్యాంపులు కొనసాగాలన్న కలెక్టర్ సూచనల నేపథ్యంలో కళ్లేపల్లి ర్యాంపునకు అనుమతులను రద్దు చేసేందుకు మైన్స్ ఏడీ తమ్మునాయుడు సిద్ధమయ్యారు. అయితే ఈ ర్యాంపు మూసివేతకు వీలు లేదంటూ ప్రభుత్వంలోని కొందరు పెద్దలు రంగంలోకి దిగారు. ర్యాంపును మూసివేయలేని పరిస్థితుల్లో కలెక్టర్‌కు ఏడీ నోట్ పెట్టినట్లు తెలుస్తోంది. తాము చెప్పినా వ్యతిరేక నివేదిక ఇచ్చిన ఏడీని సాగనంపాలని రాజకీయ నేతలను ప్రయోగించినట్టు సమాచారం. ఏడీని సెలవుపై వెళ్లిపోవాలని ఒత్తిడి పెంచి నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నట్లు చెబుతున్నారు. నాలుగు రోజులుగా సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ కావడం ఈ ప్రచారానికి బలం చేకూరుతోంది.

విశాఖపట్టణం నుంచి తమకు అనుకూ లమైన అధికారిని రెండు నెలలపాటు ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేసేలా పావులు కదిపినట్లు తెలుస్తోంది. ఒకట్రెండు రోజుల్లో ఇదే విషయమై ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్టు ప్రచారం సాగుతోంది.



11,500 కిలోల గంజాయి దహనం

విశాలాంధ్ర-విశాఖసిటీ : విశాఖ జిల్లాలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న 85 గంజాయి కేసులకు సంబంధించి 11 పోలీస్‌స్టేషన్లలో 11,493 కిలోల గంజాయిని మంగళవారం దహనం చేసినట్టు డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ డి.ఐ.జి శ్రీకాంత్ చెప్పారు. కోర్టు అనుమతితో డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ మారికవలస డంపింగ్ యార్డు వద్ద గంజాయిని దహనం చేసినట్టు ఆయన ఇక్కడ వివరించారు. అనకాపల్లి సబ్ డివిజన్‌లోని అనకాపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 11, చోడవరంలో 12, మాడుగులలో 51, బుచ్చయ్యపేటలో 11 కేసుల్లో దొరికిన 11,493 కేజీల గంజాయిని దహనం చేశారు. జిల్లాలో నమోదైన 1,100 కేసులకు సంబంధించి 1,50,00 కేజీల గంజాయి ప్రస్తుతం వివిధ పోలీస్‌స్టేషన్లలోనే ఉందన్నారు. త్వరలో కోర్టు అనుమతితో దానిని కూడా దహనం చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులైన జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ సి.హెచ్.గోపాలకృష్ణ, అనకాపల్లి డీఎస్పీ కె.విరమణ, డీఎస్పీ సి.హెచ్.వివేకానంద, ఇన్‌స్పెక్టర్లు వై.మరళీరావు, ఎం.శ్రీని వాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీమలోనే హైకోర్టు పెట్టండి

కర్నూలులో 150 మంది న్యాయవాదుల రిలే దీక్ష

విశాలాంధ్ర - కర్నూలు లీగల్ : రాయలసీమలోని కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ శ్రీ కృష్ణదేవరాయ విగ్రహం వద్ద రిలే నిరాహారదీక్షలు మంగళవారం 38వ రోజుకు చేరాయి. 150 న్యాయవాదులు మూకుమ్మడిగా దీక్ష చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగలక్ష్మి దేవి, ప్రధాన కార్యదర్శి బాబూసాహెబ్ ఆధ్వర్యంలో న్యాయవాదుల దీక్షకు వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు, పారిశ్రామిక వేత్తలు, ప్రజాప్రతినిధులు సంఘీభావం తెలిపారు. వైసీపీ నాయకులు అఫిజ్‌ఖాన్, పారిశ్రామికవేత్త టీజీ భరత్, కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరయాదవ్, డాక్టర్ బాలమద్దయ్య, రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థులు, ఆటో వర్కర్స్ నాయకులు, డాక్టర్లు పుల్లన్న, ప్రవీణ్‌కుమార్, యశోధ హాస్పిటల్ డాక్టర్ నాయక్ శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు.



ఈ సందర్భంగా రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రవిగువేరా, మత్స్యకారుల సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామస్వామి, పాలూరి శ్రీనివాసులు మాట్లాడుతూ రాయలసీమకు హైకోర్టు వచ్చే వరకు న్యాయవాదులు సంఘటితంగా ఉద్యమించాలని కోరారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో అమరావతితే అభివృద్ధి చేస్తే అనేక ఇబ్బందులు, నష్టాలు వచ్చే పరిస్థితి ఉందన్నారు. దీక్షల్లో మురళీమనోహర్, శ్రీవత్స, రంగరవికుమార్, శివశంకర్‌రెడ్డి, మోహన్‌బాబు, ప్రసాద్, జగన్, శ్రీధర్, కృష్ణమూర్తి, ఓంకార్, చంద్రశేఖర్, ఇందుమతి, రామశేషన్న, బారెడ్డి నారాయణరెడ్డి, మధుబాబు, సుల్తాన్‌మియా, బాలు, కాశీ విశ్వనాథ్, మేరీ సంతప్‌కుమారి, కృష్ణనాయక్, వీరన్న, సువర్ణరెడ్డి, మనోహర్, కమతం ప్రభాకర్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, బసవరాజు, బాల రంగస్వామి, రామచంద్రారెడ్డితో పాటు న్యాయ వాదులు పాల్గొ న్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మల్లెల రాజశేఖర్ దీక్షలోని న్యాయవాదులకు నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు.



పోలవరం ప్రాజెక్టు ఖర్చు తగ్గింపునకు

ప్రత్యామ్నాయమార్గాలు అన్వేషిస్తాం

పాజెక్టు అంచనాల కమిటీ ఛైర్మన్ వేణుగోపాలరెడ్డి

విశాలాంధ్ర- పోలవరం : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఖర్చు తగ్గించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తామని ప్రాజెక్టు అంచనాల కమిటీ ఛైర్మన్ మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, శాసనసభ అంచనాల కమిటీ సభ్యులు చిక్కాల రామచంద్రరావుతో కలిసి మంగళవారం పోలవరం ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. తొలుత ప్రాజెక్టు కార్యాలయంలో ప్రాజెక్టు నమూనాను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టులోని హెలిప్యాడ్ వద్దనున్న హిల్ వ్యూ ప్రాంతం నుంచి ప్రాజెక్టును చూశారు. గోదావరి నదీతీరంలోని లోయర్ కాపర్ డ్యామ్ పనులను పరిశీలించారు. పనుల వివరాలను ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు, రమేష్‌బాబు బృందానికి వివరించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో సంబంధిత ఇంజినీర్లు, అధికారులతో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంలో ఖర్చు తగ్గింపు కోసం ప్రత్యామ్నాయ మార్గాలు, నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరిగాయా అనే విషయాలను నిర్ధారణ చేసి అసెంబ్లీలో నివేదిక ఇవ్వనున్నామన్నారు. తీర్మానం అనంతరం నిధులు ఎంత అవసరం అవుతాయో అసెంబ్లీకి, ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత అంచనాల కమిటీపై ఉందన్నారు. వారం రోజుల్లోగా ప్రాజెక్టు పనులపై నివేదికను విజయ వాడ సమావేశంలో ఉన్నతాధికారుల వద్ద ప్రవేశ పెడతామన్నారు. రాష్ట్ర బడ్జెట్‌కు ముందుగానీ, తర్వాత గానీ ప్రాజెక్టు విషయాలపై పూర్తి చర్చలు ఉంటాయన్నారు. సమావేశంలో ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజినీర్ హెడ్‌వర్క్స్ రమేష్‌బాబు, కలెక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

మందడం భూస్కాంలో మరో ముగ్గురు అరెస్టు



విశాలాంధ్ర-తుళ్ళూరు : రాజధాని అమరావతిలోని మందడం సీఆర్డీఏ పరిధిలో వెలుగుచూసి భూ కుంభకోణానికి సంబంధించిన కేసులో కంప్యూటర్ ఆపరేటర్లను అదుపులోకి తీసుకున్నట్లు తుళ్ళూరు డీఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపారు. మందడంలోని సబ్ డివిజన్ పోలీస్ అధికారి కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతు రాజధాని భూ సమీకరణలో అధికారులను మోసం చేసి కౌలు తీసుకుంటున్నట్లు మందడం డిప్యూటీ కలెక్టర్ సాధన ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. ఈ స్కాంలో ముద్దాయి గౌస్ ఖాన్‌ను గతంలోనే అరెస్టు చేశామన్నారు. లక్ష 15 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. ప్రధాన సూత్రధారులైన సీఆర్డీఏ కంప్యూటర్ ఆపరేటర్లు దేవిశెట్టి సందీప్, అవినాష్ కుమార్, నరేష్‌ను అరెస్టు చేసి వీరి వద్ద నుంచి రూ.83,25,000, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సందీప్ లేని భూమిని ఉన్నట్లు రికార్డులు తయారు చేసి గౌస్‌ఖాన్ కుమారుడైన మీరావలిఖాన్ సహాయంతో గౌస్‌ఖాన్‌కు పొలం ఉన్నట్లు నమోదు చేసి కౌలు అందేలా చేశారన్నారు. మీరావలిఖాన్, సందీప్ ఇద్దరు బీటెక్‌లో స్నేహితులన్నారు. ఆ పరిచయంతో ఈ భూస్కామ్ చేశారన్నారు. అవినాష్ కుమార్, నరేష్ ఇద్దరు కూడా సందీప్‌కు సాయం చేశారన్నారు. వీరిని కోర్టుకు హాజరుస్తామన్నారు. పరారీలోని మీరావలి ఖాన్‌ను త్వరలో అరెస్టు చేస్తామన్నారు. సమావేశంలో తుళ్ళూరు సీఐ యు.సుధాకర్‌రావు, ఎస్సై కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజులు చెల్లిస్తేనే హాల్ టిక్కెట్లు!

- ఇంటర్ విద్యార్థులపై ప్రైవేట్ కాలేజీల హుకుం
- విద్యాశాఖా మంత్రి, ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఆదేశాలు భేఖాతరు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

విశాలాంధ్ర-విశాఖసిటీ : రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారుల వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు కలిపి 10,26,891 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. తెల్లవారితే పరీక్షలు రాయాల్సి ఉంది. కానీ కొన్ని ప్రైవేట్ కళాశాలలు ఈ అవకాశాన్ని ఫీజు బకాయిలు ఉన్న విద్యార్థులపై హుకుం ప్రదర్శిస్తూ ఫీజులు రాబట్టుకునేందుకు అణువుగా మార్చుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని రోజుల కిందట ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి బి.ఉదయలక్ష్మిలు వేర్వేరు సందర్భాలలో ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎవరైనా కళాశాలలు హాల్‌టిక్కెట్లు ఇవ్వకుండా ఫీజుల కోసం వేధిస్తే ఆయా కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కానీ ఈ ఆదేశాలను కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు ఏమాత్రం పట్టించుకోకుండా మా పని మాదే అన్నట్టు విద్యార్థులను బ్లాక్ మెయిల్ చేస్తున్నట్టు విద్యార్థుల తల్లితండ్రులు పలువురు ఆవేదన చెందుతున్నారు. గతంలో కొన్ని కళాశాలలు ఇంటర్ పరీక్షల సమయంలో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం తదనంతర పరిణామాల నేపథ్యంలో ఈ సారి అటువంటి కళాశాలలపై కఠినంగా వ్యవహరిస్తామంటూ మంత్రి, అధికారులు హెచ్చరికలు చేసినా ఆయా కళాశాలలు తమ పద్ధతి మార్చుకోకపోవడం గమనార్హం. హాల్‌టిక్కెట్లు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్నప్పటికీ ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ ధృవీకరణ తప్పనిసరి. దీంతో కళాశాల ప్రిన్సిపాల్స్ అనుమతిస్తేనే హాల్‌టిక్కెట్లు. కొన్ని కళాశాలలు ఇంటర్ పరీక్షలు బుధవారం నుండి ప్రారంభం కానుండటంతో విద్యార్థులు ఫీజుల జాబితా ముందు పెట్టుకుని ఫీజులు చెల్లిస్తేనా హాల్‌టిక్కెట్లు అంటూ ఫీజుల బకాయిలు వసూల్ చేశారని, ఇంకా బకాయిలు ఉన్న విద్యార్థులకు మంగళవారం సాయంత్రం వరకు హాల్‌టిక్కెట్లు ఇవ్వలేదని విద్యార్థుల తల్లితండ్రుల లబోదిబో మంటున్నారు. వేల రూపాయల ఫీజు బకాయిలు ఉన్నవారికే హాల్‌టిక్కెట్లు ఇవ్వలేద నుకుంటూ రూ.750 రూపాయలు కట్టాల్సిన తమ కుమారునికి కూడా హాల్‌టిక్కెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఓ విద్యార్థి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు విశాఖలో ఓ ప్రముఖ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రూ.10 వేలు ఫీజు కట్టాల్సి ఉండగా, అవి కడితేనే హాల్ టిక్కెట్లు ఇస్తామని చెప్పగా తాము అప్పటికప్పుడు సోమవారం రూ.5వేలు చెల్లించామని హాల్‌టిక్కెట్లు ఇస్తారనుకుంటే మొత్తం చెల్లిస్తేనే హాల్ టిక్కెట్లు ఇస్తామని కళాశాల అధికారులు తెలపడంతో చేసేదిలేక వారిని బతిమలాడుతున్నామని ఆ విద్యార్థి తల్లి ఆవేదన చెందారు. ఇలా ఒకరూ, ఇద్దరూ కాదు కార్పొరేట్ కళాశాల గేటు వద్ద హాల్ టిక్కెట్ల కోసం పదుల సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఎదురుచూపులు చూస్తూ వేచి ఉన్నారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు ఇదే పరిస్థితి కనిపించింది. తెల్లవారితే పరీక్ష మొదలవుతుందనగా ఇప్పటివరకు తమకు హాల్ టిక్కెట్లు జారీ చేయలేదని, హాల్‌టిక్కెట్ వస్తుందా రాదా అనే టెన్షన్‌తో ఈ రోజంతా సరిపోయిందని వారు వాపోతున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ఏవైతే కళాశాలలు విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడతాయో వారిపై చర్యలు తీసుకుంటామని, ఆయా కళాశాలల గుర్తింపు కూడా రద్దుచేస్తామని ప్రకటించిన మంత్రి గంటా శ్రీనివాసరావు, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శిలు ఈ విషయంపై ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి వుంది.

ఏపీఎస్ఆర్టీసీకి రెండు జాతీయ అవార్డులు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రెండు జాతీయ అవార్డులను కైవసం చేసుకుంది. వివిధ రవాణా అంశాలతో సామర్థ్యాలను బేరీజు వేస్తూ అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ (ఏఎస్ఆర్టీయూ) ఏటా అవార్డులను అందచేస్తోంది. ఈ సారి 2016-17 సంవత్సరానికిగాను అర్బన్ సేవల్లో అత్యధిక వాహన ఉత్పాదకతను సాధించినందుకు ఏఎస్ఆర్టీయూ అవార్డును ప్రకటించింది. విజయవాడ నగర పరిధిలో రోజుకు ఒక్క వాహనం ద్వారా 335.95 కిలోమీటర్ల ఉత్పాదకతను సంస్థ సాధించింది. అలాగే అదే సంవత్సరంలో నగర రవాణా సేవలకు గాను విజయవాడ సిటీ ఆపరేషన్స్‌లో 3000 వాహనాలు కలిగిన విభాగంలో అత్యధిక కేఎంపీ ఎల్ 5.23 సాధించి మరో అవార్డును ఆర్టీసీ చేజిక్కించుకుంది. దేశరాజధాని ఢిల్లీలో మంగళవారం జరిగిన ఏఎస్ ఆర్టీయూ 62వ వార్షిక సమావేశంలో కేంద్ర ఉపరితల రవాణాశాఖ కార్యదర్శి యుధ్‌వీర్‌సింగ్ మల్లిక్, అఖిల భారత రాష్ట్ర రవాణాశాఖ ఉపాధ్యక్షుడు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, ఎండీ డాక్టర్ ఎం మాలకొండయ్య చేతుల మీదుగా అవార్డును సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏ కోటేశ్వరరావు, కృష్ణా రీజనల్ మేనేజర్ పీవీ రామారావు అందుకున్నారు. అవార్డులు సాధించడం పట్ల సంస్థ వీసీ, ఎండీ మాలకొండయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, సిబ్బందిని అభినందించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) ఎ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రౌడీ సమన్వయ సమితులు : అరుణ



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్ : వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు రైతు సమన్వయ సమితీల పేరుతో రౌడీ సమన్వయ సమితులను టీఆర్ఎస్ సర్కార్ ఏర్పాటు చేసిందని మాజీమంత్రి డీకే అరుణ విమర్శించారు. రైతులపై కపట ప్రేమ చూపుతోందన్నారు. మంగళవారం సీఎల్పీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వే ద్వారా ఏం సాధించారని ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులో లేకుండా మొత్తం రెవెన్యూ యంత్రాంగాన్ని సర్వేలకు వాడుకుంటున్నారని మండిపడ్డారు.

నాలుగేళ్లలో రైతుల ను పూర్తిగా విస్మరించి, ఇప్పుడు ఓట్ల కోసం వివిధ పథకాలతో వారిని ఆకర్షించేందుకు యత్నిస్తోందని అరుణ విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టిన ప్రాజెక్టులు కాకుండా టీఆర్ఎస్ ప్రాజెక్టుల ద్వారా ఎక్కడైనా ఎకరాకు సాగునీరు అందించారా అని ప్రశ్నించారు. ఎక్కడైన కనీసం విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించి.. ఉత్పత్తి చేశారా అని అడిగారు. గత హామీ లకు ఇంతవరకు దిక్కులేదని, ఇప్పుడు మరో సారి ప్రజలను మోసం చేసేందుకు కొత్త హామీలను ఇస్తున్నారని దుయ్యబట్టారు. టీఆర్ఎస్, బీజేపీ తోడు దొంగలేనన్నారు. కాంగ్రెస్ ఇప్పటికే రైతు సంరక్షణ కమిటీ లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తద్వారా రైతలకు అండగా ఉంటామని అరుణ చెప్పారు.

వీడిన మిస్టరీ

ముంబై: సినీనటి శ్రీదేవి మృతిపై అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. ఆమె అపస్మారక స్థితిలో నీటిలో మునిగి చనిపోయిందని అక్కడి అధికారులు తేల్చారు. స్థానిక చట్టాల ప్రకారం లాంఛనాలన్నీ పూర్తి చేసుకున్న అనంతరం శ్రీదేవి భౌతికకాయాన్ని భర్త బోనీ కపూర్‌కు అప్పగించారు. అంతకుముందు ఆమె భౌతికకాయానికి ఎంబామింగ్ (రసాయన ప్రక్రియ), గ్రూమింగ్(అలంకరణ) నిర్వహించారు. ఆమె శవపేటిక ఉన్న ప్రత్యేక విమానం దుబాయ్ విమానాశ్రయం నుంచి రాత్రి 7 గంటలకు బయలుదేరి రాత్రి 9.30 గంటలకు ముంబైలోని ఛత్రపతి శివాజీ టెర్మినల్‌కు చేరుకుంది. అనిల్‌కపూర్, అనిల్ అంబానీ, నీతా అంబానీ తదితరులు విమానాశ్రయానికి వచ్చారు. ఈ సందర్భంగా ముంబై విమానాశ్రయం వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తమ అభిమాన నటిని కడసారిగా చూసుకునేందుకు అభిమానులు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి చేరుకున్నారు. బుధవారం ఉదయం ఆమె భౌతికకాయాన్ని అభిమానుల సందర్శనార్థం గ్రీన్‌ఏకర్స్ నుంచి సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌కు తరలిస్తారు. 12.30 గంటలకు సంతాపసభ, మధ్యాహ్నం 3.30 గంటలకు విలే పార్లే సేవా సమాజ్ హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

అసలేం జరిగిందంటే..

శనివారం రాత్రి 11 దాటిన తర్వాత శ్రీదేవి హఠాన్మరణం చెందిన సంగతి తెలిసిందే. అయితే, తొలుత గుండెపోటుతో చనిపోయారని అనుకున్నారు. అనంతరం ఆమె పోస్టుమార్టం నివేదికలో, శ్రీదేవి ప్రమాదవశాత్తు నీటిలో పడి ఊపిరి ఆడక చనిపోయారని దుబాయ్ వైద్యులు తేల్చారు. ఆమె దేహంలో ఆల్కహాల్‌కు సంబంధించిన ఆనవాళ్లు కనిపించాయని, బహుశా స్నానానికి వెళ్లిన ఆమె పట్టును కోల్పోయి కాలు జారీ టబ్‌లో పడిపోయి ఉంటారని, ఆ క్రమంలోనే ఊపిరి ఆడక చనిపోయారని అన్నారు. అయితే, ఈ క్రమంలో బోనీకపూర్‌ను ప్రాసిక్యూషన్ కొన్ని గంటలపాటు మూడు తడవలుగా విచారించడం, ఆమె మృతదేహాన్ని అప్పగించేందుకు తొలుత అధికారులు అంగీకరించకపోవడంతో బహుశా ఆమె చావుకు ఏవో బలమైన కారణాలే ఉంటాయని భిన్న కథనాలు వచ్చాయి. కానీ చివరికి వాటన్నంటికి ఫుల్‌స్టాప్ పెడుతూ దర్యాప్తు క్లియర్ అయిందని, ఇక ఎలాంటి అనుమానం లేదని, ఆమె అనుకోకుండా బాత్‌డబ్‌లో పడి ఊపిరి ఆడక చనిపోయారంటూ దుబాయ్ విచారణ అధికారులు తేల్చేశారు. అన్ని కోణాల్లో విచారణ జరిపామని, ఆమె మృతి వెనుక ఎలాంటి కుట్ర లేదని దుబాయ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. స్పృహ కోల్పోయి టబ్‌లో పడిపోవటం వల్లే శ్రీదేవి మరణించిందని, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని, బోనీకపూర్ ముంబై వెళ్లవచ్చని దుబాయ్ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ఎంబామింగ్ అంటే...

కొన్ని సందర్భాల్లో మృతదేహానికి చాలా రోజుల పాటు అంత్యక్రియలు నిర్వహించకుండా ఉండాల్సిన పరిస్థితులు వచ్చినప్పుడు మృతదేహం కుళ్లిపోకుండా చూడాలి. శరీరం కొంతకాలంపాటు దెబ్బతినకుండా ఉండేందుకు ఎంబామింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ ప్రక్రియలో కొన్ని రసాయనాలను ధమనుల ద్వారా శరీరంలోకి ఎక్కిస్తారు. ఈ ద్రావకాలనే 'ఎంబామింగ్ ఫ్లూయిడ్స్' అని పిలుస్తారు. ఫార్మాల్డిహైడ్, మెథనాల్, ఇథనాల్‌తోపాటు మరికొన్ని రకాల రసాయనాలను ఈ ప్రక్రియలో వాడతారు. ఎంబామింగ్ ఫ్లూయిడ్స్‌ను ఎక్కించడం వల్ల బాక్టీరియా వంటి సూక్ష్మజీవులు చచ్చిపోతాయి. అంటే, ఈ ఫ్లూయిడ్స్ ఏరకంగానూ బాక్టీరియాకు న్యూట్రియంట్ ఫ్లూయిడ్‌గా పనిచేయవు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత, సత్యసాయి బాబా మరణించినప్పుడు కూడా ఎంబామింగ్ చేసిన విషయం తెలిసిందే.



గ్రూమింగ్..

తమ ఆత్మీయులు మరణించినప్పుడు వారి మృతదేహాన్ని కడసారి చూసిన రూపం చిరకాలం గుర్తుండిపోతుంది. ఆ 'తుది జ్ఞాపకం' ఇబ్బందికరంగా కాకుండా, ఎప్పట్లా ఆత్మీయంగానే ఉండాలని చాలామంది కోరుకుంటారు. ఈ కోరికను బాడీ గ్రూమింగ్ తీరుస్తోంది. ఇది కూడా ఎంబామింగ్‌లో భాగమే. ఈ ప్రక్రియలో మరణించిన వ్యక్తి అంతకుముందు మంచి ఆరోగ్యంతో ఉన్న ఫొటో ఆధారంగా మృతదేహానికి అలంకరణ చేస్తారు.



వెలిగొండకు పూర్తిస్థాయిలో

నిధుల కోసం పోరు

రేపు ప్రకాశం కలెక్టరేట్ ముట్టడి : రావుల వెంకయ్య

విశాలాంధ్ర- ఒంగోలు : పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలని, రామాయపట్నం పోర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపాలని కోరుతూ మార్చి 1న ప్రకాశం జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రావుల వెంకయ్య , జిల్లా కార్యదర్శి ఎమ్మెల్ నారా యణ విలేకరులతో మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోతే ప్రజాఉద్యమం నిర్మించి మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గతంలో ప్రభుత్వాలు వెనుకబడిన ప్రాంతాలకు ప్రాముఖ్యత ఇచ్చి పనులు చేపట్టేవన్నీ ప్రస్తుతం అన్ని ఏకకాలంలో పూర్తి చేయాలనే పద్దతిలో ప్రభు త్వాలు నడుస్తున్నాయన్నారు. ఫలితంగా వెలిగొండ ప్రాజెక్టు నత్తనడకన నడుస్తు న్నదన్నారు. కేవలం వెయ్యి రోజులలో ప్రాజెక్టు పూర్తి చేసి నీరు అందిస్తామని ప్రారంభించిన ఈ ప్రాజెక్టు ఇప్పటికి పది సంవత్సరాలు నిండుతున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న తీరుగా పనులు సాగుతున్నాయన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు కూడా అసెంబ్లీలో ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయింపుకు పట్టుపట్టిన దాఖలాలు కూడా లేవన్నారు. ప్రాజెక్టు ఆలస్యం అయ్యే కొద్ది రావా ల్సిన మిగులు జలాలు కూడా పోయే పరిస్థితి నెలకొందని రావుల వెంకయ్య చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి చంద్రబాబు నాయుడు నాలుగు సంవ త్సరాల పాలన కాలంలో కేవలం ఒకటిన్నర కిలోమీటర్లు టన్నెల్ తవ్వటానికి నిధులు కేటాయించారని నారాయణ అన్నారు. జిల్లా అభివృద్ధి పట్ల చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. జిల్లాకు మరో ప్రాణాధారమైన రామయపట్నం పోర్టును నిర్మించాలని డిమాండు చేశారు. వెనకబడిన జిల్లాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రామాయపట్నం పోర్టుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదిక పంపాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు హనుమారెడ్డి, ఆర్ వెంకట్రావు, ఎస్‌డి సర్దార్, చంద్రశేఖర్, పీవీఆర్ చౌదరి, మాలకొండయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బ్రిక్స్ యూత్, స్టూడెంట్ లీగ్ సమావేశం

జొహాన్నెస్‌బర్గ్ : (బ్రిక్స్ యూత్, స్టూడెంట్స్ లీగ్ (బ్రిక్స్ వైఎస్ఎల్) ఏర్పాటు. లీగ్ ప్రారంభ కార్యాచరణ ముసాయిదా రూపొందించడం, మార్గదర్శకాలు, వ్యూహాన్ని రూపొందించేందుకు బ్రిక్స్ దేశాలలోని విద్యార్థి, యువజన సంఘాలు ఈ నెల 24న ఇక్కడ సమావేశమయ్యాయి. ఈ సమావేశం ఐదు రోజులపాటు జరుగుతుంది. రష్యన్ యంగ్‌గార్డ్స్, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ యూత్‌లీగ్, అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) కాంగ్రెస్ ఆఫ్ సౌతాఫ్రికన్ స్టూడెంట్స్ తదితర సంఘాల ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, విక్కి ఈ సమావేశంలో పాల్గొంటున్నారు. ప్రపంచ జనాభాలో ఐదు బ్రిక్స్ దేశాల జనాభా 3.6 బిలియన్లకుపైనే లేదా 41 శాతం. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన 25 దేశాల్లో ఈ ఐదు దేశాలు ఉన్నాయి, అలాగే మొదటి పది దేశాల్లో నాలుగు దేశాలు స్థానం పొందాయి. బ్రిక్స్ భవిష్యత్‌పైనే ఈ దేశాల యువత భవితవ్యం ఆధారపడి ఉంది. అందువల్ల భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను ఈ సమావేశాల్లో రూపొందించనున్నారని ఖాద్రీ తెలిపారు.

టీడీపీలో సస్పెన్స్ (మొదటిపేజీ తరువాయి)

నిరసనలకు దిగారు. దీంతో రెండు పార్టీల మధ్య అంతరం పెరిగింది. మార్చి 5 నాటికి విభజన హామీల అమలు, రెవెన్యూలోటు బడ్జెట్, రైల్వే జోన్, ఇతర ప్రధాన అంశాలపై కేంద్రం స్పష్టమైన వైఖరితో కాల పరిమితిని నిర్ణయించి ప్రకటించాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించారు. ఇదే సమయంలో కేంద్ర హోంశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ముఖ్య కార్యదర్శులతో ఈ నెల 23న సమావేశం జరగనుందని ప్రకటనలు వెలువడ్డాయి. ఏమి జరిగిందో తెలియదు కానీ ఆ సమావేశం జరగలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై స్పష్టత రాలేదు. మార్చి 5 నాటికి కేంద్రం ఏ విధంగా స్పందిస్తుందో తెలియదు. స్పందించని పక్షంలో టీడీపీ అధిష్టానం బీజేపీ విషయంలో రాజకీయ పరమైన నిర్ణయం తీసుకోవాలి. తీసుకోకుంటే వెనక్కు తగ్గినట్లు ప్రజల్లో భావన కలుగుతుందన్న ఆలోచనతో సీఎం చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది.ఈ పరిణామాల నేపథ్యంలో రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ టీడీపీ కేంద్రానికి డెడ్‌లైన్ విధించిననాడే విడుదల కానుంది. 12న నామినేషన్లకు చివరిరోజు. కీలక నిర్ణయం తీసుకోవాల్సిన రోజే రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఏపీ ప్రయోజనాల విషయంలో కేంద్రం స్పష్టత ఇవ్వని పక్షంలో టీడీపీ కేంద్రంలో ఉన్న ఇద్దరు మంత్రులతో రాజీనామా చేయిస్తుందని, అదే జరిగితే రెండు పార్టీల మిత్రబంధం తెగినట్టేనని, అప్పుడు బీజేపీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు కూడా టీడీపీకి వ్యతిరేకంగా మారతారు. ఒకవేళ ఆ నలుగురు వైసీపీకి ఓటు వేయకపోయినా ఓటింగ్‌కు హాజరుకారని రాజకీయవర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే టీడీపీ మూడవ అభ్యర్థిని నిలబెడితే ఓడిపోవటంతో పాటు ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళతాయన్న భావంతో చంద్రబాబు మూడవ అభ్యర్థిని రంగంలోకి దించే విషయమై ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నట్లు తెలిసింది. వైసీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేరును ఆ పార్టీ అధిష్టానం ఇప్పటికే ప్రకటించింది. వేమిరెడ్డి తరహాలోనే టీడీపీ టిక్కెట్ ఆశిస్తున్న వారిలో పుష్కలమైన ఆర్థిక వనరులు ఉన్నవారు ఎందరో ఉన్నారు. అయితే సామాజిక సమీకరణలతో పాటు మూడవ అభ్యర్థిని రంగంలోకి దింపితే గెలవాలి. గెలవాలంటే వైసీపీ నుండి మరో ముగ్గురు బయటకు రావాలి. టీడీపీకి వస్తారనుకున్న వారు కూడా పై పరిస్థితుల దృష్ట్యా కదలాడకుండా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ విభజన హామీల విషయంలో మోడీ ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో చంద్రబాబు డిమాండ్లపై హామీ ఇస్తే బీజేపీతో ఎప్పట్లాగనే బంధం కొనసాగుతుంది. అదే జరిగితే టీడీపీ నుంచి మూడవ అభ్యర్థి రంగంలోకి దిగటం ఖాయమని టీడీపీ సీనియర్లు కొందరు చెప్పుకొచ్చారు. ఏది ఏమైనా టీడీపీ మూడవ అభ్యర్థిని దించుతుందా లేదా అన్న సస్పెన్స్‌పై మార్చి 5,6లలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి

దివ్యాంగుల జాతీయ చీఫ్ కమిషనర్ కమలేష్ కుమార్ పాండే



విశాలాంధ్ర-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా లేవని, కేంద్రం అందించే నిధుల ద్వారా దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని దివ్యాంగుల జాతీయ కమిషన్ చీఫ్ కమిషనర్ డాక్టర్ కమలేష్ కుమార్ పాండే చెప్పారు. సచివాలయం పబ్లిసిటీ సెల్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో దివ్యాంగుల పథకాల అమలుతీరుని సమీక్షించేందుకు ఇక్కడికి వచ్చామని, అయితే విశాఖలో భాగస్వామ్య సదస్సుకు వెళ్లడం వల్ల ఎక్కువమంది అధికారులు సమావేశానికి హాజరుకాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈసారి మళ్లీ వచ్చినప్పుడు సీఎం, సీఎస్, ఇతర అధికారులను కలసి మాట్లాడతానని చెప్పారు. దేశంలో దివ్యాంగుల కోసం 1983లో మొట్టమొదటిసారిగా ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసిన ఘనత ఆంధ్రప్రదేశ్‌దే నన్నారు. అయితే ప్రస్తుతం దీనికి పూర్తి స్థాయి కమిషనర్‌ని, ఇతర సిబ్బందిని నియమించి, వాహనం వంటి ఇతర సౌకర్యాలు కల్పించవలసిన అవసరం ఉందన్నారు. దేశంలో 2.6 కోట్ల మంది దివ్యాంగులు ఉన్నారని, వారి సంక్షేమం, వారి హక్కుల కోసం జాతీయ కమిషన్, రాష్ట్ర శాఖలు పని చేస్తుంటాయన్నారు. దివ్యాంగుల అంశం రాష్ట్రాలకు చెందిన అంశమని, కేంద్రం నమూనాగా కొన్ని అంశాలను అమలు చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని దివ్యాంగులకు 10 లక్షల సర్టిఫికెట్లు ఇచ్చారని తెలిపారు. భవిష్యత్‌లో ఈ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేస్తామన్నారు. దివ్యాంగుల చీఫ్ కమిషనర్ కార్యాలయంలో 1998 సెప్టెంబర్ నుంచి 2018 జనవరి వరకు 35,417 ఫిర్యాదులు నమోదు కాగా, వాటిలో 33,636 పరిష్కరించినట్లు వివరించారు. ఒక్క జనవరిలో 162 ఫిర్యాదులు రాగా, 110 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. వికలాంగులకు ప్రత్యేక గుర్తింపు కార్డు (యుడిఐడి) పథకం కేంద్రం ప్రవేశపెట్టిందని, ఈ పథకం కింద కొంతమందికి శిక్షణ ఇస్తారని, నిధులను కేంద్రం విడుదల చేస్తుందని చెప్పారు. దీనికి రాష్ట్ర కోఆర్డినేటర్‌ని నియమించవలసి ఉందని చెప్పారు. చిన్న పిల్లల్లో వినికిడి సమస్య పరిష్కారానికి కాక్లియర్ అమరిక పథకాన్ని కేంద్ర ప్రభుత్వం, మరికొన్ని రాష్ట్రాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఒక్కో కాక్లియర్ అమరికకు రూ.6 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. అటువంటి పథకం రాష్ట్రంలో కూడా ప్రవేశపెడితే బాగుంటుందన్నారు. రాష్ట్రంలోని ఏదైనా విశ్వ విద్యాలయంలో దివ్యాంగులకు సంబంధించిన ఒక శాఖ ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులైన పిల్లలను సాధారణ పాఠశాలలో చేర్చుకోవడానికి నిరాకరిస్తే, దానిని శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తారని హెచ్చరించారు. ఏపీతో సహా 22 రాష్ట్రాల్లో 40 మొబైల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్రం 46 వేల ప్రీ-మెట్రిక్, 30 వేల మెట్రిక్, విదేశాల్లో పరిశోధన కోసం 200 స్కాలర్ షిప్‌లు ఇస్తున్నట్లు చెప్పారు. 2017 ఏప్రిల్ 19 నుంచి అమలులోకి వచ్చిన దివ్యాంగుల చట్టం-2016 ప్రకారం 3 శాతం ఉన్న రిజర్వేషన్‌ని 4 శాతానికి పెంచారని, అలాగే ఈ చట్టం ద్వారా వారికి అనేక సౌకర్యాలు, రాయితీలు కల్పించారని వివరించారు. దివ్యాంగులు తమ సమస్యలను సీసీపీడీ ఎట్ ఎన్‌ఐసీ.ఇన్ (ccpd@nic.in) ద్వారా చీఫ్ కమిషనర్‌కు పంపవచ్చన్నారు. సమావేశంలో జాతీయ డిప్యూటీ చీఫ్ కమిషనర్ రాకేష్ కుమార్‌రావు, దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్ కేఆర్‌బీహెచ్ఎన్ చక్రవర్తి, డిప్యూటీ డైరెక్టర్ ఎంఏ.కుమార్ రాజా పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా మీకు చేత కాకపోతే మేమే ఇస్తాం : రఘువీరా

విశాలాంధ్ర-అమలాపురం: రాష్ట్ర విభజన సమయంలో తెలుగు ప్రజలు సమైక్యాంధ్ర కోసం విస్తృతంగా పోరాటంఒ. సాగించినప్పటికీ అన్ని రాజకీయ పార్టీలు విభజన కోరుకోవడంతో రాష్ట్రాన్ని విభజించారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి పేర్కొన్నారు. అయితే అప్పుడు ఎవరూ ప్రత్యేక హోదా కావాలని కోరలేదని కాంగ్రెస్ పార్టీ తెలుగు ప్రజలపై ఉన్న మమకారంతో తెలుగు ప్రజలను ఆదుకోవాలనే సంకల్పంతో ప్రత్యేక హోదా అంశం పొందుపర్చడం జరిగిందని అయితే అప్పటి ప్రభుత్వం తీసుకున్న విభజన హామీలను అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలుగు ప్రజలను మోసం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రానున్న 2019 ఎన్నికలలో రాష్ట్రం, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారం ఖాయమని అప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదాపై రాహుల్‌గాంధీతో తొలి సంతకం చేయిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఒడిదుడుకులు చవి చూసిందని, కాంగ్రెస్‌లో ఎందరో త్యాగాలు చేసిన మహా మహా నాయకులు ఉన్నారని ఆయన గుర్తు చేసారు. గతంలో ఇచ్చిన హామీలు కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను తీవ్రంగా వంచిచాయని ఆ ప్రభుత్వాలు వ్యవ హరిస్తున్న తీరుకు నిరస నగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగు తుందని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా అమలాపురం స్దానిక గడియార స్దంబం సెంటర్‌లో ఆత్మగౌరవ దీక్ష చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంతం నానాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రులు ఎం.ఎం. పల్లం రాజు, జె.డి.శీలం, మాజీ ఎమ్మెల్సీలు గిడుగు రుద్రరాజు, ఆకుల రామ కృష్ణ, కల్వకొలను తాతాజీ తదితరులు పాల్గొని మోడి వ్యవహరిస్తున్న విధివిధానాలను విమర్శించారు. పెద్దయెత్తున కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

5న తెలుగు రాష్ట్రాల సీఎస్‌లతో

కేంద్ర హోంశాఖ సమావేశం

హైకోర్టు విభజన, షెడ్యూల్ 13లో అంశాలపై చర్చించే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలతో కేంద్ర హోంశాఖ సమావేశం వచ్చే నెల 5వ తేదీన జరగనున్నట్లు విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి ఈ నెలలోనే సమావేశం జరాగాల్సి ఉండగా కొన్ని అనివార్యకారణాల వల్ల హోంశాఖ సమావేశాన్ని వాయిదా వేసిన విషయం తెలిసిందే. తెలంగాణ చీఫ్ సెక్రటరీ అందుబాటులో లేకపోవటం కూడా ఒక కారణంగా తెలిసింది. అయితే మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర హోంశాఖ అధికారులు తెలుగు రాష్ట్రాల సమావేశాలకు సంబంధించి తేదీలను ఖరారు చేశారు. విభజన హామీలు, ప్రతిష్టాత్మక సంస్థల పంపిణీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలపై కేంద్రం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల సిఎంలు కూర్చొని చర్చించుకోవాలని కేంద్రం చెప్పింది. అయితే తొలుత చీఫ్ సెక్రటరీలతో చర్చించి ఆ తర్వాత సిఎంలతో సమావేశం కావాలని కేంద్ర హోంశాఖ భావిస్తుంది.

ఇందులో భాగంగానే మార్చి 5వ తేదీన సమావేశం నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. ఒకవైపు ఏపి విభజన సమస్యల పరిష్కారం, మరో వైపు ఏపి తెలంగాణల మధ్య ఉన్న సమస్యలను పరిష్కారం చేయాలని కేంద్రం భావిస్తోంది. ఈ సమావేశానికి ఇరు రాష్ట్రాల సిఎస్‌లు, ఇతర శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరవుతారని హోంశాఖ వర్గాల నుంచి అందుతున్న సమాచారం.

త్వరలో పట్టాలపైకి 'ఉదయ్'

- విశాఖ-విజయవాడ మధ్య వారంలో 5 రోజులు
- వైఫై, ఎల్‌సీడీ తెర సదుపాయాలు
- ప్రకటించిన మూడేళ్ల తర్వాత మోక్షం
- మూడు రైళ్లకు రైల్వేశాఖ పచ్చజెండా



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: 'ఉత్కృష్ట్ డబుల్ డెక్కర్ ఎయిర్ కండీషన్డ్ యాత్రి' (ఉదయ్) రైళ్లకు ఎట్టకేలకు మోక్షం లభించింది. త్వరలోనే విశాఖపట్నం-విజయవాడ మధ్య మరో డబుల్ డెక్కర్ రైలు పరుగులు తీయనుంది. త్వరలోనే ముందుగా ప్రకటించిన విధంగా ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆయా మార్గాల్లో రైల్వేశాఖమంత్రి పీయూష్‌గోయల్ సోమవారం ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. తొలి ఉదయ్ రైలును కోయంబత్తూరు-బెంగళూరు మధ్య ప్రారంభిస్తామని, మరిన్ని రోజుల వ్యవధిలోనే విశాఖ-విజయవాడ, బాంద్రా-జామ్‌నగర్ ఉదయ్ రైళ్లను కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. దీంతో మరికొద్ది రోజుల్లోనే రాష్ట్రంలో ఉదయ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలపైకి రానుంది. ఇప్పటికే విశాఖపట్నం-తిరుపతి మధ్య డబుల్ డెక్కర్ రైలు నడుస్తున్న విషయం తెలిసిందే. రద్దీని క్రమబద్ధీకరించే చర్యల్లో భాగంగా ఐదేళ్ల క్రితం వివిధ ప్రాంతాల మధ్య ఏసీ డబుల్ డెక్కర్ రైళ్లను రైల్వేశాఖ ప్రారంభించింది. అయితే మరిన్ని రద్దీ మార్గాల్లో 'ఉదయ్' పేరుతో ఈ రైళ్లను ప్రవేశపెడుతున్నట్లు 2015 బడ్జెట్‌లో అప్పటి రైల్వేశాఖమంత్రి సురేష్ ప్రభాకర్ ప్రభు తెలిపారు. సాధారణ ఏసీ చైర్‌కార్ బోగీతో పోలిస్తే డబుల్ డెక్కర్ బోగీలో 40 శాతం అదనంగా సీటింగ్ సదుపాయం ఉంటుంది. ఉదయ్ పేరుతో విశాఖపట్నం- విజయవాడ- విశాఖపట్నం, కోయంబత్తూరు- బెంగళూరు- కోయంబత్తూరు, బంద్రా టెర్మినల్ (ముంబై)- జామ్‌నగర్- బంద్రా టెర్మినల్ మధ్య మూడు రైళ్లను ప్రకటించారు. అయితే ఈ కొత్త రైళ్ల వేళలను పేర్కొంటూ రెండేళ్ల క్రితం నుంచి రైల్వే టైమ్‌టేబుల్‌లో సమయాలను ముద్రిస్తున్నారే తప్ప రైళ్లను మాత్రం అందుబాటులోకి తేలేకపోయారు. నెంబరు 22701/22702 విశాఖపట్నం- విజయవాడ- విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ వారంలో గురు, ఆదివారాలు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 5.45 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 11.15 గంటలకు విజయవాడ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో అదే రోజుల్లో విజయవాడలో సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి రాత్రి 10.55 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. ఈరైలు మార్గమధ్యలో దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు స్టేషన్లలో నిలుపుదల చేయనున్నట్లు టైమ్‌టేబుల్‌లో పేర్కొన్నారు. ఈ మార్గంలో మొత్తం 6 స్టేషన్లలో ఈ రైలు ఆగనుంది. మొత్తం 350 కిలోమీటర్ల దూరాన్ని గంటకు సరాసరి 65 కిలోమీటర్ల వేగంతో 5.30 గంటల సమయంలో చేరుతుంది. వ్యాపార వర్గాల విజ్ఞప్తులను పురస్కరించుకొని ఉదయ్ రైళ్లను నడుపుతున్నట్లు గోయల్ ట్విట్టర్‌లో వివరించారు. ఈ డబుల్ డెక్కర్ రైళ్లను ఎల్లో, ఆరెంజ్, పింక్ రంగులతో అత్యంత ఆకర్షణీయంగా, కాంతివంతంగా ఉండే విధంగా డిజైన్ చేసినట్లు చెప్పారు. అలాగే ప్రయాణీకుల సౌకర్యార్థం ఆన్‌బోర్డ్ వైఫై సదుపాయాన్ని కల్పించామన్నారు. అలాగే ప్రతి బోగీలోనూ ఎల్‌సీడీ తెరలను ఏర్పాటుచేసామన్నారు. ఈ తెరలపై రాబోయే స్టేషన్ పేరుతో రైల్వేకు సంబంధించిన సమాచారాన్ని తెలియచేస్తామన్నారు. ఇక ఎంతో సౌకర్యవంతమైన సీటింగ్ వల్ల అల్పాహారం, భోజనాన్ని మంచి వాతావరణంలో తినేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ రైళ్లలోని అన్ని బోగీల్లోనూ బయోటాయిలెట్లను ఏర్పాటు చేశారు. మెబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను చార్జింగ్ చేసుకునే సదుపాయం కూడా కల్పించారు.

కేంద్రంపై ఒత్తిడి పెంచుదాం..

(మొదటిపేజీ తరువాయి)

మాటకు చంద్రబాబు నిదర్శనమన్నారు.34ఏళ్లు ఆయనతో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టమంటూ ప్రధాన కార్యదర్శిగా టీడీపీకి ఒక దిక్సూచిగా చంద్రబాబు వ్యవహరించారని శ్లాఘించారు. చంద్రబాబు ఇమేజివల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని, రాజకీయాల్లో షష్టి పూర్తి చేసుకోవాలని వారు ఆకాంక్షించారు. సంస్కరణల్లో, ఐటీ వినియోగంలో, రైతన్నల సంక్షేమంలో, మహిళా స్వావలంబనలో దేశానికే దిక్సూచి చంద్రబాబే అంటూ ప్రశంసల జల్లు కురిపించారు. గతంలో వే టు ఢిల్లీ త్రూ యూపీ అనేవారు.దానిని వే టూ ఢిల్లీ త్రూ ఏపీగా మార్చారని నాయకులు, మంత్రులు ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్ర సంక్షేమం గురుతర బాధ్యత... నవ్యాంధ్ర ప్రజల సంక్షేమం తనపై ఉన్న అత్యంత ప్రధానమైన బాధ్యతని సమన్వయ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. విభజన కష్టాల నుంచి ప్రజలకు అభివృద్ధి అందించే కర్తవ్య నిర్వహణలో ఉన్నానన్నారు. ఏపీని నెంబర్ వన్ చేయడమే లక్ష్యమని ఆ దిశగానే పాలన సాగిస్తున్నానన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలనేదే తన ప్రధాన డిమాండన్నారు. వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మరని, జగన్ నేరాలకు పాల్పడడం ఎంత వాస్తవమో రాష్ట్రానికి పెట్టుబడులు తేవడం అంతే వాస్తవమన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు , అప్పటి ప్రధాని ఇచ్చిన హామీలు మనకున్న హక్కులని నేతలకు ఉద్బోధించారు. ప్రతిపక్ష నేత జగన్ నేరాలవల్ల రాష్ట్ర ప్రతిష్ట మంటగలిసిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో మంత్రులు యనమల , పుల్లారావు, నారా లోకేష్ , నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్కడా విజయం మనదే..!

మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ



కోల్‌కతా :
సఫారీ గడ్డపై వన్డే, టీ20 సిరీస్‌లు గెలిచిన కోహ్లిసేనపై మాజీ క్రికెటర్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తాజాగా భారత క్రికెట్ జట్టు మాజీ సారథి సౌరభ్ గంగూలీ మాట్లాడుతూ.. 'కోహ్లి నాయకత్వంలోని టీమిండియా ఇంగ్లండ్, ఆస్ట్రేలియా గడ్డపై కూడా తప్పక విజయాలు నమోదు చేస్తుంది' అని ఆశాభావం వ్యక్తం చేశాడు. 'సఫారీ గడ్డపై జరిగిన టెస్టు, వన్డే, టీ20 సిరీస్‌ల్లో కోహ్లి తన బ్యాటింగ్ ప్రదర్శనతో ఎంతో ఎత్తు ఎదిగాడు. ఇది శుభపరిణామం. ఎందుకంటే ఈ ఏడాది కోహ్లిసేన ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనలకు వెళ్లనుంది. ఈ రెండు దేశాల్లో విరాట్ సేనకు టెస్టు సిరీస్‌లను సొంతం చేసుకునే సత్తా ఉంది. భువనేశ్వర్ కుమార్, బుమ్రాతో భారత బౌలింగ్ బలంగా ఉంది. సఫారీ గడ్డపై భారత్‌కు శుభారంభం దక్కలేదు. టెస్టు సిరీస్ కోల్పోయింది. అయినా ఏ మాత్రం ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. చివరి టెస్టులో విజయంతో పాటు వన్డే, టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. అంతేకాదు, కీలకమైన చివరి టీ20 ఆడే సమయంలో జట్టులో విరాట్ కోహ్లి కూడా లేడు. జట్టు సభ్యులంతా సమష్టిగా రాణిస్తున్నారు. ఇలాగే రాణిస్తే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా గడ్డపై కూడా కోహ్లిసేన విజయం సాధిస్తుంది' అని గంగూలీ తెలిపాడు. ఈ ఏడాది జూలై మొదటి వారంలో భారత్-ఇంగ్లండ్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. సిరీస్ ప్రారంభానికి నెల రోజుల ముందే టీమిండియా ఇంగ్లీష్ గడ్డపై అడుగుపెట్టనుంది. గతంలో ధోనీ నాయకత్వంలో టీమిండియా ఇంగ్లండ్, ఆసీస్ గడ్డపై జరిగిన సిరీసుల్లో ఓటమిపాలైన విషయం తెలిసిందే.



టీమిండియా ఉదారం..!

కేప్‌టౌన్:
దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకొని తిరిగి భారత్‌కు పయనమయ్యే ముందు టీం ఇండియా తమ ఉదారతను చాటుకుంది. ఇప్పటికే సౌతాఫ్రికా రాజధాని కేప్‌టౌన్‌తో పాటు పలు ప్రాంతాలు తీవ్ర నీటి కొరతను ఎదురుకుంటున్నాయి. దీంతో భారత్ దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా జరిగిన మ్యాచ్‌ల్లో గ్రౌండ్‌ని సిద్ధం చేసుకుందుకు కూడా నీరు లేక నానా ఇబ్బందులు పడ్డారు. అయితే ఈ సమస్యను అర్థం చేసుకున్న భారత జట్టు, సఫారీలతో కలిసి రూ.100,000 రాండ్స్ (భారత కరెన్సీలో రూ.5.5 లక్షలు) విరాళంగా ఇచ్చింది. న్యూలాండ్స్‌లో జరిగిన ఆఖరి టీ-20 అనంతరం కెప్టెన్ విరాట్ కోహ్లి, సౌతాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్‌తో కలిసి ఈ చెక్‌ను గిఫ్ట్ ఆఫ్ ది గివర్స్ సంస్థకు అందించారు. అంతేకాక ఆటగాళ్ల జెర్సీలపై వారిచే సంతకాలు తీసుకొని వాటిని వేలం వేసి ఆ డబ్బును నీటి ఎద్దడిని దాటేందుకు ఉపయోగిస్తామని గిఫ్ట్ ఆఫ్ ది గివర్స్ సంస్థ ప్రకటించింది. ఈ సందర్భంగా విరాట్ కోహ్లి మాట్లాడుతూ.. "కేప్‌టౌన్ ప్రపంచంలోని సుందర నగరాల్లో ఒకటి. ఇక్కడ ఆడేందుకు ఎప్పుడు వచ్చినా మాకు దక్కే గౌరవం, అభిమానం మాటల్లో చెప్పలేనిది. సౌతాఫ్రికాకు మదర్ టౌన్‌లో ఏర్పడిన ఈ కరువుపై ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు చేస్తున్న ఈ కృషిని అభినందిస్తున్నా.." అని అన్నాడు.



ఆసీస్‌తో ఢీకొట్టే జట్టు ఇదే..!

ముంబై :
వచ్చే నెల సొంతగడ్డపై ఆసీస్‌తో తలపడే భారత మహిళల జట్టును బీసీసీఐ ప్రకటించింది. మిథాలీ రాజ్, హర్మన్‌ప్రీత్ కౌర్‌కు కెప్టెన్, వైస్‌కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. భారత్-ఆస్ట్రేలియా మధ్య మార్చి 12 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది. వడోదర వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. సఫారీ గడ్డపై వన్డే, టీ20 సిరీస్‌లను కైవసం చేసుకున్న భారత మహిళల జట్టు రెట్టించిన ఉత్సాహంతో ఆసీస్‌తో పోరుకు సిద్ధమౌతోంది. దక్షిణాఫ్రికా పర్యటనలో గాయపడిన స్టార్ బౌలర్ జులన్ గోస్వామి ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు దూరమైంది.

జట్టు: మిథాలీ రాజ్(కెప్టెన్), హర్మన్‌ప్రీత్ కౌర్(వైస్ కెప్టెన్) స్మృతి మంధాన, పూనమ్ రౌత్, వేద కృష్ణమూర్తి, రోడ్రిక్స్, మోనా మిశ్రం, సుష్మా వర్మ(వికెట్ కీపర్), రాజేశ్వరి గైక్వాడ్, శిఖా పాండే, సుకన్య పరిద, పూజ, దీప్తి శర్మ.

షెడ్యూల్ : తొలి వన్డే - మార్చి 12న - వడోదర, రెండో వన్డే - మార్చి 15న - వడోదర, మూడో వన్డే - మార్చి 18న - వడోదర



వారితో ఆడటం సంతోషం : వోగ్స్

న్యూఢిల్లీ :
ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఇంగ్లండ్ క్రికెటర్ క్రిస్ వోగ్స్ ఈ ఏడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడనున్నాడు. రూ.7.4 కోట్లు పెట్టి ఆర్‌సీఈ వోగ్స్‌ను సొంతం చేసుకుంది. తాజాగా వోగ్స్ మాట్లాడుతూ.. 'విరాట్ కోహ్లి, ఏబీ డివిలియర్స్, మొయిన్ అలీ లాంటి అగ్రశ్రేణి ఆటగాళ్లతో ఆడటం ఎంతో సంతోషంగా ఉంది. డ్రెస్సింగ్ రూమ్‌లో వీరి నుంచి నేర్చుకునేందుకు నాకు ఎంతో సమయం దొరుకుతుంది. గతంలో గౌతమ్ గంభీర్ కెప్టెన్సీలో ఆడాను. ఇప్పుడు కోహ్లి నాయకత్వంలో ఆడబోతు న్నాను. ప్రపంచం మెచ్చిన ఆటగాళ్లలో కోహ్లి ఒకడు. ఐపీఎల్ కోసం ఎదురుచూ స్తున్నాను' అని వోగ్స్ తెలిపాడు. అనంతరం తాను బౌలింగ్ విభాగంలో మరింత మెరుగ్గా రాణించేందుకు భారత మాజీ క్రికెటర్ లక్ష్మీపతి బాలాజీ ఎంతో సాయం చేశాడని వోగ్స్ పేర్కొన్నాడు. 'కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు బౌలింగ్ మెంటార్‌గా ఉన్న లక్ష్మీపతి బాలాజీ నుంచి ఎంతో నేర్చుకున్నా. అతనిచ్చిన విలువైన సలహాలు, సూచనలతోనే ఇప్పుడు బాగా రాణించగలుగుతున్నాను' అని వోగ్స్ వివరించాడు.

కెప్టెన్ కోసం అన్వేషణ..!

- గంభీర్ స్థానాన్ని భర్తీ చేసేదెవరు?
- గట్టిగా వినబడుతున్న దినేశ్ కార్తీక్ పేరు
- రేసులో ఉతప్ప, సునీల్ నరైన్



న్యూఢిల్లీ:
త్వరలో జరగనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)-11సీజన్ కోసం పలు జట్లు తమ జట్ల కెప్టెన్ల పేర్లను ఇప్పటికే ప్రకటించగా, కోల్‌కోతా నైట్‌రైడర్స్ జట్టు మాత్రం ఇంకా కెప్టెన్ అన్వేషణలోనే ఉంది. తొలుత ఆసీస్ పవర్ హిట్టర్ క్రిస్ లిన్ కేకేఆర్ సారథ్య బాధ్యతలు చేపడతాడని భావించినా... అతను గతవారం పాకిస్తాన్ సూపర్ లీగ్(పీఎస్‌ఎల్)లో గాయపడ్డాడు. దాంతో ఐపీఎల్ నాటికి లిన్ ఫిట్ అయినప్పటికీ, అతనికి కెప్టెన్సీని అప్పజెప్పడం మాత్రం కష్టమనే చెప్పాలి. ఈ క్రమంలోనే పలువురు కీలక ఆటగాళ్ల పేర్లను కెప్టెన్సీ పదవి కోసం కేకేఆర్ అన్వేషిస్తోంది. ఇందులో దినేశ్ కార్తీక్‌తో పాటు రాబిన్ ఉతప్పలు ముందు వరుసలో ఉన్నారు. వీరిద్దరిలో ఒకరికి సారథ్య బాధ్యతల్ని అప్పగించే అవకాశం ఎక్కువగా ఉంది. కాకపోతే సునీల్ నరైన్ పేరును కూడా కేకేఆర్ యాజమాన్యం పరిశీలిస్తోంది. ఈ ఏడాది ఐపీఎల్ వేలానికి ముందుగానే గౌతం గంభీర్‌ను కేకేఆర్ వదులుకోవడంతో ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి ఆ ఫ్రాంచైజీ తర్జన భర్జనలు పడుతోంది.

దినేశ్ కార్తీక్..
గత సీజన్‌లో గుజరాత్ లయన్స్‌కు ఆడిన దినేశ్ కార్తీక్.. 14 మ్యాచ్‌ల్లో 361 పరుగులు నమోదు చేశాడు. మొత్తం 152 మ్యాచ్‌ల ఐపీఎల్ అనుభవం ఉన్న దినేశ్ కార్తీక్.. 2,903 పరుగులు సాధించాడు. ఇందులో 14 హాఫ్ సెంచరీలున్నాయి. ఇతనొక నమ్మకదగిన బ్యాట్స్‌మన్ కావడంతో పాటు వికెట్ కీపర్‌గా కూడా ప్రభావం చూపే క్రికెటర్. దాంతో దినేశ్ పేరు ఎక్కువగా వినిపిస్తోంది.

రాబిన్ ఉతప్ప...
గత ఐపీఎల్ సీజన్‌లో ఉతప్ప 388 పరుగులు చేశాడు. కేకేఆర్ తరపున 14 మ్యాచ్‌ల్లో ఆడి ఆ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. మొత్తం 149 మ్యాచ్‌ల్లో 3,735 పరుగులు నమోదు చేశాడు. ఇందులో 22 హాఫ్ సెంచరీలున్నాయి. 2014లో కేకేఆర్ టైటిల్ గెలవడంలో ఉతప్పది ప్రధాన పాత్ర. ఆ సీజన్‌లో 16 మ్యాచ్‌లు ఆడి 660 పరుగులు సాధించాడు.

సునీల్ నరైన్..
మిస్టరీ స్పిన్నర్‌గా పేరున్న సునీల్ నరైన్.. 2012 నుంచి కేకేఆర్ జట్టుకు ఆడుతున్నాడు. ఆ సీజన్‌లో 24 వికెట్లు సాధించిన నరైన్.. కేకేఆర్ తొలి ఐపీఎల్ టైటిల్‌ను అందుకోవడం ముఖ్య పాత్ర వహించాడు. ఇక 2013లో 22 వికెట్లు సాధించిన నరైన్.. 2014లో 21వికెట్లను ఖాతాలో వేసుకున్నాడు. 2015లో 7, 2016లో 11, 2017లో 10 వికెట్ల చొప్పున నరైన్ సాధించాడు.

శ్రీలంకకు ఎదురుదెబ్బ

కొలంబో :
వచ్చే నెల మొదటి వారంలో భారత్, బంగ్లాదేశ్ జట్లతో ఆరంభం కానున్న ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాల్గొనే శ్రీలంక జట్టుకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. శ్రీలంక కీలక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ గాయం కారణంగా సిరీస్ నుంచి వైదొలిగాడు. మాథ్యూస్‌కు కాలిపిక్క గాయం కావడంతో అతను ట్రైసిరీస్‌కు దూరమవుతున్న విషయాన్ని శ్రీలంక క్రికెట్ బోర్డు(ఎస్‌ఎల్‌సీ) ప్రకటించింది. ట్రై సిరీస్ నుంచి మాథ్యూస్ ఉన్నపళంగా తప్పుకోవడం నిరాశకు గురి చేసిందని లంక మేనేజ్‌మెంట్ పేర్కొంది. గత నెల్లో శ్రీలంక వన్డే జట్టుకు కెప్టెన్‌గా తిరిగి బాధ్యతలు స్వీకరించిన మాథ్యూస్.. కేవలం ఒక మ్యాచ్ మాత్రమే ఆడాడు. అయితే మాథ్యూస్‌కు గాయం పెద్దది కాకపోయినా, ఎస్‌ఎల్‌సీ వైద్య బృందం నుంచి క్లియరెన్స్ లభించలేదు. ఫలితంగా సిరీస్‌కు మాథ్యూస్ దూరం కానున్నాడు. మార్చి 6 నుంచి శ్రీలంకలో ట్రై సిరీస్ ఆరంభం కానుంది.

వన్డే జట్టులో రీ-ఎంట్రీ ఖాయం

న్యూఢిల్లీ:
దాదాపు ఏడాది క్రితం భారత పరిమిత ఓవర్ల క్రికెట్ నుంచి దూరమైన రవిచంద్రన్ అశ్విన్.. పునరాగమనం చేయడం కోసం శ్రమిస్తూనే ఉన్నాడు. కేవలం టెస్టు ఫార్మాట్‌కే పరిమితమైన ఈ సీనియర్ ఆఫ్ స్పిన్నర్.. పరిమిత ఓవర్ల క్రికెట్ జట్టులో చోటు కోల్పోవడం జీవితంలో భాగంగానే పేర్కొన్నాడు. అందుకోసం నిద్రలేని రాత్రులు ఏమీ గడపలేదన్నాడు. ఈ మేరకు వచ్చే ఐపీఎల్ సీజన్‌లో కింగ్స్ పంజాబ్‌కు కెప్టెన్‌గా ఎంపికైన అశ్విన్ మాట్లాడుతూ..తాను భారత పరిమిత ఓవర్ల జట్టులోకి పునరాగమనం చేయడం అనేది కచ్చితంగా జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశాడు. కాగా, దీనికోసం ఐపీఎల్‌ను ప్లాట్‌ఫామ్ చూడటం లేదన్నాడు. 'టీమిండియాలో రీఎంట్రీ కోసం ఐపీఎల్‌ను ప్రామాణికంగా చూడటం లేదు. ప్రతీ ఏడాది ఐపీఎల్ ఆడుతున్నట్లే ఈ ఏడాది కూడా ఆడుతున్నా. అదే మైండ్ సెట్‌తో పోరుకు సిద్ధమవుతున్నా. అయితే ఈ సీజన్‌లో నాపై అతి పెద్ద బాధ్యత పడింది. కెప్టెన్‌గా బాధ్యతలను సమర్ధంగా నిర్వర్తించడం నా ముందున్న సవాల్. ప్రస్తుతం దానిపైనే దృష్టి పెట్టా' అని అశ్విన్ తెలిపాడు.

అమ్మాయిల పోటీలు.. అబ్బాయి విజయం...!



సైప్రెస్:
అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన అమ్మాయిల కుస్తీ పోటీలో ఓ అబ్బాయి గెలుపొందాడు. అదెలాగ అనుకుంటున్నారా? అతడు ఓ ట్రాన్స్‌జెండర్. ఆమె నుంచి అతడుగా మారి లింగమార్పిడి చేయించుకున్న 18ఏళ్ల మాక్ బెగ్స్ టెక్సాస్ గర్ల్స్ క్లాస్ 6ఏ 110 పౌండ్ల డివిజన్‌లో విజయం సాధించాడు. హ్యూస్టన్‌కు సమీపంలోని సైప్రెస్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో చెల్సియా శాంచెజ్‌ను భారీ తేడాతో ఓడించి అతడు టైటిల్ దక్కించుకున్నాడు. గత ఏడాది కూడా అతడు చెల్సియాపైనే విజయం సాధించి ఈ టైటిల్‌ను దక్కించుకోవడం గమనార్హం. డలాస్‌కు సమీపంలోని ఈలస్ ట్రినిటీ హైస్కూల్‌లో చదువుకుంటున్న మాక్ బెగ్స్ అసలు పేరు మాకెన్జీ. అమ్మాయిగా జన్మించిన మాక్ అబ్బాయిగా మారేందుకు కొంతకాలంగా చికిత్స తీసుకుంటున్నాడు. చికిత్సలో భాగంగా అతడి శరీరంలో కొంత మోతాదులో టెస్టోస్టిరాన్ హార్మోన్‌ను కూడా ఎక్కించారు. అయితే టెక్సాస్ చట్టాల ప్రకారం.. ఆటగాళ్లు తమ జనన ధ్రువీకరణ పత్రంలో నమోదు చేసిన జెండర్ ప్రకారమే పోటీ పడాల్సి ఉంటుంది. మాక్ పుట్టినప్పుడు అమ్మాయిగా నమోదుచేసినందున ఇప్పుడు కుస్తీ పోటీల్లో అమ్మాయిల విభాగంలోనే పోటీ పడాల్సి వస్తోంది. అయితే మాక్‌కు అబ్బాయిల విభాగంలో పోటీ పడాలని అనుకుంటున్నాడట. కానీ సాధ్యపడలేదు. మాక్ విజయంపై మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. టెక్సాస్ చట్టాలపైనా, ట్రాన్స్‌జెండర్ హక్కులపైనా మాక్ విజయం పెద్ద చర్చకు తెరతీసింది. టెస్టోస్టిరాన్ తీసుకుంటూ అమ్మాయిలతో పోటీ పడడాన్ని కొందరు విమర్శిస్తున్నారు. స్కూల్ అథ్లెట్లు స్టెరాయిడ్స్ తీసుకోవడం నిషేధమని మరికొందరు అంటున్నారు. అయితే మాక్ చికిత్సలో భాగంగా చాలా తక్కువ మోతాదులో వైద్య అవసరం నిమిత్తం తీసుకోవడం నిబంధనలకు లోబడే ఉందని తెలిపారు. ఏదైమైనా తాను మాత్రం విజయం కోసం చాలా కష్టపడ్డానని, ఎవరేమనుకున్నా తాను చాంపియన్‌నే అని మాక్ తెలిపాడు.

కెప్టెన్‌గా అత్యధిక పరుగులు



ముంబై :
భారత క్రికెట్ జట్టు సారథి, రికార్డుల రారాజు విరాట్ కోహ్లి ఖాతాలో మరో అరుదైన ఘనత వచ్చి చేరింది. ఓ విదేశీ పర్యటనలో అత్యధిక పరుగులు చేసిన కెప్టెన్ల జాబితాలో కోహ్లి రెండో స్థానంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా మాజీ సారథి గ్రేమ్ స్మిత్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సఫారీ గడ్డపై విరాట్ సేన పర్యటన ముగిసింది. మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌ను కోల్పోయిన భారత్ ఆ తర్వాత జరిగిన వన్డే, టీ20 సిరీస్‌లను సొంతం చేసుకుంది. వెన్ను నొప్పి కారణంగా దక్షిణాఫ్రికా-భారత మధ్య జరిగిన చివరి టీ20కి మాత్రమే కోహ్లి విశ్రాంతి తీసుకున్నాడు. మిగతా అన్ని మ్యాచ్‌లు ఆడాడు. మూడు ఫార్మాట్లలో 14 ఇన్నింగ్స్‌ల ద్వారా కోహ్లి చేసిన పరుగులు 871. ఇందులో నాలుగు శతకాలు, రెండు అర్ధ శతకాలు ఉన్నాయి. దీంతో కోహ్లి ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ అలెన్ బోర్డర్ రికార్డును అధిగమించాడు. 1985లో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన ఆసీస్ జట్టుకు నాయకత్వం వహించిన బోర్డర్ 14 ఇన్నింగ్స్‌ల ద్వారా 785 పరుగులు సాధించాడు. దక్షిణాఫ్రికా మాజీ సారథి గ్రేమ్ స్మిత్ 2003లో ఇంగ్లండ్ పర్యటనలో 16 ఇన్నింగ్స్‌ల ద్వారా 937 పరుగులు సాధించి.. విదేశీ పర్యటనల్లో కెప్టెన్‌గా అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కోహ్లి (14 ఇన్నింగ్స్‌లు, 871 పరుగులు), బోర్డర్(14 ఇన్నింగ్స్‌లు, 785 పరుగులు), అలెస్టర్ కుక్(13 ఇన్నింగ్స్‌లు, 769 పరుగులు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

స్పిన్ మిసైల్ మరో రికార్డు

ముంబై : ఆఫ్ఘనిస్తాన్ లెగ్‌స్పిన్నర్ రషీద్‌ఖాన్ స్పిన్ మిస్సైల్‌గా పిలుచుకునే ఆఫ్ఘనిస్తాన్ లెగ్‌స్పిన్నర్ రషీద్‌ఖాన్ మరో రికార్డు సృష్టించాడు. అతి చిన్న వయసులోనే కెపెన్సీ బాధ్యతలు చేపట్టి అరుదైన రికార్డును అందుకున్నాడు. అఫ్ఘనిస్తాన్ కెప్టెన్ అస్గర్‌కు శస్త్ర చికిత్స జరగడంతో అతని స్థానంలో రషీద్‌కు తాత్కాలిక

హోదా ఉద్యమంపై ఉక్కుపాదం

- విజయవాడలో పికెట్ నిర్వహిస్తున్న సీపీఐ, సీపీఎం నేతల అరెస్ట్



విశాలాంధ్ర-విజయవాడ :
'ప్రత్యేక హోదా భిక్ష కాదు... ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో సీపీఐ, సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యాన మంగళవారం విజయవాడ బందరు రోడ్డులోని ఆలిండియా రేడియో స్టేషన్ ఎదుట పికెట్ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలపై పోలీసులు ఉక్కుపోదం మోపారు. వందలాది మంది

బీజేపీ, టీడీపీ దొంగ నాటకాలు

- అధికార, ప్రతిపక్షపార్టీలు కార్పొరేట్లకు దాసోహం
- సీపీఐ గుంటూరు జిల్లా మహాసభలో రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర- మంగళగిరి :
రాష్ట్రానికి ప్రత్యేకహోదా విషయంలో బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలు దొంగనాట

రాష్ట్రానికి హోదా విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకమాట చెబుతుంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు మరొక మాట మాట్లాడు తున్నారన్నారని, వారి నాటకాలను ఎండగడతా మన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధనకు సీపీఐ ఉద్యమం సాగిస్తుందన్నారు. విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో రాజధాని ప్రాంతంలో రూ. 20 లక్షల కోట్లు పెట్టుబడులు వాగ్దానాలు వచ్చాయన్న ముఖ్యమంత్రి మాటల్లో

ఉద్యమించాలన్నారు. కమ్యూనిస్టులు ప్రజల కోసం త్యాగాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కుల, మతాలకు అతీతంగా స్వతంత్ర రాజకీయ పంథాతో సీపీఐ ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ దేశ ప్రజలను కేంద్ర ప్రభుత్వం దోపిడీ చేస్తున్నదన్నారు. దేశంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు